ఆంధ్రభూమి

సంపుటి: 29 . సంచిక: 233 | విజయవాడ సిటీ | హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడ, రాజమహేంద్రవరం, అనంతపురం, కరీంనగర్, నెల్లూరు | www.andhrabhoomi.net | మంగళవారం 23 జనవరి, 2018 | 20 పేజీలు | ధర: రూ.3.00

శుభోదయం

కలియుగం - 5119
శాలివాహన శకం - 1939

శ్రీ చాంద్రమాన హేమలంబ నామ సం॥
ఉత్తరాయణం, శిశిరఋతువు, మాఘమాసం,
శుక్లపక్షం; తిథి: శుద్ధ షష్ఠి మ.12.29;
నక్షత్రం: రేవతి రా.తె.4.54;
వర్జ్యం: సా.4.54 నుండి 6.30 వరకు;
దుర్ముహూర్తం:ఉ.08.24 నుండి 09.12
వరకు, తిరిగి రా.10.48 నుండి 11.36 వరకు
రాహుకాలం: మ.3.00 నుండి 4.30 వరకు

భళిరా భారత్!


దావోస్‌లో ఎటుచూసినా దర్శనమిస్తున్న నరేంద్ర మోదీ బ్రాండ్ హోర్డింగ్‌లు

- చాయ్ హాయ్.. దోశ అబ్బో.. ■ ప్రగతి ప్రచారమూ అద్భుతమే
- దావోస్‌ను కమ్మేసిన మోదీ ■ అన్ని చోట్లా లాంజ్‌లు, బిల్ బోర్డులు

దావోస్, జనవరి 22: అంతర్జాతీయ ఆర్థిక ఫోరం (డబ్ల్యుఈఎఫ్)వార్షిక భేటీకి వేదికైన దావోస్ భారతీయతతో మార్మోగిపోతోంది. ప్రపంచం నలు దిశల నుంచి వ్యాపార, వాణిజ్య దిగ్గజాలు తరలివస్తున్న దావోస్‌లో ఎటూ చూసినా 'భారత్.. భారత్..' అన్న నినాదాలతో కూడిన బిల్ బోర్డులు, లాంజ్‌లు భారత దేశం సాధించిన అభివృద్ధిని, భారత కంపెనీల ఖ్యాతిని చాటిచెప్పే రీతిలో నలుమూలలా కనిపిస్తున్నాయి. ప్రధాన రహదారులపైనే కాదు..చిన్నచిన్న సందులు కూడా భారత్‌కు చెందిన ప్రభుత్వ, ప్రైవేటు కంపెనీలు ఏర్పాటు చేసిన లాంజ్‌లతో నిండిపోయాయి. 20 ఏళ్ల తర్వాత భారత ప్రధాని ఈ వార్షిక సదస్సుకు హాజరు కావడం, ఈ మూడున్నరేళ్ల కాలంలో దేశ ఖ్యాతి, విఖ్యాతి ప్రపంచం నలుమూలలా విస్తరించడంతో అందరి దృష్టి భారత్‌పై కేంద్రీకృతమైంది. ఇంతలో ఇంత మార్పా అన్న ఆతృతా అందరిలోనూ కనిపిస్తోంది. భారతీయ ప్రగతికే కాదు..భారతీయ వంటకాల ఘుమఘుమలూ అతిథుల

- మిగతా 7వ పేజీలో

దేశాలన్నిటి గమ్యపు
దశ-దిశలను నిర్ణయించు దావోస్ భేటీ
రాశిని వాసిని పెంచెడి
ఆశాకిరణముగ మోది హాజరు మెరసెన్

అంతపనీ అమ్మే చేసింది!

- పసిబిడ్డతో అపార్టుమెంటు నుంచి దూకిన తల్లి
- పిల్లల అనారోగ్యాన్ని తట్టుకోలేకే ఘాతుకం

శేరిలింగంపల్లి, జనవరి 22: చందానగర్‌లో విషాదం చోటుచేసుకుంది. తన తొమ్మిది నెలల పసిగుడ్డును ఎత్తుకుని తల్లి అపార్టుమెంటుపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పీజేఆర్ ఎన్‌క్లేవ్ రోడ్డులో గల కేఎస్‌ఆర్ ఎన్‌క్లేవ్ కాలనీలో గల సాయి పెరల్ రెసిడెన్సీలోని ఫ్లాట్ నెంబర్ 503లో స్వాతి, ప్రదీప్ కుమార్ దంపతులు నివసిస్తున్నారు. భర్త సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ కాగా భార్య గృహిణి. వీరికి అయిదేళ్ల కొడుకు అరుష్‌రామ్, తొమ్మిది నెలల కూతురు సాన్వి

- మిగతా 7వ పేజీలో


మల్లిఖార్జున రెడ్డిని చెప్పుతో కొడుతున్న దృశ్యం

రెండు రాష్ట్రాల్లో పోటీ

బలమున్నచోట బరిలోకి దిగుతాం ● ఇక పూర్తి సమయం రాజకీయాలకే

- అందుకే క్షేత్రస్థాయి పర్యటనలు ● తెలంగాణలో స్మార్ట్‌గా సీఎం పాలన ● పరిష్కార రాజకీయాలకే ప్రాధాన్యత
- 27నుంచి అనంతపూర్‌లో కరవు యాత్ర ● జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ప్రకటన
- రాజధానిలో తిలకందిద్దిన భార్య లెజినోవా ● మహిళా విభాగానికి పోర్టల్ ఏర్పాటు

ఆంధ్రభూమి బ్యూరో

కరీంనగర్/ హైదరాబాద్, జనవరి 22: ఇకనుంచి సినిమాలపై ఎక్కువ దృష్టి పెట్టనని, పూర్తి సమయం రాజకీయాలకే కేటాయిస్తానని ప్రముఖ సినీ నటుడు, జనసేన అధినేత కొణిదెల పవన్ కళ్యాణ్ ప్రకటించారు. కొండగట్టులో ఆంజనేయ స్వామిని దర్శించుకున్న అనంతరం జనసేన సమన్వయకర్తల సమావేశంలో పాల్గొనేందుకు సోమవారం మధ్యాహ్నం కరీంనగర్ జిల్లా కేంద్రానికి వచ్చిన ఆయన సాయంత్రం హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. ఆంజనేయస్వామి ఆశీస్సులతోనే 2009లో బతికి బట్ట కట్టానని, అంజన్న అనుగ్రహంతోనే పార్టీని స్థాపించానని తెలిపారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో రెండు తెలుగు రాష్ట్రాల్లో జనసేన పార్టీ పోటీ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్టు వెల్లడించారు. తమకు బలమున్న చోట తమ పార్టీ అభ్యర్థులు బరిలో ఉంటారని తెలిపారు. తెలంగాణవాసులకు ఇష్టదైవమైన కొండగట్టు నుంచి రాజకీయ యాత్ర ప్రారంభించినట్టు స్పష్టం చేశారు. మూడ్రోజుల పాటు రాష్ట్రంలో పర్యటించి, కార్యకర్తలు, శ్రేయోభిలాషుల సలహాలు, సూచనలు తీసుకున్న అనంతరమే తమ పార్టీ విధానాలు ప్రకటిస్తామని తెలిపారు. తెలంగాణలో ప్రజల సమస్యలపై తమ కార్యకర్తల ద్వారా నివేదికలు సేకరించి, ముఖ్యమంత్రి కేసీఆర్‌కు విన్నవిస్తామని, ఈనెల 27న ఆంధ్రప్రదేశ్‌లోని

- మిగతా 7వ పేజీలో

కదిలిందీ జనసైన్యం
అదిరిందీ రాజకీయ ఆశల సౌధం
బెదిరిన పార్టీలన్నీ
పదునగు వ్యూహాల కొరకు పరుగులు పెట్టెన్

పరుగులు పెట్టిస్తున్న 'పవన్'

- అప్రమత్తమైన అన్ని పార్టీలు
- అందరి కళ్లూ జనసేన పైనే..

3


కొండగట్టు అంజన్న సన్నిధిలో పూజలు చేస్తున్న జనసేన అధినేత పవన్ కళ్యాణ్


పల్లమాల పాదయాత్రలో వృద్ధులను పలకరిస్తున్న వైకాపా అధ్యక్షుడు జగన్

ప్రత్యేక హోదా ఇస్తే బీజేపీతో కలిసి నడుస్తా

- జాతీయ మీడియాతో జగన్

ఆంధ్రభూమి బ్యూరో

తిరుపతి/ బుచ్చినాయుడు కండ్రిగ, జనవరి 22: రాష్ట్ర విభజన నేపథ్యంలో పార్లమెంట్‌లో నిర్ణయించిన ప్రకారం కేంద్రం ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇస్తే రానున్న ఎన్నికల్లో ఏ ఇతర ఆలోచనలు లేకుండా బీజేపీతో కలసి నడవడానికి తాను సిద్ధమేనని వైకాపా అధినేత జగన్మోహన్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రజా సంకల్పయాత్రలో భాగంగా 68వ రోజైన సోమవారం బుచ్చినాయుడు కండ్రిగ మండలంలో పాదయాత్ర సందర్భంగా జాతీయ మీడియాతో మాట్లాడారు. 2019 ఎన్నికల్లో బీజేపీతో పొత్తుపెట్టుకుంటారా? అన్న ప్రశ్నకు పైవిధంగా స్పందించారు. ఏపీలో జాతీయ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీల ప్రభావం అంతగాలేదన్న జగన్,

- మిగతా 7వ పేజీలో

రోడ్డెక్కిన పోలీస్ పరువు

- మహిళా డీఎస్పీతో సీఐ వివాహేతర బంధం
- రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న భర్త
- ఇద్దరి సస్పెన్షన్‌కు రంగం సిద్ధం
- కేపీహెచ్‌బీలో సీఐపై కేసు నమోదు

హైదరాబాద్/ కేపీహెచ్‌బీ కాలనీ, జనవరి 22: వివాహేతర సంబంధాలను అడ్డుకోవాల్సిన పోలీసులూ అదేదారిలో నడుస్తున్నారు. డిఎస్పీ స్థాయి మహిళా అధికారి, ఇన్‌స్పెక్టర్ హోదాలో ఉన్న వ్యక్తికి మధ్య కొనసాగుతున్న వివాహేతర సంబంధం బట్టబయలైంది. మహిళా అధికారి భర్తే రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నాడు. సంఘటన పట్ల పోలీస్ ఉన్నతాధికారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. డిపార్ట్‌మెంటల్ యాక్షన్ కింద రేపోమాపో సస్పెన్షన్ ఉత్తర్వులు

- మిగతా 7వ పేజీలో


ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో జ్యూరిచ్‌తో సిస్టర్ స్టేట్ ఒప్పందం కుదుర్చుకుంటున్న దృశ్యం

పెట్టుబడులకు పయనీర్ సిద్ధం

- సీఎం దావోస్ పర్యటనలో శుభారంభం
- చైర్మన్ రావ్ పాల్‌తో విస్తృత సమావేశం
- జ్యూరిచ్‌తో సిస్టర్ స్టేట్ ఒప్పందం

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

అమరావతి, జనవరి 22: ఉద్యాన పంటల సాగును ఉద్యమ స్ఫూర్తితో కొనసాగిస్తున్నామని, రానున్న కాలంలో ఆంధ్రను ఉద్యాన పంటల కేంద్రంగా తీర్చిదిద్దుతామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. రైతుల ఆర్థిక స్థితిగతులను వ్యవసాయం మరింత పరిపుష్టం చేయాలన్నది తమ లక్ష్యమని, లాభసాటి సాగు ధ్యేయంగా పనిచేస్తున్నట్లు బాబు వివరించారు. రాష్ట్రంలో వ్యవసాయాన్ని ప్రాథమిక రంగంగా గుర్తించి, ప్రాంతానికో ప్రణాళికతో పనిచేస్తున్నామన్నారు. ప్రపంచ ఆర్థిక ఫోరం ఆహ్వానం మేరకు 4 రోజుల పర్యటనకు దావోస్ వెళ్లిన బాబు బృందానికి జ్యూరిచ్‌లో ఘన స్వాగతం లభించింది. పర్యటనలో భాగంగా తొలిరోజు 'పయనీరింగ్ వెంచర్స్' చైర్మన్ రోన్‌పాల్, చీఫ్ ఇన్వెస్టర్ ఆఫీసర్ సందీప్ రాజ్‌తో సమావేశంలో సీఎం పాల్గొన్నారు. తక్కువ పెట్టుబడితో అత్యధిక దిగుబడుల సాధనకు టెక్నాలజీని వినియోస్తున్నట్టు వివరించారు. ప్రస్తుతం 40 లక్షల ఎకరాలకు పరిమితమై ఉన్న ఉద్యాన పంటల సాగును కోటి ఎకరాలకు విస్తరించాలన్న దార్శనికతతో పనిచేస్తున్నామన్నారు. కొన్ని జిల్లాల్లో కరవు పరిస్థితులు ఏర్పడినా వ్యవసాయంలో వృద్ధిరేటు పెరిగిందని, వర్షపాతం తక్కువ ఉన్నప్పటికీ, రెయిన్ గన్లు, మొబైల్ ఇరిగేషన్ లాంటి రక్షక చర్యలతో వ్యవసాయ రంగం రెండంకెల వృద్ధిని సాధించిందని ముఖ్యమంత్రి వివరించారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు దేశంలోనే తొలిసారిగా సెన్సర్లు, డ్రోన్లు వినియోగిస్తున్నట్లు

- మిగతా 7వ పేజీలో

సాగులో ఏపీ టాపర్

- రూ 5వేల కోట్లతో మూడోవిడత రుణమాఫీ ● రైతురథం పథకం కింద 12వేల 800 ట్రాక్టర్లు
- కిసాన్‌మేళాలో మంత్రులు సోమిరెడ్డి, ప్రత్తిపాటి ● లాంలో రీజనల్ అగ్రికల్చర్ రీసెర్చ్ స్టేషన్‌కు శంకుస్థాపన

ఆంధ్రభూమి బ్యూరో


గుంటూరు, జనవరి 22: వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చటమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందని వ్యవసాయ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం గుంటూరు సమీపంలోని లాంలోని ఆచార్య ఎన్జీ రంగా విశ్వవిద్యాలయం, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా కేంద్రంలో ఏర్పాటుచేసిన కిసాన్‌మేళాను మంత్రి సోమిరెడ్డితో పాటు పౌరసరఫరాల శాఖ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు ప్రత్తిపాడు ఎమ్మెల్యే రావెల కిషోర్ బాబు అధ్యక్షత వహించారు. మంత్రి సోమిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం వ్యవసాయ రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వడం వల్లే ఈ ఏడాది మొదటి అర్థ సంవత్సరంలో రాష్ట్రంలో వ్యవసాయరంగం 25.65 శాతం వృద్ధిరేటు సాధించి దేశంలోనే మొదటి స్థానంలో నిలిచిందన్నారు. సాగురంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా రైతులు పంటలు వేయాలని సూచించారు. దేశంలో

- మిగతా 7వ పేజీలో


గుంటూరులో నిర్వహించిన కిసాన్‌మేళాలో మాట్లాడుతున్న మంత్రి సోమిరెడ్డి


బాసర క్షేత్రం సోమవారం వసంతశోభ సంతరించుకుంది. వసంతపంచమి సందర్భంగా బాసర అమ్మవారిని అశేష భక్తులు దర్శించుకుని పూజలు నిర్వహించారు. వసంత పంచమి ఉత్సవాల సందర్భంగా ఆలయంలోని అమ్మవార్లకు పట్టువస్త్రాలు తీసుకువస్తున్న రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి, దేవాదాయ శాఖమంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి తదితరులు

ఘనగామా



ఎంత సెంటిమెంట్ అయినా... ఇలా వెళ్తే షూటింగ్ అనుకుంటారేమో?!

కులాలపై 'దేశం' కన్ను!

- ఓసీల నుంచి బీసీల వరకూ అన్ని వర్గాలకూ ప్రయోజనాలు
- దళితుల ఇళ్లకు 'టీడీపీ' నేతలు
- వైసీపీ నుంచి దళితులను వేరు చేసే ఎత్తుగడ?
- ఎన్నికలకు ముందస్తుగా బాబు వ్యూహం

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

అమరావతి, జనవరి 22: తెలుగు దేశం పార్టీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికలకు ముందస్తు వ్యూహరచనలో నిమగ్నమయ్యారు. అందులో భాగంగా అత్యంత కీలకమైన కులాల ఓట్లపై కన్నేశారు. 2004నాటి మాదిరిగా తన ప్రభుత్వాన్ని దింపేయాలన్నంత కసి, పట్టుదల ఏ వర్గంలోనూ ఇప్పుడు లేక పోవడం, గత ఎన్నికల్లో కేవలం ఐదు న్నర లక్షల ఓట్ల తేడాతోనే ప్రభుత్వం లోకి వచ్చిన వైనాన్ని విశ్లేషించుకున్న బాబు.. ఇప్పుడు కులాలకు చేరువయ్యే పనిలో ఉన్నారు. ఆ మేరకు పార్టీకి చెందిన ఆయా కుల నేతలను ఇప్పటినుంచే జనక్షేత్రంలో దించుతున్నారు. ప్రతిష్ఠాత్మకంగా మారిన వచ్చే ఎన్నికల్లో కచ్చితంగా గెలిచి తీరతామని, అయితే మెజారిటీనే ముఖ్యమని బాబు ఇటీవలి కాలంలో తరచూ చెబుతున్నారు. అందులో భాగంగా కులాలపై దృష్టి సారించాలని నిర్ణయించారు. అందుకే ఇటీవలి కాలంలో, ఓసీల నుంచి బీసీల వరకూ ఎస్సీల నుంచి ఎస్టీల వరకూ అన్ని కులాలకు ప్రయోజనాలు కల్పించే కార్యక్రమాలు, పథకాలపై దృష్టి సారిస్తున్నారు. ఎన్టీఆర్ హయాం నుంచీ టీడీపీని సంప్రదాయకంగా వ్యతిరేకించే బ్రాహ్మణ సామాజిక వర్గం, గత ఎన్నికల్లో బాబు నాయకత్వంలోని టీడీపీ వైపు మొగ్గుచూపింది. దానితో తాను అధికారంలోకి వస్తే బ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటుచేస్తామని హామీ ఇచ్చారు. సీఎం అయిన తర్వాత వారి కోసం 500 కోట్లతో కార్పొరేషన్ ఏర్పాటు చేశారు. ఫలితంగా ప్రస్తుతం ఆ సామాజికవర్గంలో ఇతర పార్టీలకు చెందిన వారు కూడా టీడీపీలో చేరుతున్న పరిస్థితి నెలకొంది. 'ఇప్పుడు రాష్ట్రంలో బ్రాహ్మణుల్లో మెజారిటీ శాతం టీడీపీవైపే ఉన్నారు. కార్పొరేషన్‌తో వారి జీవన స్థితి మారింది. అంతా స్కాలర్‌షిప్పులతో చదువుకుంటున్నారు. చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటున్నారు. ఇంతకుమించి ఏ బ్రాహ్మణుడైనా ఏం ఆశిస్తార'ని గుంటూరు టీడీపీ బ్రాహ్మణ నేత సిరిపురపు శ్రీధర్ ప్రశ్నించారు. అదేవిధంగా గత ఎన్నికల్లో కాంగ్రెస్, వైసీపీని కాదని తనకు జైకొట్టిన కాపులను మెప్పిస్తూ వెయ్యి కోట్లతో కార్పొరేషన్ ఏర్పాటుచేశారు. దానితో టీడీపీని సంప్రదాయకంగా వ్యతిరేకించే కాపులు మొత్తం కాకపోయినా, దాదాపు 60 శాతంపైగా కాపు వర్గం ప్రస్తుతం టీడీపీకి మద్దతునిస్తోంది. ఆ వర్గం శాసించే కాకినాడ కార్పొరేషన్ ఎన్నికల్లో టీడీపీ విజయభేరి మోగించడమే దానికి నిదర్శనమంటున్నారు. గత ఎన్నికల్లో దన్నుగా నిలిచిన కాపు ఓటు బ్యాంకును శాశ్వతం చేసుకునేందుకు, వారిని బీసీల్లో చేర్చుతూ ఇటీవలి అసెంబ్లీ సమావేశాల్లో తీర్మానం ఆమోదించి కేంద్రానికి పంపారు. ఈ చర్యలతో.. ప్రతిసారి వ్యక్తిగతంగా బాబును, సంస్థాగతంగా టీడీపీని వ్యతిరేకించే కాపు ఉద్యమ నేత ముద్రగడ కూడా బాబుకు కృతజ్ఞతలు ప్రకటించాల్సిన అనివార్యత ఏర్పడింది. 'బాబుకు కాపులు జీవితాంతం రుణపడి ఉంటారు. ఏ సీఎం చేయనివిధంగా మమ్మల్ని బీసీలో చేర్చుతూ తీర్మానించారు. గతంలో కాంగ్రెస్ మమ్మల్ని వాడుకుని, టీడీపీకి వ్యతిరేకంగా ఉసిగొల్పింది. ఇప్పుడు కాపు జాతి నిజాలేమిటో గ్రహించింద'ని కాపునేత చందు సాంబశివరావు వ్యాఖ్యానించారు. తాజాగా బీసీ, ఎస్సీలపై బాబు దృష్టి సారించారు. బాబు తొమ్మిదేళ్ల సీఎంగా ఉన్నప్పుడు విజయవంతమైన ఆదరణ పథకాన్ని పునరుద్ధరిస్తూ తాజాగా క్యాబినెట్ నిర్ణయించింది. రాష్ట్రంలో జనాభాపరంగా అత్యధికంగా ఉన్న బీసీలను మెప్పించే ఈ నిర్ణయం ఖరీదు 400 కోట్లు. దీనివల్ల రెండున్నర లక్షల మంది బీసీలు లబ్ధిపొందనున్నారు. గ్రామాల్లో ఎక్కువగా ఉండే గొర్రెలు, పశువుల పెంపకందారులు, కల్లుగీత కార్మికులు, మత్స్యకారులు, చేనేత, బంగారం, వడ్రంగి, రజక, నాయీ బ్రాహ్మణులు వంటి 124 బీసీ కులాల వారికి ఈ పథకం వర్తించనుంది. ఆ రకంగా ఆ వర్గాలను గంపగుత్తగా ఆకట్టుకునే రాజకీయ ఎత్తుగడకు బాబు తెరలేపారు. ఇక బీసీల తర్వాత జనాభాపరంగా ఎక్కువగా ఉన్న దళితుల విషయంలో బాబు ప్రత్యేక రాజకీయ వ్యూహంతో వెళుతున్నారు. వారిని వైసీపీ నుంచి మానసికంగా దూరం చేసే కార్యక్రమాలకు పదునుపెడుతున్నారు. రాష్ట్ర విభజన తర్వాత మాలల సంఖ్య ఎక్కువ, మాదిగల సంఖ్య వారి కంటే నాలుగున్నర లక్షలు తక్కువైన నేపథ్యంలో.. గత ఎన్నికల ముందు వైకాపాకు జైకొట్టిన మాల వర్గాన్ని ముందుగా దరిచేర్చుకునే వ్యూహానికి తెరలేపారు. అందులో భాగంగా వైకాపాలో ఉన్న మాల నేతలను పెద్ద సంఖ్యలో పార్టీలో చేర్చుకుని వారికి కార్పొరేషన్ ఛైర్మన్, పార్టీ పదవులు ఇచ్చారు. దానితో మాలలు సంప్రదాయకంగా వైకాపాకు మానసిక మద్దతుదారులన్న ముద్రను చెరిపేసి, వారిని టీడీపీ వైపు మళ్లించే బాధ్యతను మాల నేతలు భుజానెత్తుకునే పరిస్థితి ఏర్పడింది. విభజనకు ముందు వరకూ మాలలు కాంగ్రెస్, మాదిగలు టీడీపీలో కొనసాగుతున్న పరిస్థితి ఉండేది. విభజన తర్వాత పరిస్థితి మారడంతో పార్టీ మాలలను ఆకర్షించి, మాదిగలను విస్మరిస్తోందన్న అసంతృప్తి పార్టీలోని మాదిగల్లో పెరిగింది. దాన్ని గమనించిన బాబు కార్పొరేషన్లు, పార్టీ పదవుల్లో వారికీ స్థానం కల్పించారు. ఒకదశలో ఆ వర్గానికే పార్టీ ఏపీ అధ్యక్ష పదవి ఇవ్వాలన్న చర్చ కూడా జరిగిన విషయం తెలిసిందే. ఇప్పటివరకూ మాదిగలకు రాజ్యసభ ఇవ్వని నేపథ్యంలో, వచ్చే ఎన్నికల్లో ఆ వర్గానికి రాజ్యసభ ఇవ్వడం ద్వారా, మాదిగలను పూర్తిస్థాయిలో సంతృప్తిపరిచే యోచనలో ఉన్నట్లు సమాచారం. ఇదిలాఉండగా, 26 నుంచి అంబేద్కర్ జయంతి నాడు ఏప్రిల్ 14 వరకూ రాష్ట్రంలో ఉన్న మాల, మాదిగ పల్లెల్లో పార్టీ నేతలు పర్యటించి, ప్రతి ఇంటి తలుపు తట్టే కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ మూడు నెలల పాటు ప్రతి ఒక్క నేత దళితవాడల్లో కార్యక్రమాలు నిర్వహించి, మండల-నియోజకవర్గ-జిల్లా స్థాయిలో సభలు నిర్వహించనున్నారు. ఆ తర్వాత ఇబ్రహీంపట్నంలో బాబు జన్మదినం రోజు లక్ష మందితో దళిత మహాసభ నిర్వహించడం ద్వారా, టీడీపీ దళితులదేనన్న మానసిక భావన తీసుకువచ్చే కార్యక్రమాలు రూపొందించారు. 'దళితవాడల్లో కేవలం మా పార్టీ దళిత నేతలే కాదు. పార్టీకి చెందిన అన్ని స్థాయిల వారు పర్యటించి, వారికి పార్టీ ఏమేమి ప్రయోజనాలు కల్పించిందో వివరిస్తాం. మిగిలిన పార్టీలు వారిని ఓటు బ్యాంకుగా ఎలా మార్చుకుంటున్నాయో అర్థమయ్యేలా చెబుతాం. ప్రధానంగా దళితులు ఆరాధించే అంబేద్కర్‌ను కాంగ్రెస్ ఎలా అవమానించిందో, మా పార్టీ ఏవిధంగా గౌరవించిందో వాడవాడలా స్పష్టం చేస్తా'మని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వర్ల రామయ్య వివరించారు. ఇవి కాకుండా రానున్న ఎన్నికల నేపథ్యంలో, జిల్లాల స్థాయిలో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులను ఈ నెలాఖరులోగా భర్తీ చేయాలని తాజా క్యాబినెట్‌లో నిర్ణయించడం ద్వారా, దళిత నిరుద్యోగ వర్గాలకు చేరువయ్యే ప్రయత్నాలు ప్రారంభించినట్లు కనిపిస్తోంది. రాష్ట్రంలో చాలాకాలం నుంచీ పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల జీతాలను సగానికి పెంచుతూ క్యాబినెట్ నిర్ణయించింది.

దీనివల్ల పదిన్నర కోట్ల భారం పడనుంది. ఈ నిర్ణయం వేలాది మంది తాత్కాలిక ఉద్యోగులను చేరువ చేస్తుందన్న ధీమా పార్టీ వర్గాల్లో వ్యక్తమవుతోంది.

ఆర్థికేతర విజ్ఞప్తులన్నీ

నెలాఖరులోగా పరిష్కరించాలి: సీఎస్

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 22: ప్రజల నుండి వచ్చిన విజ్ఞాపనలు, అర్జీలలో ఆర్థికేతరమైన అంశాలకు సంబంధించిన అర్జీలన్నిటినీ జనవరి నెలాఖరులోగా పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్‌కుమార్ జిల్లా కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులకు స్పష్టం చేశారు. ఈమేరకు సోమవారం వెలగపూడి సచివాలయంలోని ఆయన కార్యాలయంలో ఫిర్యాదుల పరిష్కారంపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులు, విజ్ఞాపనలను సకాలంలో పరిష్కరించేందుకు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముఖ్యంగా జన్మభూమి, జన్మభూమికి ముందు ప్రజల నుండి వచ్చిన అర్జీలను ఆర్థిక, ఆర్థికేతరమైన వాటిగా



విభజించి వాటిలో ఆర్థికేతరమైన విజ్ఞాపనలన్నిటినీ ఈ నెలాఖరులోగా పరిష్కరించాలని ఆదేశించారు. ఇందుకు సంబంధించి వెంటనే అందరు జిల్లా కలెక్టర్లు, ఆయా శాఖాధికారులకు డీఓ లేఖ రాయాలని సంబంధిత అధికారులను సీఎస్ ఆదేశించారు. వచ్చిన అర్జీల్లో ఆర్థిక, ఆర్థికేతర విజ్ఞాపనలు వేరుచేయడమే గాక మరలా వాటిలో వ్యక్తిగత,సామాజికపరమైన వాటిని విభజించి వాటి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని చెప్పారు. వ్యక్తిగత, సామాజికపరమైన అంశాలకు సంబంధించిన ఆర్థికపరమైన విజ్ఞాపనలను జిల్లా, శాఖల వారీగా విభజించి వాటి పరిష్కారానికి ఎంత మొత్తం నిధులు అవసరం ఉంటుందో నివేదిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఫిర్యాదుల పరిష్కారంపై తాను ఎప్పటికప్పుడు సమీక్షిస్తానని స్పష్టం చేశారు. ఫిర్యాదులన్నిటినీ సకాలంలో పరిష్కరించేందుకు ఆయా శాఖల అధికారులు సత్వర చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రణాళికా శాఖ ప్రత్యేక కార్యదర్శి పివి చలపతిరావు, ప్రణాళికా శాఖ సంచాలకుడు గోపాల్, రియల్ టైమ్ గవర్నెన్స్ డైరక్టర్ ఎ.బాలాజీ తదితరులు పాల్గొన్నారు.


నైపుణ్య శిక్షణకు ఐసెక్ట్‌తో రెండు ఒప్పందాలు

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 22: ఎస్సీ నిరుద్యోగ యువతకు నైపుణ్యంలో శిక్షణ ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో ఐసెక్ట్ (ఎఐఎస్ఇసిటి) రెండు ఒప్పందాలు చేసుకుంది. ఎపి స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా నంద్యాల, గుంటూరు, చిత్తూరు జిల్లాల్లోని ఎస్సీ నిరుద్యోగ యువత 120 మందికి నైపుణ్యం పెంపొందించేందుకు వీలుగా శిక్షణ ఐసెక్ట్ ఇవ్వనుంది. రికగ్నిషన్ ఆఫ్ ప్రయర్ లెర్నింగ్ సిఫారసుల మేరకు నెల్లూరు, విశాఖ, చిత్తూరు, గుంటూరు, తూర్పు గోదావరి జిల్లాల్లోని 500 మందికి శిక్షణ ఇవ్వనున్నారు. రాష్ట్రంలో ఎస్సీ జనాభా 17.1 శాతం ఉంది. ఇది జాతీయ స్థాయి సగటు కన్నా ఎక్కువగా ఉండటంతో ఈ వర్గాలపై దృష్టి సారించాల్సిన అవసరాన్ని ప్రభుత్వం గుర్తించింది. నిరుద్యోగ యువతకు శిక్షణ ఇచ్చి, ఉపాధి కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే అమలు చేస్తున్న పథకం కింద ఐసెక్ట్ శిక్షణ ఇవ్వనుంది, 30 మందికి మెడికల్ యూత్ రిప్రజెంటేటివ్స్‌గా, 30 మందికి జనరల్ డ్యూటీ అసిస్టెంట్స్‌గా, 60 మందికి రిటైల్ అసోసియేట్స్‌గా శిక్షణ ఇవ్వనున్నారు. మరో ఒప్పందంలో రికగ్నిషన్ ఆఫ్ ప్రియర్ లెర్నింగ్ కింద శిక్షణ కార్యక్రమాన్ని అమలు చేసేందుకు ప్రాజెక్టు ఇంప్లిమెంటేషన్ ఏజెన్సీగా ఐసెక్ట్‌ను నియమిస్తూ ఒప్పందం చేసుకుంది. నెల్లూరు, విశాఖలో 200 మందికి స్కిల్డ్ సూయింగ్ మెషిన్ ఆపరేటర్లుగా, చిత్తూరులో 200 మందికి సిసిటీవీ ఇన్‌స్టలేషన్ టెక్నీషియన్లుగా, గుంటూరు, తూర్పు గోదావరి జిల్లాల్లో 200 మందిని జ్యూయలరీ రిటైల్ సేల్స్ అసోసియేట్స్‌గా శిక్షణ ఇవ్వనున్నారు. వీరందరికీ 12 గంటల శిక్షణ ఇచ్చాక, వారి నైపుణ్యాన్ని పరిశీలించి, ఎంపిక చేసిన వారికి శిక్షణ ఇస్తారు. ఐసెక్ట్ డైరెక్టర్ సిద్ధార్ద్ చతుర్వేది మాట్లాడుతూ ఏపీలో 2021 నాటికి రాష్ట్రం 91 శాతం అక్షరాస్యతకు చేరుకుంటుందని తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో చదువుకున్న యువతకు నైపుణ్యం పెంపొందించడం ద్వారా ఉపాధిలో మరింతగా మెరుగైన ఫలితాలు సాధించగలరన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

26 నుంచి 'దళిత తేజం-తెలుగుదేశం'

- ఏప్రిల్ 20న పవిత్ర సంగమం వద్ద దళిత రాష్ట్ర మహాసభ
- రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జవహర్



ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 22: ఈనెల 26నుంచి రాష్ట్రవ్యాప్తంగా దళితవాడల్లో దళిత తేజం-తెలుగుదేశం కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నట్లు రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి కొత్తపల్లి శామ్యూల్ జవహర్ వెల్లడించారు. ఈ కార్యక్రమం ద్వారా దళితులకు పార్టీని మరింత చేరువ చేయనున్నామన్నారు. దళితవాడల్లో ఉన్న ప్రతి ఇంటికి వెళ్లి, ఎస్సీల అభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న పథకాలను వివరించనున్నట్లు మంత్రి తెలిపారు. వెలగపూడి సచివాలయంలోని నాలుగో బ్లాక్ పబ్లిసిటీ సెల్‌లో సోమవారం నిర్వహించిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయ సాధనకు సీఎం చంద్రబాబునాయుడు విశేష కృషి చేస్తున్నారన్నారు. దళితుల అభివృద్ధికి ఏయే పథకాలు ప్రభుత్వం అమలు చేస్తుందో తెలియజేయడానికి దళిత తేజం-తెలుగుదేశం కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నట్లు మంత్రి జవహర్ తెలిపారు. ఈనెల 26 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా దళితవాడల్లో ఈ కార్యక్రమం చేపడుతున్నామన్నారు. ఏప్రిల్ 20తేదీన విజయవాడలోని పవిత్ర సంగమం వద్ద దళిత రాష్ట్ర మహాసభతో ఈ కార్యక్రమం ముగుస్తుందన్నారు. అమ్మకు వందనం కార్యక్రమంతో అంబేద్కర్‌ను స్మరించుకునే అవకాశం కలిగిందన్నారు. మహిళలకు, దళితులకు ప్రాధాన్యత ఇవ్వాలంటూ అంబేద్కర్ ఆనాడు హిందూ కోడ్ బిల్లు పెట్టారని, అది వీగిపోయిందని మంత్రి అన్నారు. 1983లో టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత అంబేద్కర్ ఆశయ సాధనలో భాగంగా ఎన్టీ రామారావు మహిళలకు ఆస్తిలో సమాన హక్కులు కల్పించారన్నారు. మహిళలకు రాజకీయాల్లో 33శాతం మేర రిజర్వేషన్లను చంద్రబాబు కల్పించారన్నారు. పార్లమెంట్‌లో అంబేద్కర్ చిత్రపటం పెట్టడంలోనూ, ఆయనకు భారతరత్న ఇవ్వడంలోనూ టీడీపీ పాత్ర మరువలేనిదన్నారు. అమరావతిలో 125 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని స్మృతివనం పేరుతో సీఎం ఏర్పాటు చేస్తున్నారన్నారు.

ఎస్సీలకు చంద్రబాబు.. బరోడా మహారాజ్

ఆనాడు అంబేద్కర్‌కు విదేశీ విద్యను అభ్యసించే అవకాశాన్ని కల్పించిన బరోడా మహారాజ్‌ను దేశ ప్రజలంతా ఎప్పటికీ గుర్తుంచుకుంటారని మంత్రి జవహర్ తెలిపారు. అంబేద్కర్ ఆశయ సాధనలో భాగంగా సీఎం చంద్రబాబు నాయుడు ఎస్సీ యువతకు విదేశీ విద్య అభ్యసించే అవకాశం కల్పించారన్నారు. సీఎం చంద్రబాబును ఎస్సీలు బరోడా మహారాజ్‌లా ఆరాధిస్తున్నారన్నారు.

ఎమ్మెల్యే రోజా ఇంట్లో చోరీ

రూ. 10 లక్షల విలువైన ఆభరణాలు అపహరణ

హైదరాబాద్, జనవరి 22: సినీ నటి, వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే రోజా సెల్వమణి ఇంట్లో చోరీ జరిగింది. సంక్రాంతి పండుగకు చెన్నై వెళ్లి తిరిగి వచ్చేసరికి 10లక్షల విలువైన బంగారు ఆభరణాలు దోచుకుపోయారు. ఆర్‌కే సెల్వమణి , పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలావున్నాయి. హైదరాబాద్ నగరం రాయదుర్గం పోలీసుస్టేషన్ పరిధిలోని పంచవటి కాలనీలోని ప్లాటు నెంబర్ 57లో వైఎస్‌ఆర్ పార్టీకి చెందిన శాసనసభ్యురాలు రోజా సెల్వమణి నివాసముంటున్నారు. సంక్రాంతి పండుగకు రోజా కుటుంబ సభ్యులు 11న చెన్నైకు వెళ్లారు. మొదటి, రెండు అంతస్తులో రోజా కుటుంబం నివాసముంటుంది. గ్రౌండ్ ఫ్లోర్‌లో కార్యాలయం, పని మనిషి రామలక్ష్మి నివాసముంటున్నారు. 11న రోజా కుటుంబం చెన్నైకి వెళ్లగా 12న పని మనిషి రామలక్ష్మి ఊరు వెళ్లింది. పని మనిషి రామలక్ష్మి 18న ఊరునుండి వచ్చినప్పటికి ఆదివారం ఉదయం వరకు పైకి పోలేదు. ఆదివారం మధ్యాహ్నం రామలక్ష్మి ఇంటిని శుభ్రం చేయడం కోసం పైకి వెళ్లి చూడగా ఇంట్లో వెండి కంచాలు కనబడక పోవడంతో పాటు బెడ్‌రూమ్‌లోని బీరువా పగలగొట్టి ఉండడంతో రోజాకు సమాచారం ఇచ్చింది. రోజా భర్త సెల్వమణి వచ్చి చూడగా బీరువాలోని 16 తులాల బంగారం ఆభరణాలు, వెండి వస్తువులతో పాటు ఒక డైమండ్, 20వేలు నగదు పోయినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫింగర్ ప్రింటు నిపుణులు వేలుముద్రలను సేకరించారు. వేసిన తాళం వేసినట్లు ఉండడం ఇంట్లో బంగారు ఆభరణాలు చోరీకి గురికావడంపై గతంలో ఇంట్లో పనిచేసినవారే దొంగతనానికి పాల్పడి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. సెల్వమణి ఫిర్యాదు మేరకు రాయదుర్గం పోలీసులకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. సంఘటన ప్రదేశాన్ని మాదాపూర్ డీసీపీ విశ్వప్రసాద్ సందర్శించారు.

బాసరకు వసంత పంచమి శోభ

బాసర, జనవరి 22: తెలంగాణ రాష్ట్రంలోని ప్రఖ్యాత బాసర క్షేత్రం సోమవారం వసంతశోభను సంతరించుకుంది. మాఘశుద్ధ పంచమిని వసంతపంచమిగా వేడుకగా నిర్వహిస్తారు.వసంతపంచమి సందర్భంగా బాసర అమ్మవారి సన్నిధిలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి, రాష్ట్ర దేవాదాయ శాఖ, గృహనిర్మాణ, న్యాయశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, ముధోల్ ఎమ్మెల్యే జి.విఠల్‌రెడ్డి, ఎంపీ జితేందర్‌రెడ్డిలు మంగళవాయిద్యాలు, వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య ఆలయంలోని అమ్మవార్లకు పట్టువస్త్రాలను సమర్పించారు. ఆలయంలోని అమ్మవార్లను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు మంత్రులతో ప్రత్యేక కుంకుమార్చన పూజలు జరిపించి ఆశీర్వదించారు. ఆలయ ఈవో ఎ.సోమయ్య, ఛైర్మెన్ శరత్‌పాఠక్, పాలకవర్గ సభ్యులు మంత్రులను పట్టువస్త్రాలతో సత్కరించి అమ్మవారి ఫోటోను, ప్రసాదాలను అందజేశారు. ఆలయంలోని ప్రత్యేక అక్షరాభ్యాస మండపంలో ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి తన మనవరాలికి అక్షరాభ్యాస పూజను ఘనంగా నిర్వహించారు. ఉదయం నుండి సాయంత్రం వరకు భక్తులు, చిన్నారులతో అక్షరాభ్యాస మండపాలు కిటకిటలాడాయి.

బాబు చేతకానితనం వల్లే..

- విభజన హామీలు అమలు కావటం లేదని వామపక్ష నేతల ధ్వజం

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 22: రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతికానితనం.. ఆపై అసమర్థత వల్లనే రాష్ట్ర విభజన చట్టంలోని ఏ ఒక్క హామీ కూడా అమలుకావడం లేదంటూ సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ధ్వజమెత్తారు. సీపీఎం కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో వారు మాట్లాడారు. విభజన హామీల కోసం ఏనాడూ కూడా ఢిల్లీలో ప్రధాని నరేంద్రమోదీని నిలదీయకుండా ఎన్నికలు వస్తున్నాయనే కారణంతో విభజన హామీల కోసం సుప్రీంకోర్టుకు వెళతానంటూ బాబు వ్యాఖ్యానించడం హాస్యాస్పదమంటూ ఎద్దేవా చేశారు. ఓట్ల రాజకీయాల కోసం బాబు మరోసారి ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. బాబుకు ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా ఎన్‌డీఏ నుంచి వెలుపలకు రావాలని డిమాండ్ చేశారు. ప్రధాని మోదీ దాదాపు ఏడాదిపాటు బాబుకు కనీసం ఇంటర్వ్యూ కూడా ఇవ్వలేదంటూ ఇంటర్వ్యూ కోసం బతిమిలాడుకునే వ్యక్తి రాష్ట్ర ప్రయోజనాల కోసం ఏమి పోరాటం చేస్తారని మధు, రామకృష్ణ ప్రశ్నించారు. ఏది ఏమైనా సుప్రీంకోర్టుకు వెళ్లే ధైర్యం బాబుకు లేదన్నారు. అదే హైకోర్టు విభజన కోసం తెలంగాణా ఎంపీలు పార్లమెంటులో ఆందోళన చేసి వచ్చే జూన్ నాటికి సాకారమయ్యేలా స్పష్టమైన హామీ తెచ్చుకున్నారని అన్నారు. ఈపాటి తెగువ కూడా తెదేపా ఎంపీలకు లేదన్నారు. అసలు ఆనాడే ప్యాకేజీ ప్రకటనను వ్యతిరేకించి ఉంటే నేడు ఈ దుర్గతి పట్టేది కాదన్నారు. ఏది ఏమైనా ఎన్ని ఆంక్షలున్నప్పటికీ ఈనెల 24తేదీ గుంటూరు జిల్లా పెదగొట్టిపాడు గ్రామాన్ని సందర్శించి తీరుతామన్నారు. దళితులపై దాడులు దారుణమంటూ, ఈ దాడులకు పాల్పడిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని వారు డిమాండ్ చేశారు.

అన్ని రాష్ట్రాల్లోనూ విజయం సాధిస్తాం

బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు దారా


ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 22: భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం చేపట్టిన పథకాలను ప్రజల వద్దకు చేర్చడం ద్వారా దక్షిణాది రాష్ట్రాలతో సహా దేశంలోని మిగతా పది రాష్ట్రాల్లో విజయం సాధించనున్నట్లు బీజేపీ పార్టీ ఎస్‌సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే దారా సాంబయ్య చెప్పారు. పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన సోమవారం ఉదయం విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ జనరంజక, పారదర్శక పాలనతో ప్రజలు ఆకర్షితులవుతున్నారన్నారు. జన్‌ధన్ యోజన, ముద్ర, బీమా పథకాలు, ఫసల్ బీమా, ఉజ్వల, ఉజాల, మరుగుదొడ్ల నిర్మాణం, స్టాండప్ ఇండియా, అంకుర పరిశ్రమలకు ప్రోత్సాహం, పేదలకు ఇళ్లు, 24 గంటల విద్యుత్ సరఫరా, జాతీయ విద్యా సంస్థల ఏర్పాటు, రహదారుల నిర్మాణం, గ్రామీణాభివృద్ధికి తోడ్పాటుతో ప్రజల జీవన ప్రమాణాలు పెంచుతున్నారన్నారు. ఉపాధి హామీ పథకానికి రూ.48 వేల కోట్లు 2017-18 బడ్జెట్‌లో కేటాయించారన్నారు. వీటిని తమ పథకాలుగా కొందరు ప్రచారం చేసుకుంటున్నారన్నారు. స్టాండప్ ఇండియా కార్యక్రమం ద్వారా ఒక్కో బ్యాంకు తమ శాఖ పరిధిలో ఒక ఎస్‌సీ, ఒక ఎస్‌టీ, ఒక మహిళకు చిన్న తరహా పరిశ్రమ ప్రారంభించేందుకు రూ.కోటి వరకు పూచీ లేని రుణాలను అందిస్తున్నారన్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న రాష్ట్రాలతో కలపి మిగతా 10 రాష్ట్రాలను భాజపా గెలుచుకుంటుందని అన్నారు.

రాష్ట్రపతి కోవింద్ కొంగజపం

- ఆప్ ఎమ్మెల్యేలపై వేటు దురదృష్టకరం
- మోదీకి దావూద్‌కు తేడా లేదు
- గవర్నర్ ఓ బఫూన్.. ఆయన విందుకు వెళ్లటం లేదు
- సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ వ్యాఖ్యలు

ఆంధ్రభూమి బ్యూరో



విజయవాడ, జనవరి 22: దేశ ప్రథమ పౌరుడైన రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ రాజ్యాంగానికి భిన్నంగా వ్యవహరించి 20 మంది ఆప్ ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయటాన్ని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ తీవ్రంగా ఖండించారు. రాష్ట్రపతి పదవిలో ఉన్న వ్యక్తిపై విమర్శలు చేయాల్సి రావటం దురదృష్టకరమని ఆయన పేర్కొన్నారు. ఒకవైపున ఆప్ ఎమ్మెల్యేల వ్యవహారం కోర్టు పరిధిలో ఉండగానే రాష్ట్రపతి అనర్హత వేటు వేయటం న్యాయవ్యవస్థను తక్కువ చేయటమేనన్నారు. విజయవాడలోని సీపీఐ రాష్ట్ర కార్యాలయం దాసరి భవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో రాష్ట్రపతి వ్యవహారశైలిపై సీపీఐ జాతీయ నేత నారాయణ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రధాని నరేంద్ర మోదీకి అత్యున్నత పదవిలో ఉన్న రామ్‌నాథ్ కోవింద్ కొంగ జపం చేస్తున్నారని వ్యాఖ్యానించారు. రెండు రోజుల్లో పదవీ విరమణ చేసే ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ ఏకే జోతి పాలనాపరమైన నిర్ణయాన్ని తీసుకుంటే ఏ విధంగా అమలు చేస్తారని ఆయన ప్రశ్నించారు. ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ (సీఈసీ) జోతి ప్రధాని నరేంద్ర మోదీ పాలేరని వ్యాఖ్యానించారు. రాష్ట్రపతి కోవింద్ వద్ద అనేక అంశాలు పెండింగ్‌లో ఉండగా కేవలం ఢిల్లీ ఆప్ ఎమ్మెల్యేలపై వెంటనే ఎలా నిర్ణయం తీసుకున్నారని ప్రశ్నించారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో పార్టీ ఫిరాయింపుదారులపై ఇప్పటి వరకు చర్యలే లేకపోవటం శోచనీయమన్నారు. బీజేపీకి చెందిన ఆర్‌ఎస్‌ఎస్ నేత ప్రవీణ్‌భాయ్ తొగాడియా సాక్షాత్తూ ప్రధాని మోదీ తనను ఎన్‌కౌంటర్ చేయిస్తారనే భయాందోళన వ్యక్తం చేయటం చూస్తే, దేశంలో నేరపూరిత వ్యవస్థ పాలన సాగుతోందనే వ్యాఖ్యానించారు. మాఫియా డాన్ దావూద్ ఇబ్రహీం, ప్రధాని నరేంద్ర మోదీకి ఏమాత్రం తేడా లేదన్నారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల గవర్నర్ ఈఎస్‌ఎల్ నరసింహన్‌ను ఆయన బఫూన్‌గా అభివర్ణించారు. రెండు రాష్ట్రాల సీఎంలకు ఆయన భజన చేస్తున్నారని విమర్శించారు. అందుకే గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా గవర్నర్ ఆహ్వానించిన విందుకు తాను హాజరుకావటం లేదని, ఒకవేళ వెళితే అది తనకే అవమానమని చెప్పారు. ఇక సీఎం చంద్రబాబు రాజకీయంగా సమస్యలు పరిష్కరించుకోలేక కోర్టుకు వెళతాననటం గమనార్హమన్నారు. చేతులు కాలాక ఆకులు పట్టుకునేకంటే ముందుగానే బీజేపీకి దండం పెట్టటం మేలని సలహా ఇచ్చారు.

ఏబీవీపీ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా వెంకటరాము, హరికృష్ణ ఎన్నిక

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 22: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడిగా పీ వెంకటరాము, కార్యదర్శిగా ఎన్ హరికృష్ణ 2017-18 విద్యా సంవత్సరానికిగాను ఎన్నికయ్యారు. సోమవారం విజయవాడ రాష్ట్ర కార్యాలయంలో ఎన్నికల అధికారి పాంగి రామయ్య ఈ మేరకు ప్రకటన విడుదల చేసారు. ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులు ఒక సంవత్సరం పాటు బాధ్యతల్లో ఉంటారని, ఈ నెల 26 నుండి 28వ తేదీ వరకు రాజమహేంద్రవరంలో జరిగే ఏబీవీపీ 36వ రాష్ట్ర మహాసభల్లో వీరు ఈ బాధ్యతలు చేపడతారని చెప్పారు. గుంటూరు జిల్లాకు చెందిన వెంకట రాము హిందూ కాలేజీలో ఫిజిక్స్ లెక్చరర్‌గా పని చేస్తున్నారు. గతంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పని చేసిన చిత్తూరు జిల్లాకు చెందిన హరికృష్ణ బీటెక్ పూర్తి చేసి, ఎంబీఏ చదువుతున్నారు.

సీజ్ చేసిన వాహనాల పార్కింగ్‌కు ప్రైవేటు స్థలాలు

- స్థల యజమానులకు అద్దె చెల్లింపు
- రవాణాశాఖ కొత్త విధానం

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 22: వివిధ కారణాలతో స్వాధీనం చేసుకున్న వాహనాలను పార్కింగ్ చేసేందుకు స్థలాల కొరతను అధిగమించేందుకు వినూత్న ప్రక్రియకు రాష్ట్ర రవాణా శాఖ శ్రీకారం చుట్టింది. ప్రైవేట్ స్థలాల్లో వాహనాలను పార్క్ చేసేందుకు ముందుకు వచ్చిన స్థల యజమానులకు అద్దె చెల్లించేందుకు నిర్ణయించింది. పన్ను చెల్లించని, ఫిట్‌నెస్ సరిగా లేని వాహహనాలు, నిబంధనలు పాటించని వాహనాలను రాష్ట్ర రవాణా శాఖ స్వాధీనం చేసుకుంటుంది. స్వాధీనం చేసుకునే వాహనాల్లో ద్వి చక్ర వాహనాలు, ఆటోలు, కార్లు, జీపులు, ఇతర భారీ వాహనాలు ఉంటుంటాయి. స్వాధీనం చేసుకున్న వాహనాలను ఇప్పటి వరకూ పోలీస్, ఫైర్ స్టేషన్లు, తదితర ప్రభుత్వ కార్యాలయాల ఆవరణల్లో ఉంచుతున్నారు. అయితే ఆయా శాఖలు సీజ్ చేసిన వాహనాలను తమ కార్యాలయాల వద్ద పార్క్ చేసేందుకు అనుమతించడం లేదు. దీంతో ఈ వాహనాల పార్కింగ్ సమస్యగా మారింది. కృష్ణా జిల్లాలో రోజుకు సగటున 100 వాహనాలను సీజ్ చేస్తుంటారు. రాష్ట్రంలో సగటున వీటి సంఖ్య 900 వరకూ ఉంటుంది. ఈ వాహనాల పార్కింగ్ సమస్యగా మారింది. దీనిని అధిగమించేందుకు వీలుగా ప్రైవేట్ స్థలాలపై దృష్టి సారించింది. ఎకరం కన్నా ఎక్కువ విస్తీర్ణం ఉన్న స్థలాలను పార్కింగ్‌కు చేసేందుకు వీలుగా అద్దె ప్రాతిపదికన తీసుకునేందుకు నిర్ణయించింది. ఆయా స్థలాల్లో పార్క్ చేసిన వాహనాలకు అద్దెను రవాణా శాఖ చెల్లిస్తుంది. ద్విచక్ర, త్రిచక్ర వాహనాలకు రోజుకు 30 రూపాయల చొప్పున ఎన్ని వాహనాలు పెట్టినా గరిష్ఠంగా 1500 రూపాయలు, ఎల్ఎంవిలకు 50 రూపాయల చొప్పున గరిష్ఠంగా 2000 రూపాయలు, భారీ వాహనాలకు 80 రూపాయల చొప్పున గరిష్ఠంగా 2500 అద్దె చెల్లిస్తుంది. ఈ అద్దెను ఆయా వాహన యజమానుల నుంచి వసూలు చేసి స్థల యజమానులకు చెల్లిస్తారు. 60 రోజుల్లో ఆయా వాహనాలను నిబంధనల మేరకు అపరాధ రుసుం చెల్లించి, తీసుకువెళ్లాల్సి ఉంటుంది. లేకుంటే వాటిని వేలం వేస్తారు. వేలం వేయగా వచ్చిన మొత్తంలో స్థల యజమానికి వాహన పార్కింగ్ అద్దె కింద 1000 రూపాయలు చెల్లిస్తారు. ఈ తరహా ఒప్పందాలను ప్రైవేట్ స్థల యజమానులతో కుదుర్చుకునేందుకు వీలుగా ఇటీవలే ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో కృష్ణా జిల్లాల్లో ఇప్పటికే మూడు ఒప్పందాలు చేసుకున్నారు. విజయవాడ, గుడివాడ, మచిలీపట్నంలో ఈ మేరకు ఒప్పందాలు చేసుకున్నారు. రాష్ట్రమంతటా ఈ తరహా ఒప్పందాలను చేసుకునేందుకు రవాణ శాఖ అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు. పార్కింగ్ స్థలాలు తగినన్ని లేకపోవడం వల్ల స్వాధీనం చేసుకున్న వాహనాన్ని చాలా దూరం తరలించాల్సి వస్తున్నదని కృష్ణా జల్లా ఉప రవాణా శాఖ కమిషనర్ మీరా నాయక్ చెప్పారు.

కాంట్రాక్ట్ అధ్యాపకులకు ఏడాది రెన్యువల్

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 22: 2017-18 విద్యా సంవత్సరానికి సంబంధించి రాష్ట్రంలో వివిధ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో పనిచేస్తున్న దాదాపు 722 మంది కాంట్రాక్ట్ అధ్యాపకులను రెన్యువల్ చేస్తూ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆదిత్యనాథ్ దాసు సోమవారం జీవో నెం.9 జారీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు, రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి, గౌరవ సలహాదారు కె.శివశంకరరెడ్డి మాట్లాడుతూ గత ఎన్నికల సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీల మేరకు కాంట్రాక్ట్ అధ్యాపకులందరినీ రెగ్యులర్ చేసి వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.

జైళ్ల శాఖ భూమి ప్రైవేటు పరం

పర్యాటక ప్రాజెక్టు పేరిట 33 ఏళ్ల లీజుకు ◆ మల్టీప్లెక్స్, షాపింగ్ మాల్ నిర్మాణం ◆ నేతల బంధువుల పెట్టుబడులు

ఆంధ్రభూమి బ్యూరో

రాజమహేంద్రవరం, జనవరి 22: ‘వడ్డించేవారు మనవారైతే’ అన్న చందాన తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం నగరంలో సుమారు రూ.60 కోట్ల విలువైన జైళ్ల శాఖ భూమి పర్యాటక ప్రాజెక్టు పేరుతో ప్రైవేటు సంస్థకు అప్పగించేశారు. 33 ఏళ్ల లీజు పేరిట ఈ సంస్థ చేతికి స్థలాన్ని అప్పగించడంతో చకచకా నిర్మాణ పనులు సాగిపోతున్నాయి. ఎంతో విలువైన, కీలకమైన ఈ స్థలం ఇలా ప్రైవేటు చేతికి చిక్కడం పట్ల సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది. రాజమహేంద్రవరంలో చారిత్రాత్మక సెంట్రల్ జైలుకు విశాలమైన, విలువైన భూములున్నాయి. సుమారు 25 ఎకరాల విస్తీర్ణంలో సెంట్రల్ జైలు వుంది. దీనిని అనుకుని మరో 15 ఎకరాల భూమిలో వివిధ రకాల తోటలున్నాయి. స్థానిక మిలట్రీ రోడ్డులో జైళ్ళ శాఖ క్వార్టర్లు, సెంట్రల్ జైలు భూభాగం, ఖాళీ స్థలాలు తదితర విలువైన ఆస్తులున్నాయి. ఈ భూములపై ఎప్పటి నుంచో ప్రైవేటు వ్యక్తుల కళ్లు పడ్డాయి. ఏదోవిధంగా ఈ భూములను దక్కించుకోవాలని గత కాంగెస్ ప్రభుత్వ హయాం నుంచి ప్రయత్నాలు సాగించారు. గత ప్రభుత్వం జైళ్ల శాఖకు చెందిన ఈ భూములను గృహనిర్మాణానికి కేటాయించాలని ఆలోచన చేసింది. సెంట్రల్ జైలును సైతం జగ్గంపేట ప్రాంతానికి తరలించాలని ప్రయత్నాలుచేసింది.



జైళ్ల శాఖ భూమిలో ప్రైవేటు సంస్థ నిర్మిస్తున్న కన్వెన్షన్ సెంటర్

అప్పట్లో ఈ ప్రయత్నాలను స్థానికులు తీవ్రంగా వ్యతిరేకించారు. దీనికితోడు జగ్గంపేట నుంచి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించిన అప్పటి మంత్రి తోట నరసింహం కూడా తన నియోజకవర్గంలోకి సెంట్రల్ జైలు తరలించకుండా అడ్డుకోగలిగారు. జైలు అధికారులు కూడా ఈ భూములు ఇతర శాఖలకు మళ్ళించేందుకు ఇష్టపడక ప్రభుత్వ ప్రతిపాదనను తీవ్రంగా వ్యతిరేకించి అడ్డుకోవడంతో ప్రభుత్వం తన ప్రయత్నాలను విరమించుకుంది. అయితే ప్రస్తుత తెలుగుదేశం ప్రభుత్వం గుట్టుచప్పుడు కాకుండా జైళ్ళ శాఖకు చెందిన సుమారు 6.80 ఎకరాల ఈ భూమిని ప్రైవేటుకు దఖలు పర్చింది. సెంట్రల్ జైలు ఎదురుగావున్న జైళ్ళ శాఖ డిఐజి బంగ్లా భూమిలో సుమారు 6.80 ఎకరాల భూమిని ప్రభుత్వం పర్యాటక లీజు పేరుతో ప్రైవేటు సంస్థలకు కట్టబెట్టింది. పర్యాటక శాఖ నిర్వహించిన ఆసక్తి వ్యక్తీకరణ బిడ్‌లో తెలంగాణకు చెందిన మంజీర సంస్థకు ఈ భూమిని కట్టబెట్టింది. సుమారు రూ.100 కోట్ల అంచనా వ్యయంతో మంజీర సంస్థ ఇక్కడ చేపట్టిన పర్యాటక ప్రాజెక్టు చక చకా తయారవుతోంది. గత గోదావరి మహా పుష్కరాల సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ స్థలంలో రూ.10 కోట్ల అంచనా వ్యయంతో కన్వెన్షన్ సెంటర్‌ను నిర్మిస్తామని ప్రకటించారు. అనంతర పరిణామాల్లో ఈ భూమి పర్యాటక శాఖ ఆధ్వర్యంలో మంజీర సంస్థ చేజిక్కించుకుంది. సుమారు రూ.100 కోట్ల అంచనా వ్యయంతో మొదటి దశలో కన్వెన్షన్ సెంటర్, మల్టీప్లెక్స్, షాపింగ్ మాల్, హోటల్ నిర్మాణం చేపట్టింది. ముందుగా కన్వెన్షన్ సెంటర్‌ను మార్చిలోగా పూర్తిచేయడానికి చర్యలుచేపట్టారు. అదే విధంగా హోటల్, మల్టీప్లెక్స్, షాపింగ్ మాల్ నిర్మించేందుకు ప్రణాళిక చేపట్టారు. కాగా లీజుకు పొందిన సంస్థ వెనుక కేంద్ర, రాష్ట్ర స్థాయిలో పలుకుబడి కలిగిన కొంతమంది నేతలు వున్నట్టు తెలిసింది. స్థానికంగావున్న నేతలు, కేంద్ర స్థాయిలో కీలకమైన ఒక నేత కుమారుడు ఇందులో పెట్టుబడులు పెట్టినట్టు తెలిసింది. కేంద్ర స్థాయి నేతకు స్థానిక నేత కొన్ని వ్యాపారాల్లో పెట్టుబడిదారుగా ఉండటంతో ఆయన ప్రోద్బలంతోనే ఇందులో పెట్టుబడులు పెట్టినట్టు తెలిసింది. ఈ సంస్థ వెనుక పెట్టుబడిదారులు ప్రభుత్వంలో పలుకుబడి కలిగిన పెద్దలు కాబట్టే గుట్టుచప్పుడు కాకుండా భూమిని దారాదత్తమైందని తెలుస్తోంది. రూ.కోట్ల విలువైన భూమి నామమాత్ర లీజు పద్ధతిన ప్రైవేటు సంస్థ మంజీర చేతికి చిక్కింది.

కాంగ్రెస్‌లోకి నామా?

టీటీడీపీకి మరో భారీ షాక్!? ◆ ఆందోళనలో కార్యకర్తలు

ఆంధ్రభూమి బ్యూరో



ఖమ్మం, జనవరి 22: తెలంగాణ తెలుగుదేశం పార్టీకి మరో భారీషాక్ తగలనుంది. తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, పార్లమెంటరీ పార్టీ మాజీ నేత నామా నాగేశ్వరరావు కాంగ్రెస్‌లో చేరేందుకు రంగం సిద్ధమయినట్టుగా తెలుస్తోంది. కొంతకాలంగా ఆయన కాంగ్రెస్‌లో చేరతారని ప్రచారం జరగ్గా ఆది, సోమవారాల్లో అందుకు సంబంధించిన ప్రక్రియ వేగవంతమైనట్లు సమాచారం. ఇందుకు టీడీపీ నుంచి టీఆర్‌ఎస్‌లో చేరిన ఓ ప్రధాన నేతతో పాటు ఓ పారిశ్రామికవేత్త మధ్యవర్తిత్వం వహించినట్లు సమాచారం. నామాను తిరిగి ఖమ్మం లోక్‌సభ సభ్యునిగా పోటీ చేయిస్తారని, ఇందుకు అనుగుణంగా ఒప్పందాలు కూడా కుదిరినట్లు తెలుస్తోంది. తొలుత వ్యాపారవేత్తగా ఉన్న నామా నాగేశ్వరరావు రాజకీయాల్లోకి వచ్చినప్పుడు కాంగ్రెస్‌లోనే చేరతారని ప్రచారం జరిగింది. అయితే ఆయన తెలుగుదేశం పార్టీలో చేరి ఖమ్మం ఎంపీగా పోటీ చేసి గెలిచిన వెంటనే ఆయనకు ఆ పార్టీ పార్లమెంటరీ పార్టీ నేతగా అవకాశం కల్పించింది. దీంతో దేశవ్యాప్తంగా విస్తృత పరిచయాలు పెంచుకున్నారు. గత ఎన్నికల సమయంలో అప్పటి టీడీపీ నేతగా ఉన్న తుమ్మల నాగేశ్వరరావుతో విభేదాలు, ఎన్నికల్లో ఓటమి ఆయనను నైరాశ్యంలో ముంచాయి. అప్పటి నుంచి పార్టీ కార్యక్రమాలకు కూడా అంతంత మాత్రంగానే హాజరవుతున్నారు. టీఆర్‌ఎస్‌లో చేరాలనే ప్రతిపాదన కూడా ఆయన ముందుకు వచ్చిందని, అయితే అప్పటికే ఆ పార్టీలో చేరి మంత్రి పదవి పొందిన తుమ్మలతో సఖ్యత సాధ్యం కాదనే ఉద్దేశంతో, జాతీయ పార్టీలోనే చేరాలని భావించి ఆయన కాంగ్రెస్ వైపు మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. మరోవైపు ఈ సమాచారాన్ని ఇప్పటికే పార్టీ అధినేత చంద్రబాబు దృష్టికి కూడా తీసుకెళ్ళగా ఆయన కూడా సానుకూలంగా స్పందించారని ప్రచారం జరుగుతోంది. తెలంగాణ రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ పరిస్థితి రోజురోజుకు తగ్గుతున్నదని ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో నామా పార్టీమారితే రాష్ట్రంలో పార్టీకి మరింత గడ్డుకాలం ఎదురవుతుందని, దీంతో ఉన్న కొద్దిమంది నేతలు కూడా పార్టీ మారతారని ఆ పార్టీ నేతలు ఆందోళన చెందుతున్నారు. నామా చేరిక ద్వారా ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల పరిధిలో మెజార్టీ స్థానాలు కైవసం చేసుకోవచ్చనే ధీమా కూడా కాంగ్రెస్ నేతల్లో కనిపిస్తోంది. ఇప్పటికే ఖమ్మం జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు టీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరగా మరికొంతమంది ప్రధాన నేతలు కూడా క్యూకట్టేందుకు సిద్ధంగా ఉన్నారు. ఈ నేపథ్యంలో వీలైనంత త్వరగా నామాను కాంగ్రెస్ పార్టీలోకి తీసుకురావడం ద్వారా జిల్లాలో పార్టీకి మరింత ఊపు తీసుకురావాలని ఆ పార్టీ నేతలు భావిస్తున్నారు. నామా చేరికను కాంగ్రెస్ నేతలు బాహటంగానే సమర్థిస్తున్నారు. ఆ పార్టీ ప్రధాన నేతలుగా ఉన్న వారు కూడా ఆయన వస్తే సగౌరవంగా తమలో కలుపుకుంటామని బహిరంగంగానే చెప్పడం విశేషం.

పది లక్షల అప్పుకే ఆత్మహత్య చేసుకుంటారా?

మంత్రి సోమిరెడ్డి

ఆంధ్రభూమి బ్యూరో

గుంటూరు, జనవరి 22: పది లక్షల రూపాయల అప్పుకోసం ఆత్మహత్యలు చేసుకుంటారా.. మీ కుటుంబాలు నష్టపోవట్లేదా.. పారిశ్రామికవేత్తలు లక్షల కోట్లు ఎగ్గొడుతున్నారు... పంటలు నష్టపోయినా.. ధరలు పతనమైనా ప్రభుత్వం ఆదుకుంటోంది కదా.. చిన్న అప్పులకు కూడా ఆత్మహత్యలకు పాల్పడటం బాధాకరం.. రైతులు ఆత్మస్థయిర్యాన్ని వీడొద్దు.. ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. సోమవారం గుంటూరు సమీపంలోని లాం వ్యవసాయ విశ్వ విద్యాలయంలో నిర్వహించిన కిసాన్‌మేళా సందర్భంగా ఇటీవల గుంటూరు కలెక్టరేట్ ఆవరణలో రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటనపై మంత్రి తీవ్రంగా స్పందించారు. సిరిపూర్ కాగజ్‌నగర్ పేపరు మిల్లు రైతులకు 14 వందల కోట్లు ఇవ్వాలి..మిల్లు మూసేశారు.. అందులో కొంతమేర ప్రభుత్వం చెల్లించేందుకు చర్యలు చేపట్టింది.. మార్క్‌ఫెడ్ ద్వారా పదివేల మెట్రిక్ టన్నుల మినుములు కొనుగోలు చేయాలని నిర్ణయించామని అన్నారు. ప్రభుత్వం విత్తనాలు సరఫరా చేస్తోంది.. ఎరువులు పంపిణీ చేస్తోంది.. అయినా రైతులు నకిలీ విత్తనాలు, పురుగు మందులు ఎందుకు వాడుతున్నారని ప్రశ్నించారు. దీనివల్లే నష్టాలు సంభవిస్తున్నాయి.. ఈ కారణంగా ఆత్మహత్యలు చేసుకోవటం దురదృష్టకరమన్నారు. ప్రభుత్వం అందించే విత్తనాలు, ఎరువులలో నాణ్యతా ప్రమాణాలకు అధికారులు బాధ్యత వహిస్తారు.. ప్రైవేటు వ్యాపారులను ఎందుకు ఆశ్రయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మిర్చి రైతులకు రాయితీ కింద రూ. 110 కోట్లు చెల్లించామన్నారు. భూసార పరీక్షల ఫలితాలు 54 లక్షల మందికి అందించాం.. నేల స్వరూప స్వభావాలకు అనుగుణంగా ఏ పంటలు వేయాలో అధికారులు వివరిస్తున్నారు.. వీటిపై అవగాహన పెంచుకుంటే ఆత్మహత్యలు నిలువరించవచ్చన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అంకితభావంతో రైతు శ్రేయస్సు కోసం పనిచేస్తున్నారు. ప్రతిపక్ష నేత పాదయాత్ర పేరిట రైతులను రెచ్చకొడుతూ వారి ఆత్మస్థయిర్యాన్ని దెబ్బ తీస్తున్నారని మండిపడ్డారు. ఆయన మాటలను ప్రజలు, రైతులు విశ్వసించరన్నారు. నకిలీ బయో ఉత్పత్తుల వ్యాపారులపై పీడీ యాక్టు నమోదుచేసి లైసెన్సులు రద్దు చేస్తున్నామని, నష్టపోతే విత్తన కంపెనీలు చెల్లించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

ప్రతి రైతుకు మద్దతు ధర ఇప్పించండి

దావోస్ వెళ్తూ కూడా ధాన్యం సేకరణపైనే సీఎం దృష్టి

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

అమరావతి, జనవరి 22: దావోస్ వెళ్తూ కూడా ధాన్యం సేకరణపై ముఖ్యమంత్రి మార్గదర్శకాలు ఇచ్చారని, ప్రతి రైతుకు మద్దతు ధర లభించేలా చూడాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్‌కుమార్ ఆదేశించారు. సోమవారం వ్యవసాయం, నీరు-మీరు పురోగతిపై వివిధ జిల్లాల కలెక్టర్లు, శాఖాధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. మొన్న జరిగిన మంత్రివర్గ సమావేశంలో ధాన్యం సేకరణపై చర్చ జరిగిన విషయం ప్రస్తావించారు. ‘ధాన్యం సేకరణ కేంద్రాలపై జిల్లాల కలెక్టర్లు నిశితంగా దృష్టి పెట్టాలి. రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి. ప్రతి రైతుకు మద్దతు ధర లభించేలా శ్రద్ధ వహించాలని’ ఆదేశించారు. ధాన్యం సేకరణపై మొన్న జరిగిన మంత్రివర్గ సమావేశంలో చర్చకు వచ్చిన విషయం ప్రస్తావించారు. కృష్ణాజిల్లాలో జరుగుతున్న ధాన్యం సేకరణ వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతులకు ప్రయోజనం కలిగించేందుకే ధాన్యం సేకరణ కేంద్రాలు పెట్టామని, వాటిని రైస్‌మిల్లర్లు, దళారులు దుర్వినియోగం చేయకుండా చూడాల్సిన బాధ్యత జిల్లాల యంత్రాంగంపైనే ఉందని అన్నారు. రీ-సైక్లింగ్ బియ్యం ధాన్యం సేకరణ కేంద్రాలకు తెచ్చేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రేషన్ బియ్యం రైస్ మిల్లుల్లో రీ-సైక్లింగ్ చేసేవారిపై కఠినంగా వ్యవహరించాలన్నారు. ఆయా రైస్‌మిల్లుల్లో గత రెండు నెలల విద్యుత్ వినియోగం లెక్కలు తీయడం ద్వారా ధాన్యం రీ-సైక్లింగ్‌కు అడ్డుకట్ట వేయాలన్నారు. ఖరీఫ్‌లో పంట రుణాల పంపిణీ సంతృప్తిగా జరిగిందంటూ, రబీలో కొన్ని జిల్లాల్లో పంట రుణాల పంపిణీ మందకొడిగా జరగడంపై దినేష్‌కుమార్ అసంతృప్తి వ్యక్తం చేశారు. శ్రీకాకుళం, కర్నూలు, విజయనగరం, నెల్లూరు జిల్లాల్లో పంట రుణాల పంపిణీ వేగంగా జరగాలని సూచించారు. కృష్ణా, గుంటూరు జిల్లాల్లో కౌలు రైతులకు పంట రుణాల పంపిణీ మరింత వేగం పుంజుకోవాలని ఆదేశించారు. ఉద్యాన రంగంలో సూక్ష్మసేద్యం లక్ష్యం సగం మాత్రమే చేరారంటూ, మిగిలింది కూడా 3 నెలల్లో పూర్తిచేయాలని ఆదేశించారు. ఈ ఏడాది టార్గెట్ 2,06,5009 హెక్టార్లకు గాను లక్షా 12వేల హెక్టార్లలోనే జరిగిన విషయం గుర్తుచేశారు. ప్రస్తుతం ఉన్న పండ్ల తోటల సాగును 41లక్షల ఎకరాల నుంచి కోటి ఎకరాలకు తీసుకెళ్లాలని ముఖ్యమంత్రి టార్గెట్ పెట్టిన విషయం ప్రస్తావించారు. రాయలసీమ జిల్లాల్లో మైక్రో ఇరిగేషన్‌ను మరింత ప్రోత్సహించాలన్నారు. శ్రీకాకుళం జిల్లాలో మత్స్యకారుల సంఖ్య అధికంగా ఉన్న దృష్ట్యా బోట్లు, వలలు మరిన్ని కేటాయించాలని కలెక్టర్ ధనుంజయరెడ్డి కోరగా కార్పొరేషన్ల ద్వారా వాటిని అందజేయాలని సూచించారు. ఈ వారం పంట కుంటల తవ్వకం 500 మాత్రమే జరిగాయని, రాబోయే 4నెలలు చురుకుగా పనులు చేసి టార్గెట్ చేరుకోవాలని ఆదేశించారు. చెరువులు, కాలువల గట్లపై కంప నరికివేత పనులు ముమ్మరం చేయాలన్నారు. అన్ని జిల్లాల్లో 2016-17 ఇళ్ల నిర్మాణం త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. 2017-18 ఇళ్ల మంజూరు లక్ష్యాన్ని వెంటనే చేరుకోవాలన్నారు. ఎన్టీఆర్ గ్రామీణ్ హౌసింగ్ లక్ష్యాలపై అధికారులు మరింత శ్రద్ధ పెట్టాలన్నారు. ‘నరేగా పనులకు జిల్లాల కలెక్టర్లే నేతృత్వం వహించాలి, వ్యక్తిగతంగా పనుల పురోగతిని పర్యవేక్షించాలి, ఎప్పటికప్పుడు సమీక్షించాలని’ స్పష్టం చేశారు. నరేగాలో మెటీరియల్ కాంపోనెంట్ పనులు 40 శాతానికి మించిరాదన్నారు. గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో లేబర్ కాంపోనెంట్ పెంచాలని సూచించారు. రాబోయే రెండు నెలలు ఎన్‌ఆర్‌ఎం కార్యక్రమాలపై దృష్ట కేంద్రీకరించాలన్నారు. గుంటూరు, కృష్ణా, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో 50 శాతం సహజ వనరుల నిర్వహణ కార్యక్రమాలు జరగడం పట్ల తీవ్ర అసంతృప్తి ప్రకటించారు. కలెక్టర్లు ఎప్పటికప్పుడు సమీక్షల ద్వారా ఎన్‌ఆర్‌ఎం వేగవంతం అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఉపాధి కూలీలకు సకాలంలో చెల్లింపులు జరపాలని, 7 రికార్డులు పక్కాగా నిర్వహించాలని మార్గదర్శకం చేశారు. కాగా జన్మభూమి-మావూరులో వచ్చిన వినతుల పరిష్కారంపై కలెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ వహించాలని దినేష్‌కుమార్ ఆదేశించారు. ఆర్థికేతర వినతులు అన్నింటినీ జనవరి 31లోపు పరిష్కరించాలన్నారు. మరో 8 రోజుల్లో అర్జీలన్నింటినీ పరిష్కరించాలన్నారు. ఆర్థికపరమైన వినతులను అర్హతను బట్టి ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించాలని కోరారు. ముఖ్యమంత్రి నిర్దేశించిన లక్ష్యాలను ప్రతి శాఖ, ప్రతి జిల్లా చేరుకోవాలన్నారు. టెలీకాన్ఫరెన్స్‌లో వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి రాజశేఖర్, ఉద్యానశాఖ, మత్స్యశాఖల ఉన్నతాధికారులు చిరంజీవి చౌదరి, రాంశంకర్ నాయక్, పంచాయతీరాజ్, వ్యవసాయ శాఖల కమిషనర్లు రామాంజనేయులు, హరి జవహర్ లాల్, జలవనరుల చీఫ్ ఇంజనీర్ వెంకటేశ్వరరావు, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి అరుణ్‌కుమార్, పశు సంవర్ధకశాఖ నుంచి సోమశేఖర్, ముఖ్యమంత్రి కార్యాలయం సహ కార్యదర్శి రాజమౌళి, ఇతర అధికారులు, వివిధ జిల్లాల కలెక్టర్లు పాల్గొన్నారు.

కొల్లేరు సమస్యను పరిష్కరించాలి: కామినేని

ఆంధ్రభూమి ప్రతినిధి

న్యూఢిల్లీ, జనవరి 22: కొల్లేరు అభయారణ్య పరిధిలోని మత్స్యకారులు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కారించాలని కేంద్ర పర్యావరణ శాఖ మంత్రి హర్షవర్ధన్‌కు రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి కామినేని శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. సోమవారం కేంద్ర మంత్రి హర్షవర్ధన్‌తో రాష్ట్ర మంత్రి కామినేని ఢిల్లీలో సమావేమయ్యారు. కొల్లేరు భూముల వ్యవహారానికి సంబంధించిన సమస్యలను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం మంత్రి కామినేని విలేఖరులతో మాట్లాడుతూ పర్యావరణానికి, కొల్లేరు సరస్సు నీటి ప్రవాహానికి ముప్పు వాటిల్లకుండా సరస్సుపై ఆధారపడి జీవనం సాగిస్తున్న ప్రజల సమస్యల పరిష్కారానికి కేంద్రం సానుకులంగా ఉన్నట్టు పేర్కొన్నారు. కొల్లేటి సరస్సు కాంటూరు పరిధి ఐదు నుంచి మూడవ కాంటూరుకు తగ్గించే అంశం సుప్రీం కోర్టు పరిధిలో ఉన్నదని ఆయన చెప్పారు. సర్వోన్నత న్యాయస్థానం తీర్పునకు లోబడి కొల్లేరు సరస్సుపై ఆధారపడ్డ ప్రజలు జీవనోపాధి కోల్పోకుండా తగు సహాయం చేయాలని కేంద్ర మంత్రిని కోరినట్టు చెప్పారు. ఈ సరస్సుపై ఆధారపడి జీవనం సాగిస్తున్నవారికి, సొంత భూములు కలిగినవారికి ఇప్పటివరకూ ఏ విధమైన నష్టపరిహారం చెల్లించలేదని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్టు పేర్కొన్నారు. ఆ ప్రాంతంలో జీవనోపాధి లేక ఇప్పటికే చాలా కుంటుంబాలవారు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లినట్టు కేంద్ర మంత్రికి వివరించినట్టు తెలిపారు. కైకలూరు, ఆటపాక ప్రాంతాలలో ఫిబ్రవరి నాలుగో తేదీనాడు ఫెలికాన్ ఫెస్టివల్‌ను నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

గాలి పిటిషన్‌ను తోసిపుచ్చిన సుప్రీం

ఆంధ్రభూమి ప్రతినిధి

న్యూఢిల్లీ, జనవరి 22: మైనింగ్ కేసులో లభించిన బెయిల్‌పై ఉన్న షరతులను సడలించాలని కోరుతూ గాలి జనార్దన్ రెడ్డి చేసుకున్న అభ్యర్థనను సుప్రీం కోర్టు తోసిపుచ్చింది. జనార్దన రెడ్డి దాఖలు చేసుకున్న పిటిషన్ జస్టిస్ ఏకే సిక్రీ, జస్టిస్ ఆశోక్‌భూషన్‌లతో కూడిన ధర్మాసనం ముందుకు విచారణకు వచ్చింది. బెయిల్ నిబంధనలను సడలించేందుకు ధర్మాసనం నిరాకరించింది. 2011 సెప్టెంబరు ఐదున గాలి జనార్దన్ రెడ్డి అనంతపురం జిల్లా పరిధిలో ఓఎంసీ కంపెనీల గనుల్లో జరిగిన అక్రమాల కేసులో నిందితుడిగా చేస్తూ సీబీఐ అరెస్టు చేసింది. అనంతరం సుప్రీం కోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. అయితే షరతులను సడలించాలని గాలి చేసుకున్న పిటిషన్‌ను సుప్రీం కోర్టు తిరస్కరించింది.

దేశాభివృద్ధికి విద్యుత్ దోహదం



సమావేశంలో మాట్లాడుతున్న విద్యుత్ మంత్రి కిమిడి కళావెంకటరావు

విశాఖపట్నం, జనవరి 22: ఏ దేశం అభివృద్ధి చెందాలన్నా విద్యుత్‌తోనే సాధ్యపడుతుందని, అటువంటి నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్‌ను ఏపీలోనే ముఖ్యమంత్రి చొరవతో ఇవ్వగలుగుతున్నామని విద్యుత్ శాఖామంత్రి కిమిడి కళావెంకట్రావు అన్నారు. ఏపీ విద్యుత్ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం 12వ రాష్ట్ర మహాసభ ఏయు సీఆర్ కాన్వొకేషన్ హాల్‌లో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019 నాటికి దేశంలో విద్యుత్ పంపిణీ నష్టాలు 15 శాతానికి తగ్గించాలనేది లక్ష్యం కాగా, ఏపీలో ఇప్పటికే 9.11 శాతానికి నష్టాలు తగ్గించగలిగామన్నారు. దీన్ని ఇంకా 3.2శాతానికి తగ్గించాల్సి ఉందన్నారు. టీడీపీ ప్రభుత్వం వచ్చిన తరువాతే నిరంతరాయ విద్యుత్‌ను మెరుగు పరిచామన్నారు. కోతలు విధిస్తే పరీక్షలకు ఇబ్బందులు వస్తాయని భావించి ఎటువంటి కోతలు లేకపోగా, మిగులు విద్యుత్‌కు చేరుకున్నామన్నారు. రెండవ విద్యుత్ సంస్కరణల్లో భాగంగా సూర్య రశ్మి, గాలిమరల ద్వారా విద్యుత్‌ను అందుబాటులోకి తీసుకువచ్చే విధానాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చొరవతోనే తీసుకురాగలిగామన్నారు. ఏపీలో స్టోరేజీ సామర్థ్యం పెంచుకునే రోజులు రానున్నాయన్నారు. ఏపీకి చెందిన 1100 మంది ఉద్యోగులు తెలంగాణాలో ఇబ్బందులు పడుతున్నారన్నారు. సుప్రీంకోర్టు చెప్పినా జీతాలే తప్ప సమస్యలు పరిష్కారం కావడంలేదన్నారు. దీనికి సంబంధించి ఏపీ జెన్‌కోతో చర్చలు జరుగుతున్నాయన్నారు. సింగరేణి కేలరీస్‌కు సంబంధించి 3,500 కోట్ల విలువైన పన్నులు అక్కడ కట్టించుకుంటున్నారని, లోకేషన్ మాత్రం ఇక్కడ ఉన్నాయన్నారు. తెలంగాణాలో బీసీల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. సమస్యల పరిష్కారం కోసమే చంద్రబాబునాయుడు నవనిర్మాణదీక్షను పెట్టారన్నారు. రెవెన్యూ జనరేషన్, ఉద్యోగాలు సృష్టించుకోవడం తాత్కాలిక సెక్రటేరియట్, అసెంబ్లీ మనకు వచ్చాయన్నారు. 13 శాతం తక్కువ వర్షపాతం ఉన్నా 26 శాతం మేర పంటలు సాధించామన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన బీసీ విద్యుత్ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు పోలాకి శ్రీనివాసరావు మాట్లాడుతూ బీసీలకు జనాభా ప్రకారం అన్ని రంగాల్లో వాటా రాబట్టుకోవాల్సి ఉందన్నారు.

మంత్రి సభలో పవర్ కట్...

మంత్రి కిమిడి కళావెంకట్రావు ప్రసంగం ప్రారంభమైన కొద్దిసేపటికే విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో ఆయన కంగుతిన్నారు. దాదాపు పది నిమిషాలపాటు సరఫరా నిలిచి పోవడంతో చీకటిలోనే ప్రసంగాన్ని కొనసాగించారు.

కొండగట్టులో పవన్ పూజలు

మల్యాల, జనవరి 22: జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ జగిత్యాల జిల్లాలోని కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు ఆలయ అధికారులు, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు జరిపించారు. కొండగట్టుకు పవన్‌కల్యాణ్ వచ్చి తన ఇంటి ఇలవేల్పు అయిన ఆంజనేయ స్వామి దర్శనం చేసుకుని రాజకీయ ప్రత్యేక ప్రణాళిక ప్రకటిస్తానని గత మూడు రోజుల నుండి సోషల్ మీడియాలో ప్రచారం జరిగింది. దీంతో భారీ ఎత్తున అభిమానులు ఘాట్‌రోడ్డు వెంట ఫ్లెక్సీలు కట్టి ప్రత్యేక స్వాగతం పలికారు. మధ్యాహ్నం ఆంజనేయ స్వామి దర్శనం చేసుకుంటారని జనసేన పార్టీ మీడియా ప్రతినిధులు అధికార ప్రకటన చేసినప్పటికీ పవన్ రెండు గంటల ముందు రావడంతో అభిమానులు కేరింతలతో స్వాగతం పలికారు. మొదట ఆలయ ప్రవేశం చేస్తుంటే జగిత్యాల రూరల్ సీఐ శ్రీనివాస్ కొండకింద నుండి ఆలయం వరకు సెక్యూరిటీ నిర్వహించి బందోబస్తు నిర్వహించారు. పవన్ కల్యాణ్ ఆలయ ప్రవేశానికి అభిమానుల రద్దీ, కేరింతలు చోటు చేసుకోవడం, ఎవరినీ అనుమతించకుండా పోవడంతో విలేఖరులు సైతం ఫొటోలు తీసుకోవడంలో ఇబ్బందులు పడ్డారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన పవన్‌కల్యాణ్‌కు ఆలయ ఇఓతో మాట్లాడుతూ కొండగట్టు ఆలయ అభివృద్ధి 11 లక్షల రూపాయలు గుడి బయట ప్రకటిస్తానని చెప్పి ప్రకటన చేయకుండానే వెళ్లిపోయారు. గుడి బయటకు వచ్చాక తన కాన్వాయ్ ఎక్కి అభిమానులకు అభివాదం చేయడం తప్ప ఎలాంటి రాజకీయ ప్రకటన చేయకపోవడంతో అభిమానులు తీవ్ర ఆసంతృప్తికి లోనయ్యారు.



పవన్‌ను ఘనంగా సన్మానిస్తున్న ఆలయ ఇఓ, అర్చకులు

పరుగులు పెట్టిస్తున్న ‘పవర్‌స్టార్’

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 22: సార్వత్రిక ఎన్నికలకు గడువు ఇంకా సంవత్సరం పైనే ఉంది. కానీ సినీ నటుడు, జన సేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ సందడితో మిగతా పార్టీలూ అప్రమత్తమవుతున్నాయి. ఎక్కడ వెనకబడి పోతామేమోనన్నది వారి భయం కావచ్చు. పవన్ కల్యాణ్ సోమవారం తెలంగాణలోని కొండగట్టు ఆంజనేయ స్వామిని దర్శించుకుని యాత్ర ఆరంభించారు. పవన్ ప్రతి కదలికనూ అన్ని పార్టీలూ జాగ్రత్తగా గమనించాయి. 2009లో పవన్ కొండగట్టు ఆంజనేయ స్వామి దర్శించుకుని యాత్ర ప్రారంభించిన సంగతి తెలిసిందే. అయితే వాహనంపై యాత్రగా బయలుదేరిన పవన్ తలకు విద్యుత్తు తగలడంతో కొంత సేపు స్పృహ కోల్పోయారు. ఆ ప్రమాదం నుంచి ఆంజనేయ స్వామిని గట్టెక్కించారని బలంగా విశ్వసిస్తున్న పవన్ ఇప్పుడు కూడా ఆ స్వామిని దర్శించుకునే యాత్రకు శ్రీకారం చుట్టారు. అయితే పవన్ కల్యాణ్ 2019 ఎన్నికల్లో జన సేన అభ్యర్థులను రంగంలోకి దింపితే? అనే చర్చ దాదాపు అన్ని పార్టీల్లోనూ ఆరంభమైంది. పవన్ ఎవరికి నష్టం చేస్తారు? అనే చర్చ జరుగుతున్నది. 2014 ఎన్నికల్లో చివరి నిమిషంలో పవన్ టిడిపికి మద్దతు ప్రకటించడంతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ‘ఢమాల్’ అంది. పవన్ పిలుపుతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకే నష్టం జరిగిందన్నది అందరికీ తెలిసిందే. కానీ ఈ దఫా తమ పార్టీ (జన సేన) పోటీ చేస్తుందని పవన్ పలు పర్యాయాలు ప్రకటించారు. తెలంగాణ గురించి ఆయన పట్టించుకోలేదు. 2019 ఎన్నికల్లోనూ తెలంగాణ గురించి ఆయన పట్టించుకోరనడానికి అవకాశమే లేదు. రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ పోటీ చేయించేందుకు సమాయత్తమవుతున్నారు.జనసేన బరిలో ఉంటే ఆంధ్రలో అధికారంలో ఉన్న టిడిపికి నష్టం కలుగుతుందా? లేక ఆ పార్టీకి మిత్రపక్షంగా మారిపోతుందా? అనే ఊహాగానాలూ లేకపోలేదు. కానీ ‘తోక పార్టీ’గా మారిపోవడం ఇష్టం లేదని జనసేన కార్యకర్తలు, పవన్ అభిమానులూ తేల్చేస్తున్నారు. జనసేన పోటీ చేస్తే ఆంధ్రలో కాంగ్రెస్ పరిస్థితి దారుణంగా ఉంటుందని, కోలుకోవడానికి మరింత కష్టమవుతుందని మిగతా పార్టీలు భావిస్తున్నాయి. తెలంగాణలో జన సేన ఒంటరిగా పోటీ చేస్తే? ఏ పార్టీ ఓట్లు ఎక్కువగా చీలుతాయి? అనేది ప్రధాన ప్రశ్న. రాష్ట్రంలో అధికారంలో ఉన్న తమ ప్రభుత్వం పట్ల ప్రజల్లో ఉన్న కొద్దిగో గొప్ప వ్యతిరేక ఓట్లనూ ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్‌కు చేరకుండా ఉండేందుకూ పవన్ పార్టీ ఉపయోగపడుతుందని టిఆర్‌ఎస్ భావిస్తున్నట్లు ప్రచారం జరుగుతున్నది. వ్యతిరేక ఓట్లను ప్రతిపక్ష పార్టీలే చీల్చుకుంటే, తమకు ఉన్న ఓటు బ్యాంకుతో మళ్లీ బ్రహ్మాండంగా అధికారాన్ని కైవసం చేసుకోవచ్చునేది టిఆర్‌ఎస్ నేతల అంచనా అనే ప్రచారం జరుగుతున్నది. కానీ దీనిని టిఆర్‌ఎస్ తోసిపుచ్చుతోంది. తమ పార్టీ అంత బలహీనంగా లేదని టిఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ సోమవారం విలేఖరుల సమావేశంలో తేల్చి చెప్పారు. జనసేన కూడా ఈ వాదనను తోసిపుచ్చుతున్నది. తమది చీల్చే పార్టీ కాదు, అధికారంలోకి వచ్చే పార్టీ అని అంటోంది. జనసేనకు భవిష్యత్తులో లభించే ఆదరణ, ఇతర పార్టీల నుంచి చేరికలు, కార్యకర్తలు, గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకూ కమిటీలు, ఎన్నికల్లో ప్రధాన పార్టీలైన టిఆర్‌ఎస్, కాంగ్రెస్‌ను ఎదిరించేలా ఎన్నికల కార్యాచరణ, ప్రజాకర్షణ గల ప్రణాళిక (మ్యానిఫెస్టో) ప్రకటించడం వంటివి ఎన్నెన్నో చేయాల్సి ఉంటుంది. సాహసం చేయగల సత్తా పవన్‌కు ఉన్నా, అందుకు తగిన విధంగా స్క్రిప్టు సిద్ధం చేయాల్సిన సీనియర్ నేతల సలహాలు, సూచనలూ అవసరం ఉంటుంది. బిజెపి తెలంగాణ రాష్ట్ర కూడా పవన్‌తో ‘దోస్తీ’ చేసేందుకు ఉత్సాహంగానే ఉంది. మరోవైపు సకల జనుల ఫ్రంట్ ఏర్పాటు చేసేందుకు ఉత్సాహం చూపిస్తున్న టి.జెఎసి చైర్మన్ ప్రొఫెసర్ ఎం.కోదండరామ్ కూడా పవన్ నేతృత్వంలోని జనసేనను కలుపుకుని పోవాలన్న ఆలోచనతో ఉన్నారు. ఆ ఫ్రంట్ విషయంలో సిపిఐ, బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య, ఎంఆర్‌పిఎస్ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ కూడా చర్చలు జరిపారు.

ఆంధ్రభూమి
జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ
మంగళవారం, 23 జనవరి 2018

దురహంకార 'విద్య'..

గ్రామీణ ప్రాంతాలలోని బాలబాలికలు యువజనులు 'ఇంగ్లీషు' నేర్చుకొనడానికి ఎక్కువ మక్కువను చూపిస్తున్నారట! హైదరాబాద్‌లోని వనస్థలి పురంలో నడుస్తున్న 'ప్రశాంతి విద్యానికేతన్' అన్న పాఠశాలలో ఒకటవ తరగతి చదువుతుండిన పి.అంజలి అనే ఆరేళ్ల పాప నిర్వాహకుల క్రూరమైన నిర్లక్ష్యం కారణంగా శనివారం బస్సులోనుండి పడిపోయి అకాల మరణం పాలైంది! హర్యానాలోని యమునానగర్‌లో 'స్వామి వివేకానంద పాఠశాల'కు చెందిన ఒక పద్దెనిమిది ఏళ్ల విద్యార్థి పాఠశాల ప్రధాన అధ్యాపిక ఋతూఛాబ్రాను ఆమె కార్యాలయంలోనే శనివారం కాల్చి చంపేశాడు! వాణిజ్య సంస్థల - కార్పొరేట్ - పాఠశాలలో చదువుకుంటున్న ఎక్కువ మందికి 'వసంత పంచమి' అంటే ఏమిటన్నది తెలీదు, సరస్వతీ మాత విజ్ఞానాన్ని విద్యలను ప్రసాదిస్తుందన్న ధ్యాస లేదు! చదువుకుంటున్న యువతులు చేతులకు గాజులు నుదుటన బొట్లు తీసి పారేశారు, పారేస్తున్నారు! ఆంగ్ల మాధ్యమ విద్యార్థులు ఇంటిలో పెద్దలకు కాని, బయట పెద్దలకు కాని, గుడిలో దేవుడికి కాని చేతులు జోడించి నమస్కరించడం లేదు.. 'హాయ్' అని పలకరిస్తున్నారు. పాఠ్యాంశాలు తప్ప ఇతర పుస్తకాలు కాని వార్తా పత్రికలు కాని చదవడం లేదు, అశ్లీల లైంగిక - పోర్న్ - కలాపాలను 'వాట్సాప్' లోను 'ఇంటర్‌నెట్'లోను దర్శిస్తున్నారు! చదువుకుంటున్న ఆడపిల్లలకు 'పేరంటా'నికి వెళ్లడం నామోషీ, బతకమ్మను గురించి దుర్గమ్మను గురించి పాడడం నామోషీ! 'పేరంటం' అనే పదాన్ని గ్రామీణులు మరచిపోయారు! ''పేరంటానికి రండి, మా పాప పుట్టిన రోజు పండుగ..'' అని చెప్పడం లేదు! ''మా పాప 'బర్త్ డే', ఈవినింగ్ ఫంక్షన్‌కు రండి..'' అని పిలవడం గ్రామీణ ప్రాంతాలలోని వారి తెలుగు వ్యవహార భాషకు మచ్చుతునక! ఈ 'ఫంక్షన్'లలో 'మేరీజీ రిసెప్షన్'లలో ముత్తయిదువులు మంగళహారతులు ఇవ్వడం, పురోహితుడు మంత్రాలను శ్లోకాలను చదవడానికి ప్రాధాన్యం లేదు! వీడియో చిత్రీకరణకు, 'సెల్ఫీ'లకు 'కేకు'లను తరగడానికి ప్రాధాన్యం పెరిగిపోయింది! సంప్రదాయమైన సంగీత స్వరాలు వినబడడం లేదు, 'బర్మడా'లను తగిలించుకున్నవారు 'గాడిద' గొంతులతో 'బట్టె' గొంతులతో ఫంక్షన్లలోను రిసెప్షన్లలోను పాడేస్తున్నారు.. భారత రాజ్యాంగంలోని మూడ వందల నలబయి మూడవ అధికరణం మేరకు 'దేవనాగరి లిపిలో వ్రాసే హిందీ' కేంద్ర ప్రభుత్వం వారి అధికార భాష! రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వానికి మధ్య అనుసంధాన భాష మూడు వందల నలబయి ఆరవ అధికరణం మేరకు హిందీ భాష! రాజ్యాంగం అమలులోకి వచ్చిన తరువాత పదిహేను సంవత్సరాలు మాత్రమే 'ఇంగ్లీషు' 'హిందీ'కి అనుబంధంగా ఉపయోగించాలన్నది రాజ్యాంగ నిబంధన! కానీ సకల భారతీయ భాషలను తుదముట్టించడానికై 'ఇంగ్లీషు' దేశమంతటా జనం నెత్తిక్కి తాండవం చేస్తోంది!!

గ్రామీణ ప్రాంతాలలోని విద్యార్థులలో డెబ్బయి తొమ్మిది శాతం ఇంగ్లీషును వ్రాయగలుగుతున్నారట, చదువగలరట, వాక్యాలను అర్థం చేసుకుంటున్నారట! పదునాలుగు, పద్దెనిమిది ఏళ్ల మధ్య వయస్కులలో ఇలా ఆంగ్లభాషను అర్థం చేసుకుంటున్నవారి సంఖ్య యాబయి ఎనిమిది శాతమన్నది 'వార్షిక పాఠశాల విద్యా నివేదిక' ద్వారా నిర్ధారణ జరిగిందట! దేశవ్యాప్తంగా ఆంగ్లభాష పట్ల ఆదరణ పెరిగిపోతోందనడానికి ఈ 'నిజనిర్ధారణ' సరికొత్త ప్రాతిపదిక. ఆంగ్లభాషను అభ్యసించినట్టయితే అమెరికాకు వెళ్లి ఉద్యోగాలు చేసి 'డాలర్ల'ను సంపాదించవచ్చునన్నది గత మూడు నాలుగు దశాబ్దులుగా ప్రచారమైన మహా విషయం. ''ఇది కేవలం భ్రాంతి'' అని ఇప్పుడు ధ్రువపడింది! అయినప్పటికీ లక్షలు కోట్లు రూపాయలు సంపాదించడానికి 'ఇంగ్లీషు' భాష ఇంగ్లీషు మాధ్యమ విద్య మాత్రమే దోహదం చేయగలదన్నది వాణిజ్య ప్రపంచీకరణ - గ్లోబలైజేషన్ - వల్ల మనకు దాపురించిన సమష్టి మనఃప్రవృత్తి! 'సంపాదన' ప్రధానం, మిగిలినవన్నీ పనికిరానివి.. వ్యక్తిగత సౌశీల్యం, జాతీయ భావనిష్ఠ, మాతృదేశం పట్ల, మాతృ సంస్కృతి పట్ల మమకారం, భారతీయమైన విలువల పట్ల కట్టుబాటు ఇవన్నీ నామరూపాలు లేకుండా నశించిపోతుండడం శిశువులను ఆంగ్ల మాధ్యమ శిక్షణకు గురిచేస్తున్న దేశవ్యాప్త ప్రక్రియకు సమాంతర పరిణామాలు..

విద్య ఒసగును వినయంబు - విద్యాదదాతు వినయం - అన్నది భారతీయ జీవన లక్షణం! కానీ ఇంగ్లీషు భాషా పాండిత్యం పెరిగిన వారిలో అత్యధికులకు వినయం అలవడడం లేదు, అతిశయం అలవడుతోంది! యుగాలుగా సాగిన భారతీయ జీవన విధానం కంటె విభిన్నమైన పద్ధతిలో తాము ప్రవర్తించాలన్న భావం లేదా భ్రాంతి ఉన్నత పాఠశాలల విద్యార్థి దశలోనే అలముకుంటోంది. ఇంగ్లీషు చదవని కర్షకుల కంటె, వృత్తిపనులవారికంటె, గ్రామీణులకంటె తమ కుటుంబంలోని తల్లిదండ్రులకంటె తాతలకంటె నాయనమ్మలకంటె తాము 'ప్రత్యేకత' సంతరించుకుంటున్నామన్నది, అతిశయానికి ప్రాతిపదిక! అధికాధికులలో ఈ 'అతిశయం' 'దురహంకారం'గా రూపొందుతోంది! ''నితాంత అపార భూతదయ'' భారతీయులు యుగయుగాల సమష్టి జీవన ప్రవృత్తి! కానీ 'ఇంగ్లీషు మీడియమ్' ద్వారా తయారవుతున్నవారిలో ఎక్కువ మందిని మౌలిక జాతీయ సంస్కారం పట్ల అవగాహన తక్కువైపోయింది! అందువల్ల ''నేను'' సంపాదిస్తున్నాను, నేను ఖర్చు పెట్టుకుంటున్నాను..'' అన్న వికృత చిత్తవృత్తి అధికాధికులను ఆవహించి ఉంది. ''నేను సంపాదించిన దానిలో సమాజం కోసం, దేశం కోసం, జాతి కోసం, సమష్టి హితం కోసం కొంతయినా ఖర్చు పెట్టాలి...'' అన్న భారతీయ సంస్కారం భారతీయ భాషల ద్వారా వికసించింది! ''పరోపకారాయ పుణ్యాయ పాపాయ పరపీడనమ్'' అన్నది ఈ సంస్కారం!!

ఇలా విద్యాస్థాయి పెరిగినకొద్దీ 'భారతీయత'కు విద్యావంతులలో ఎక్కువ శాతం దూరమైపోతుండడం స్వతంత్ర భారతదేశంలో నడుస్తున్న కథ! భారతీయ భాషల మాధ్యమంగా ప్రభుత్వ పాఠశాలలోను, కొన్ని జాతీయ స్వచ్ఛంద సంస్థలు నిర్వహించే పాఠశాలలలోను నిన్నమొన్నటి వరకు విద్యాబోధన జరిగేది. కానీ ఇప్పుడు అన్ని పాఠశాలలోను శిశుస్థాయినుంచి - మూడేళ్ల వయసు నుంచి - మాతృభాషలను నేర్పని విద్యాబోధన వ్యవస్థ ''వికసిస్తోంది''! తెలుగును చదవలేని, తెలుగును వ్రాయలేని, ఆంగ్ల పదాలతో అతిగా సంకరమైన తెలుగును మాట్లాడే ఉన్నతోన్నత విద్యావంతుల సంఖ్య నిరంతరం పెరుగుతోంది! దేశంలోని అనేక ప్రాంతాలలో మాతృభాషలకు ఇదే దుర్గతి దశల వారీగా దాపురిస్తోంది! అతిశయం, అహంకారం, ఆర్థిక పరమావధి, సమష్టి హితం పట్టని అమానవీయత, క్రూరమైన నిర్లక్ష్యం కొలువుతీరున్నాయి. జరిగిన జరుగుతున్న వికృతకాండకు ఇదీ కారణం. హృదయం లేని బుద్ధి, సంస్కార స్పర్శ లేని విజ్ఞానం 'ఆంగ్ల' మాధ్యమ ప్రాథమిక విద్యాబోధన ఫలితం.. మొక్కయి వంగనిది మానయి వంగునా??

జమిలి ఎన్నికలే శరణ్యం

ఢిల్లీ కబుర్లు

- కె. కైలాష్

ఒక దేశం, ఒక ఎన్నికల సిద్ధాంతాన్ని ఇకనైనా అమలు చేయటం మంచిది. ఒక దేశం ఒక పన్నుల విధానానికి శ్రీకారం చుట్టిన చోట ఒక దేశం ఒక ఎన్నికల విధానానికి కూడా ఓటు వేయటం మంచిది. గుజరాత్, పంజాబ్ తదితర రాష్ట్రాల శాసన సభల ఎన్నికల ప్రక్రియ ముగిసిందో లేదో నాగాలాండ్, త్రిపుర, మేఘాలయ ఎన్నికలు వచ్చాయి. మూడు ఈశాన్య రాష్ట్రాల ఎన్నికలు ఒక కొలిక్కి రాగానే కర్నాటక రాష్ట్ర శాసనసభ ఎన్నికలు తన్నుకు వస్తాయి. ఇవి కాగానే మధ్య ప్రదేశ్, చత్తీస్‌గఢ్ మరి కొన్ని రాష్ట్రాల ఎన్నికలను జరుపవలసి ఉంటుంది. ఇవి కాగానే లోకసభ, తెలంగాణా, ఆంధ్రా తదితర రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకు సమయం ఆసన్నమవుతుంది. అంటే ప్రతి సంవత్సరం ఏదో ఒక రాష్ట్రంలో ఎన్నికల ప్రక్రియ జరుగుతోంది. శాసన సభలతోపాటు స్థానిక సంస్థలు, సహకార సంస్థలు, ఇతర ఎన్నికలు నిరంతరం జరుగుతూనే ఉన్నాయి. దీని వలన దేశానికి ఎంతో నష్టం జరుగుతోందనే వాస్తవాన్ని రాజకీయ పార్టీలు ఇప్పటికైనా గ్రహించి జమిలి ఎన్నికలకు సిద్ధమైపోవాలి. లోకసభతోపాటే అన్ని రాష్ట్రాల శాసనసభల ఎన్నికలు నిర్వహించటం ద్వారా ప్రజాధనం వృధా కాకుండా చూడటంతోపాటు ప్రభుత్వాలు అభివృద్ధి పథకాల అమలు, పరిపాలనపై దృష్టి పెట్టేందుకు వీలు కల్పించటం మంచిది. ఒకసారి లోకసభకు ఆ తరువాత ప్రతి సంవత్సరం నాలుగైదు రాష్ట్రాల శాసనసభల ఎన్నికలు జరగటం వలన ప్రజాధనం వృధా కావటంతోపాటు ప్రభుత్వాలు అభివృద్ధిపై దృష్టి కేంద్రీకరించలేకపోతున్నాయి. నాయకుల దృష్టి అంతా ఎన్నికల కోసం సమాయత్తం కావటంపై కేంద్రీకృతం కావటంతో పాలనపై శ్రద్ధ తగ్గుతోంది. అభివృద్ధి పథకాలు అమలులో జాప్యం జరుగుతోంది. వాటి ప్రాధాన్యతను కోల్పోతున్నాయి. దేశాభివృద్ధికంటే ఎన్నికల ప్రక్రియకే ఎక్కువ సమయం వెచ్చించవలసి వస్తోంది. 2014లో లోకసభ ఎన్నికలు జరగటం అందరికి తెలిసిందే. భారత పార్లమెంటరీ చరిత్రలో తొమ్మిది దశల్లో ఈ ఎన్నికలు జరిగాయి. లోకసభతోపాటు తెలంగాణా, ఆంధ్రప్రదేశ్, ఒడిశా, సిక్కిం అసెంబ్లీ శాసనసభలకు ఎన్నికలు జరిగాయి. 2014 సంవత్సరాంతంలో హర్యానా, జమ్ముకశ్మీర్ జార్ఖండ్, మహారాష్ట్ర శాసన సభల ఎన్నికలు జరిగాయి. 2014 సంవత్సరమంతా ఎన్నికలతో సరిపోయింది. ఈ సంవత్సరం లోకసభతోపాటు మొత్తం ఎన్నిమిది రాష్ట్రాల శాసనసభల ఎన్నికలు జరిగాయి. 2014లో జాతీయ పార్టీలతోపాటు ప్రాంతీయ పార్టీల నాయకులు కూడా తమ పూర్తి సమయాన్ని ఎన్నికలకు ఖర్చు చేయటంతో ప్రజలు, వారి సమస్యల గురించి ఆలోచించటం గగనమైపోయింది. 2015లో దేశ రాజధాని ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలతోపాటు అత్యంత ప్రతిష్టాత్మకమైన బిహార్ శాసన సభ ఎన్నికలు జరిగాయి. బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో విజయ సాధించేందుకు బి.జె.పి కూటమి కాంగ్రెస్, ఆర్.జె.డి, జనతాదళ్ (ఎస్) పార్టీలతో కూడిన మహాకూటమి మధ్య హోరాహోరీ పోరాటం జరిగింది. 2016లో ఐదు రాష్ట్రాల శాసనసభల ఎన్నికలు జరిగాయి. అస్సాం, పశ్చిమ బెంగాల్, కేరళ, పాండిచ్చేరి, తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. 2017 సంవత్సరాన్ని కూడా ఎన్నికల సంవత్సరంగానే పరిగణించవచ్చు. 2017 సంవత్సరం ప్రారంభంలో పంజాబ్, గోవా, ఉత్తరాఖండ్, ఉత్తర ప్రదేశ్, మణిపూర్ అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. ఆ తరువాత భారత రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి ఎన్నికల ప్రక్రియ చోటుచేసుకున్నది. ఇది ముగియగానే సంవత్సరాంతంలో హిమాచల్ ప్రదేశ్, గుజరాత్ శాసనసభల ఎన్నికలు జరిగాయి. 2018 కొత్త సంవత్సరం మూడు ఈశాన్య రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలతో మన తలుపుతట్టింది. ఈ సంవత్సరం కూడా ఒక రంగంగా ఎన్నికల సంవత్సరంమే. 2018లో మొత్తం ఎనిమిది రాష్ట్రాల శాసనసభల ఎన్నికలు జరుగవలసి ఉన్నది. ఈశాన్యంలోని త్రిపుర, నాగాలాండ్ మేఘాలయ ఎన్నికలు ఫిబ్రవరిలో జరుగుతాయి. ఈ మూడు రాష్ట్రాల ఎన్నికల ప్రక్రియ ముగిసిన వెంటనే కర్నాటక అసెంబ్లీ ఎన్నికలు మన ముందు నిలుస్తాయి. మేలో శాసనసభ



> **దేశంలో ఎన్నికల సంస్కరణలు అత్యవసరం. ఎప్పుడూ ఏదో ఒక రాష్ట్రంలో ఎన్నికలు జరుగుతూనే ఉన్నాయి. ముఖ్యంగా గడచిన మూడేళ్లు ఎన్నికల సంవత్సరాలుగానే సాగిపోయాయి. ఈ ఏడాది కూడా అదే పరిస్థితి. నిరంతర ఎన్నికల ప్రక్రియవల్ల అభివద్ధిపై దృష్టి సారించే తీరిక, యోచించే శక్తి ప్రధాన పార్టీలకు, ప్రభుత్వ నిర్వాహకులు లోపిస్తాయి. ఎంతసేపూ గెలుపుపైనే ఆసక్తి ఉంటుంది. దేశ విదేశ వ్యవహారాలపై అటు పాలకపక్షం, ఇటు విపక్షం యోచించే అవకాశం తగ్గిపోతుంది. పైగా తరచూ ఎన్నికల నిర్వహణవల్ల పెద్దఎత్తున సమయం, డబ్బు వృధా అవుతాయి. జమిలి ఎన్నికల వల్ల ఈ సమస్య పరిష్కారమవుతుంది. ఒక దేశం, ఒకే ఎన్నిక విధానం అమల్లోకి రావలసిన తరుణం ఆసన్నమైంది.**

కాల పరిమితి ముగుస్తున్న కర్నాటక ఎన్నికల ప్రక్రియను మే నెల ప్రారంభంలో పూర్తి చేయవలసి ఉంటుంది. కర్నాటక అసెంబ్లీ ఎన్నికల కుస్తీ ముగియగానే నాలుగు రాష్ట్రాల ఎన్నికలు మన ముందుకు వస్తాయి. బి.జె.పి అధికారంలో ఉన్న చత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్‌తోపాటు మిజోరం ఎన్నికలు ఈ సంవత్సరాంతంలో జరుగవలసి ఉన్నది. ఈ ఎన్నికల ప్రక్రియ ముగియగానే మళ్లీ లోకసభ, తెలంగాణా, ఆంధ్రా, ఒడిశా, సిక్కిం ఎన్నికల పండుగ ప్రారంభం అవుతుంది. ఈ లెక్కన 2014 నుండి దేశంలో ప్రతి సంవత్సరం ఏదో ఒక రాష్ట్రంలో ఎన్నికల ప్రక్రియ కొనసాగుతూనే ఉన్నది. ఇకమీదట కూడా ఈ ప్రక్రియ కొనసాగుతుంది. ఆయా రాష్ట్రాల నాయకులు ఒకసారి మాత్రమే ఎన్నికల ప్రక్రియలో పాల్గొన్నా జాతీయ పార్టీల నాయకులు మాత్రం ప్రతి సంవత్సరం ఎన్నికలపై దృష్టి కేంద్రీకరిచవలసి వస్తోంది. కేంద్రంలో అధికారంలో ఉన్న బి.జె.పి ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్, ఇతర ప్రముఖ పార్టీల చాలా సమయం ఎన్నికల ఏర్పాట్ల కోసం వృధా అవుతోంది. అభ్యర్థుల ఎంపిక, ఎన్నికల ఖర్చు, ప్రచారం తదితర పనులకే జాతీయ పార్టీల సమయాన్ని వెచ్చించవలసి వస్తోంది. ఎన్నికల ఖర్చు కూడా ఇబ్బడిముబ్బడిగా పెరుగుతోంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గత నాలుగు సంవత్సరాలలో ఐదారు నెలల సమయాన్ని ఎన్నికల ప్రచారం, ఇతర పనుల కోసం వినియోగించవలసి వచ్చింది. ఇదే విధంగా కాంగ్రెస్ పార్టీ అధినాయకుడు రాహుల్ గాంధీ ఎన్నికల కోసం సమయాన్ని వెచ్చించకతప్పలేదు.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ లోకసభతోపాటు అన్ని రాష్ట్రాల శాసనసభల ఎన్నికల ఒకేసారి నిర్వహించటం మంచిదని వాదిస్తున్నారు. ఇలా చేయటం వలన అధికారంలో ఉన్న వారు పాలనపై దృష్టి కేంద్రీకరించేందుకు వీలుంటుంది. ప్రజల అభివృద్ధికి పెద్దపీట వేసేందుకు అవసరమైన సమయం లభిస్తుందన్నది అతని వాదన. నరేంద్ర మోదీ ప్రతిపాదించిన జమిలి ఎన్నికలపై ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్‌తోపాటు ఇతర ప్రతిపక్షాల నుండి సానుకూల స్పందన పెద్దగా రావటం రాకపోవటం దురదృష్టకరం. నిరంతర ఎన్నికల విష వలయం నుండి దేశాన్ని, దేశ ప్రజలను కాపాడవలసిన బాధ్యత అధికారంలో ఉన్న పార్టీతోపాటు ప్రతిపక్షాలపై కూడా ఉన్నది. అధికార, ప్రతిపక్షాలు కలిసి పని చేస్తేనే జమిలి ఎన్నికలు సాధ్యమవుతాయి. అందుకే అధికార, ప్రతిపక్షాలు తమ పార్టీ రాజకీయాలను పక్కన పెట్టి దేశ శ్రేయస్సు కోసం జమిలి ఎన్నికల నిర్వహణపై దృష్టి కేంద్రీకరించటం మంచిది. నిరంతర ఎన్నికల మూలంగా సమర్థవంతమైన పరిపాలన అనేది అసాధ్యంగా మారింది. సమర్థ పరిపాలన కొరవడటం వలన దేశాభివృద్ధి పెద్ద ఎత్తున కుంటుపడుతోంది. సమర్థ పాలన కరువుకావటంతోపాటు అధికార యంత్రాంగం దృష్టి అంతా ఎన్నికల పనులపై కేంద్రీకృతం కావటంతో అభివృద్ధి పథకాల అమలు అనేది ఒక కలగా మారుతోంది. అధికారులు నెలల తరబడి ఎన్నికల ఏర్పాట్లలో మునిగిపోవటంతో పథకాల అభివృద్ధి అనేది మూలకుపడుతోంది. ఎన్నికల సమయంలో కనీసం మూడు నెలలపాటు అభివృద్ధి పథకాల అమలుకు తాళం పడటం ఎంతవరకు శ్రేయస్కరం. ఎన్నికల మూలంగా ఆర్థికాభివృద్ధి కుంటుపడటంతోపాటు శాంతిభద్రతలు దెబ్బతింటున్నాయి. ఎన్నికల సమయంలో సంఘ వ్యతిరేకశక్తుల పంటపడుతోంది. ప్రతి రాజకీయ పార్టీ ఎంతో కొంత సంఘ వ్యతిరేకశక్తులను ఎన్నికల సమయంలో ఉపయోగించుకుంటున్నారు. ఎన్నికల సమయంలో మార్గదర్శక సూత్రాలు అమలులోకి రావటంతో అభివృద్ధి పథకాల అమలు ఎక్కడికక్కడ నిలిచిపోతోంది. లోకసభ, శాసనసభల ఎన్నికలతోపాటు ఇతర అన్నిరకాల ఎన్నికలు ఐదు సంవత్సరాలకు ఒకేసారి జరిగితే అధికారంలో ఉన్న పార్టీ తమ పూర్తి సమయం, దృష్టిని అభివృద్ధి, పరిపాలనపై కేంద్రీకరించగలుగుతుంది. ప్రభుత్వ యంత్రాంగంకూడా ఏకాగ్రతతో ప్రభుత్వ పథకాలను అమలు చేయగలుగుతుంది. ప్రతిపక్షాలు కూడా ప్రభుత్వం తప్పొప్పులను ప్రజల ముందు పెట్టగలుగుతాయి. నిరంతర ఎన్నికల మూలంగా అధికార, ప్రతిపక్షాల తమ విధ్యుక్త ధర్మాన్ని సమర్థంగా నిర్వహించలేకపోతున్నాయి. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారంగా జమిలి ఎన్నికలకు అన్ని రాజకీయ పార్టీలు ఆమోద ముద్ర వేయాలి. ముందస్తు ఎన్నికలకు స్వస్తి పలకటంతోపాటు మధ్యలో ఎన్నికలు జరపవలసి వస్తే వాటిని మిగతా సమయానికి మాత్రమే వర్తించేలా చట్టం చేయాలి. తద్వారా లోకసభ, శాసన సభలతోపాటు ఇతర అన్ని రకాల ఎన్నికలను ఐదు సంవత్సరాలకు ఒకసారి జరిగేలా చట్టపరమైన చర్యలు తీసుకోవటం మంచిది.

అతడొక నిప్పుకణం!

నేడు నేతాజీ జయంతి

''నాకు మీ రక్తాన్ని ఇవ్వండి. నేను మీకు స్వాతంత్ర్యాన్ని ఇస్తాను'' అని గర్జించింది ఆ కంఠం. ఉత్సాహంతో ఉరకలెత్తుతూ స్వదేశంలోని బ్రిటిష్ ప్రభుత్వంపై యుద్ధానికి సిద్ధమవుతున్న 'అజాద్ హింద్ ఫౌజ్' సైనికులను ఉద్దేశించి సుభాష్ చంద్రబోస్ పలికిన పలుకులు ఇవి.

రెండవ ప్రపంచ యుద్ధంలో బ్రిటిష్‌వారి తరపున పోరాడి జర్మనీ, ఇటలీ, జపాన్ సైనికులకు చిక్కి జైళ్లలో మగ్గుతున్న భారతీయ ఖైదీలను విడిపించి వారిలో ఆత్మాభిమానాన్ని, దేశభక్తిని రగిలించి, మాతృదేశాన్ని దాస్య శృంఖలాలనుంచి విముక్తురాలిని చేయడానికి గొప్ప సైన్యాన్ని ఏర్పాటు చేశాడు నేతాజీ. ఒకటిన్నర లక్షల పైచిలుకు సైనికులతో ఏర్పడిన 'అజాద్ హింద్‌ఫౌజ్' ఆంగ్లేయుల్లో కలవరానికి కారణమైంది. ఆ సైనికులు బోసును 'నేతాజీ' అని ఆప్యాయంగా పిలిచేవారు.

వంగ భూమి అనేకమంది దార్శనికులకు, స్వాతంత్ర్య యోధులకు జన్మభూమి. 1904లో రాష్ట్ర విభజన 'వందేమాతరం' ఉద్యమానికి నాంది పలికింది. 1897 జనవరి 23న పండిత జానకీనాథ్ బోసు, ప్రభావతిలకు జన్మించిన చంద్రబోస్ ఆ తరువాత దేశానికి 'నాయకుడ'య్యాడు. కటక్‌లో ప్రాథమిక విద్య, తల్లిదండ్రుల నుంచి సంస్కారం నేర్చుకున్నాడు. ఆయన చదివిన పాఠశాల ప్రధానాచార్యులు శ్రీ వేణుమాధవ్‌దాస్ ప్రభావం సుభాష్‌పై ఎక్కువ. వివేకానందుడి రచనలు ఆయనకు స్ఫూర్తినిచ్చాయి. కానీ సుభాష్ ఐసీఎస్ చేయాలని తండ్రి కోరిక. కలకత్తాలో ఉన్నత విద్య తరువాత ఐసీఎస్ కోసం ఇంగ్లండ్ బయలుదేరాడు. 9నెలల స్వల్ప వ్యవధిలో ఐసీఎస్ పరీక్షకు తయారై 4వ ర్యాంకు సాధించిన బోస్ ఇంగ్లండులో ఉన్నప్పుడు ప్రపంచ రాజకీయ పరిస్థితులను అధ్యయనం చేశాడు. స్వతంత్ర దేశాలుగా బ్రిటన్, ఫ్రాన్స్ చేస్తున్న ప్రగతి సొంత దేశమైన భారత్‌లో ఎందుకు సాధ్యం కాదన్నది ఆయన మనసును తొలిచివేసేది. ఇక ఆ ఆలోచనల పరంపర స్థిరంగా ఉండనివ్వలేదు. ఐసీఎస్‌కు రాజీమానా చేసి స్వదేశానికి చేరుకున్నాడు. బంగబంధు చిత్తరంజన్ దాసు నాయకత్వంలో స్వతంత్ర పోరాటంలో పాలుపంచుకున్నాడు. అప్పుడే ఆయన భారత జాతీయ కాంగ్రెస్ ప్రచార సారథిగా నియుక్తుడయ్యాడు. స్వరాజ్య సేవాదళ్‌ను ఏర్పాటు చేసి సేవాకార్యక్రమాలు నిర్వహించాడు. ఉద్యమాలలో పాల్గొనడం, నిర్బంధానికి గురవడం మామూలైపోయింది. కాంగ్రెస్ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టి సంపూర్ణ స్వరాజ్యా సాధన లక్ష్యమని నినదించాడు. 1923 లాహోర్ కాంగ్రెస్‌లో ఆ మేరకు తీర్మానం చేశారు. 1938లో జరిగిన 'హరిపూర్' కాంగ్రెస్ నేతాజీ అధ్యక్షతన జరిగింది. దేశంలోని యువత బోసు ఆలోచనలు, మాటలకు ఉత్తేజితులయ్యేది. గాంధీజీ నాయకత్వంలోని మితవాదులకు ఆయన వైఖరి నచ్చేది కాదు. 1939లో కాంగ్రెస్ అధ్యక్షులుగా బోసు ఎన్నికవడం చరిత్ర. అయితే గాంధీజీ ప్రతిపాదించిన పట్టాభి ఓటమిని జీర్ణించుకోలేని మితవాదులు బోసుకు సహకరించకపోవడంతో ఆయన రాజీనామా చేశారు. ఆ తరువాత కాంగ్రెస్‌లో ఉంటూనే 'ఫార్వర్డ్‌బ్లాక్' పేరిట ప్రెషర్‌గ్రూపును ఏర్పాటు చేసి తన ఆశయ సిద్ధి కోసం పోరాటం చేశాడు. ఉధృతస్థాయిలో ఉద్యమాలు చేస్తుండటంతో బ్రిటిష్ ప్రభుత్వం కలవరపాటుకు గురై గృహనిర్బంధం చేసింది. మౌల్వీ వేషంలో తప్పించుకుని జర్మనీ చేరిన సుభాష్ మాతృదేశ స్వాతంత్ర్యం కోసం జర్మనీ రేడియోను ఆయుధంగా వాడుకున్నాడు. ఆయన ప్రసంగాలు ప్రజలను ఉగ్రూతలూగించేవి. బెర్లిన్‌లో 'ఇండియా ఇండిపెండెన్స్ డే' ద్వారా రేడియో ప్రసంగాలతో దిశానిర్దేశం చేసేవాడు. జర్మనీ అధ్యక్షుడు హిట్లర్ సహకారంతో 'అజాద్ హింద్ ఫౌజ్'ను నిర్మించాడు. అక్కడి నుండి జలాంతర్గామిలో ప్రయాణం చేసి జపాన్ చేరుకుని అక్కడి ప్రభుత్వంతో యుద్ధ సహకార ఒప్పందం కుదుర్చుకొన్నాడు. సింగపూర్ కేంద్రంగా తన కార్యకలాపాలు ప్రారంభించాడు. 1943 అక్టోబర్ 21న సింగపూర్‌లో 5వేలమంది భారతీయ ప్రతినిధుల సమక్షంలో నేతాజీ 'అజాద్ హింద్ ఫౌజ్' ప్రవాస ప్రభుత్వాన్ని ప్రకటించాడు. ఆ సమావేశంలో ఆయన ప్రధాన మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశాడు. కెప్టెన్ లక్ష్మీసెహెగల్, ఎస్.ఎ.అయ్యర్, రాస్‌బిహారీ బోస్‌సహా 22మంది మంత్రులుగా ప్రమాణం చేశారు. ఈ ప్రభుత్వాన్ని జపాన్ సహా తూర్పు ఆసియా దేశాలు గుర్తించాయి. ప్రభుత్వం సమర్ధవంతంగా పనిచేసేందుకు 1944లో ప్రవాస భారతీయుల సహకారంతో ఒక 'బ్యాంకు'ను స్థాపించారు. 1943 అక్టోబర్ 24న నేతాజీ ప్రభుత్వం బ్రిటన్‌పై యుద్ధం ప్రకటించింది. చలో ఢిల్లీ అంటూ బోసు సింహగర్జన చేశాడు. అదే ఏడాది డిసెంబర్‌లో అండమాన్ నికోబార్ దీవులు వీరి అధీనంలోకి వచ్చాయి. తొలిసారిగా త్రివర్ణ పతాకం భారత భూభాగంపై రెపరెపలాడింది. ఆ దీవులకు నేతాజీ 'స్వరాజ్', 'షహీద్' అని పేరుపెట్టారు.



ఆ తరువాత జాతీయ సేనలు 'జైహింద్' అంటూ భారత ఈశాన్య భాగాలైన కోహిమా, కొలాంగ్‌లకు విముక్తిని సాధించిపెట్టాయి. అయితే రెండవ ప్రపంచ యుద్ధంలో జర్మనీ, జపాన్ లొంగిపోవడంతో బ్రిటిష్ సేనలది పైచేయి అయింది. అజాద్ హింద్ ఫౌజ్ సేనలు వెనక్కి తిరగక తప్పలేదు. సింగపూర్‌లో నేతాజీ మాట్లాడుతూ 'విధి బలీయమైనది' అని వ్యాఖ్యానించాడు. సింగపూర్ నుంచి ఆయన ప్రత్యేక విమానంలో 'టోక్యో' బయలుదేరాడు. దారిలో ఆయన ప్రయాణించిన విమానం ప్రమాదానికి గురైందని, నేతాజీ మరణించినట్లు జపాన్ రేడియో ప్రకటించింది.

అయితే నేతాజీ మాతృదేశ విముక్తి కోసం చేసిన పోరాటం వృధాకాలేదు. ఆయన కారణంగా దేశంలో స్వాతంత్ర్య కాంక్ష రగిలింది. ఎక్కడికక్కడ యువత స్వాతంత్ర్య పోరాటానికి సిద్ధమయ్యారు. ముంబయిలోని బ్రిటిష్ నావికాదళంలోని భారతీయ సైనికులు తిరుగుబాటుకు ఆ ఉత్సాహమే కారణమైంది. త్యాగము, దేశభక్తి, అనుకున్నది సాధించేవరకు విశ్రమించని కార్యదీక్ష సుభాష్ చంద్రుని జీవితం నుంచి మనం నేర్చుకోదగ్గ అంశాలు. వారి జీవితం నేటి యువతకు స్ఫూర్తి.

-వి.వి.సుబ్బారావు

ఈ ప్రశ్నకు బదులేది?

చరిత్రలో చాలా ప్రశ్నలకు సమాధానం దొరకటంలేదు. అందుకు కారణం మన అధ్యయన లోపం కాదు. చరిత్ర నిర్మాణమే అలా జరిగింది. ఇంతకూ చరిత్ర అంటే ఏమిటి? కొందరు సాహసోపేతమైన వ్యక్తులు కాలంపై అద్దిన పాదముద్రలు. ఈ సాహసవీరులు సత్పురుషులు కావాలనే సిద్ధాంతం ఏమీ లేదు. కాని రామచరిత్ర నిర్మాతలవుతారు. అయోధ్యలో రాముడు చరిత్రను నిర్మించినట్లే లంకలో రావణుడు- ఆధునిక రావణుడు వేలుపిళ్లె ప్రభాకరన్ చరిత్రను నిర్మించారు. చరిత్ర పునరావృతమవుతుందని ఇందులో ఒక గతితర్కం ఉందని విశ్లేషకులు చెపుతారు. మరి పాఠాలు గుణపాఠాలు నేర్చుకోవలసిన బాధ్యత ప్రజలకు లేదా?

పురుషోత్తముణ్ణి ఓడించటం కోసం అంబి అనే రాజు అలెగ్జాండర్‌తో చేతులు కలిపాడు. పృధ్వీరాజ్ చౌహాన్‌ను ఓడించటం కోసం రాజా జయచంద్ మహమ్మద్ ఘోరీని ఆహ్వానించాడు. అక్బర్ పాదుషాకు రాజా మాన్‌సింగ్ సేనాధిపతిగా పనిచేశాడు. ఇతడు గొప్ప శివభక్తుడు. ఉదయమే రుద్రాభిషేకం చేసి తర్వాత రాజపుత్ర నాయకుడైన రాణాప్రతాపసింహుణ్ణి వేటాడటం కోసం ససైన్యంగా ఆరావళీ పర్వత శ్రేణికి బయలుదేరాడు. అంటే దైవభక్తులంతా దేశ భక్తులు కాదు అని తాత్పర్యం.

మాలిక్ కాఫర్ 1310లో వరంగల్ నుండి 241 టన్నుల బంగారం ఢిల్లీ ఎలా తరలించుకొనిపోయాడు? మన మయూర సింహాసనం ఏమయింది? కోహినూర్ వజ్రం ఏమయింది? పదవ నిజాం ఉస్మాన్ అలీఖాన్ 45 ట్రక్కులో బంగారాన్ని పాకిస్తాన్‌కు తరలిస్తుంటే నెహ్రూ, పటేల్ ప్రభృతులు ఎందుకు చూస్తూ ఊరుకున్నారు? మహమ్మద్ అలీ జిన్నా కాశ్మీరులోని సగం భాగాన్ని ఆక్రమించుకుంటుంటే ఎందుకు చూస్తూ ఊరుకున్నారు? అసలు 1947లో భారతదేశాన్ని 'మతం' ప్రాతిపదికపై విభజిస్తుంటే కాంగ్రెస్, కమ్యూనిస్టు నాయకులు ఎందుకు మద్దతు పలికారు? విక్టోరియా రాణి ఎవరు? ఈమె మీద పంచమ జార్జి చక్రవర్తిమీద మన కవులు పంచరత్నాలు రాయడం ఏమిటి? కొక్కొండ వెంకటరత్నం పంతులు వేల్స్ యువరాజు చరిత్ర వ్రాశాడు. జార్జి రాజేంద్ర వైభవ విర్జితేంద్ర అనే మకుటంతో తిరుపతి వెంకటకవులు సీస పద్యాలు వ్రాశారు. హిందూ పీఠాధిపతులు జార్జి పట్టాభిషేకానికి ఆశీర్వాద మంత్రాక్షతలు పంపారు.

నేతాజీ సుభాష్ చంద్రబోస్‌ను కుక్క అని ఎందుకు తిట్టారు? భారత ప్రధాని నరేంద్ర మోదీని వేణీప్రసాద్ వర్మ పిచ్చికుక్క అని ఎందుకు తిట్టినట్లు? సమాజవాద పార్టీ నేతలు మాయావతి (యుపి)ని చంపబోతే ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు ఆమెను రక్షించారు. ఆమె, కాన్షీరాంలు హిందూ సాంస్కృతిక సంస్థల కార్యకర్తలు పాములు, తేళ్లు అని తిట్టారు. భారతదేశాన్ని ముక్కలు ముక్కలు చేయండి అని పిలుపునిచ్చిన ఢిల్లీలోని జెఎన్‌యు విద్యార్థి నాయకుడు కన్నయ్య కుమార్‌ను ఏచూరి సీతారాం, అరవింద్ కేజ్రీవాల్, రాహుల్ గాంధి ఎలా బహిరంగ మద్దతు ప్రకటించారు? భారతదేశంలో ఇప్పటికే తొమ్మిది రాష్ట్రాల్లో హిందువులు మైనారిటీలుగా మారిపోయారు. భారీగా క్రైస్తవీకరణం జరుగుతున్నది. ఐనా ఒక్క పీఠాధిపతి కూడా ఎందుకు రంగంలోకి దిగలేదు? యుపిలో ఉగ్రవాద సిమి సంస్థ వారు మా పార్టీ యువ కార్యకర్తల విభాగం అని ములాయంసింగ్ యాదవ్ ప్రకటించాడు. శివలింగాలమీద మూత్రం పోయండి అని కర్ణాటకలోని కలుబురిగి అనే ఒక సెక్యులరిస్టు పిలుపునిచ్చాడు. నరేంద్ర మోదీ భారత ప్రధాని అయితే తాను దేశం వదిలిపెట్టి వెళ్లిపోతానని యు.ఆర్.అనంతమూర్తి అనే కర్నాటక సాహితీవేత్త ప్రకటించారు. ఈయన కేంద్ర సాహిత్య అకాడమీ అధ్యక్షుడు. ఇవన్నీ ఎలా జరిగాయి??

చరిత్రలో ఎప్పుడో ఏవో జరిగాయి. అల్లా ఉద్దీన్ ఖిల్జీ అక్బర్ ఔరంగజేబులకు మేము సమకాలికులం కాదు కదా! అని కొందరు ప్రశ్నించవచ్చు. మరి ఇవాళ మన కళ్ల ముందే చైనా, టిబెట్టును నేపాల్‌ను స్వాహా చేసింది కదా! దీనికి ఏం చెపుతారు? బ్రహ్మపుత్రపై చైనా ఓ ఆనకట్ట కట్టింది. మరి ఈ డామ్ నిర్మాణాన్ని ఎందుకు ఆపలేకపోయాము? కులభూషణ్ యాదవ్ అనే పౌరుణ్ణి అపహరించి పాకిస్తాన్ తన జైలులో పెట్టింది. అతనిని చూడడానికి అంతర్జాతీయ కోర్టు ఒత్తిడితో యాదవ్ భార్యకు అనుమతినిచ్చింది. ఆమె వెళితే గాజులు మంగళసూత్రాలు తీసివేయించారు. అద్దాలకు అవతల ఎవరినో నిలబెట్టి నాటకమాడారు. ఇది దుర్మార్గం అనడానికి మన దేశంలోని రాజకీయ ప్రముఖ పార్టీలకు నోరు రాలేదు. పదివేల జనాభా కూడా లేని కరవది అనే చిన్న గ్రామంలో (ప్రకాశం జిల్లా) పది చర్చిలు ఎలా వచ్చాయి?

'శిప్ర వాక్యం'

చైనా హిమాలయాలు దాటి భారత భూభాగాల్లోకి ప్రవేశిస్తుంటే 'హిందూ మతోన్మాదం నశించాలి' అంటే తాము హిందువులు కాదని దీని అర్థం. భారత్‌ను పాకిస్తాన్ చైనాలు ఆక్రమించుకుంటే తమకు అభ్యంతరం లేదని దీని సారాంశం. సోమనాథ దేవాలయంపై గజనీ మహమ్మద్ పదిహేడు సార్లు దండయాత్ర చేసి దేశ సంపదను దోచుకొనిపోయారు. 1948లో సోమనాథ దేవాలయ పునరుద్ధరణను కె.యం.మున్షీ, సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ ప్రతిపాదిస్తే దానిని తీవ్రంగా వ్యతిరేకించినవాడు నాటి భారత్ ప్రధాని పండిత జవహర్‌లాల్ నెహ్రూ. ఎందుకని?? బాబరీ మసీదు కూల్చివేతను కారణంగా చూపి పి.వి.నరసింహారావుమీద ఒత్తిడి తెచ్చి బిజెపి ప్రభుత్వాలను కూల్చివేసినవాడు మధ్యప్రదేశ్‌కు చెందిన అర్జున్‌సింగ్. ఆయనను ఒక దశలో సోనియాగాంధీ చెత్తబుట్టలో పడేసింది, ఎందుకని? పి.వి.నరసింహారావు కుటుంబ సభ్యులు రాజేశ్వరరావు వంటివారికి ఆమె కనీసం ఇంటర్వ్యూలు కూడా ఇవ్వలేదు, ఎందుకని? నరసింహారావుకు భారతరత్న రానీయలేదు, కనీసం దహనక్రియలు కూడా సరిగ్గా నిర్వహించలేదు. ''నామీద వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డిమీద ఆమె కక్ష కట్టింది'' అని తన అంతరంగాన్ని వెల్లడించాడు మాజీ ఎం.పి. కావూరి సాంబశివరావు. వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డిపై అక్రమాస్తుల కేసులు బనాయించారు. మరి రాహుల్ గాంధీ అక్రమాస్తుల మాటేమిటి? సమ్రాట్ సైకిల్ ఫ్యాక్టరీ నేషనల్ హెరాల్డ్ కేసుల సంగతి ఏమిటి? పనామా పేపర్ల ప్రచురణ తర్వాత పాకిస్తాన్ అధ్యక్షుడు నవాజ్ షరీఫ్ మీద అక్కడి కోర్టులు చర్యలు తీసుకున్నాయి. మరి ఇండియాకు చెందిన వారిపై ఎందుకు మోదీ ప్రభుత్వం ఉపేక్షాభావం ప్రదర్శించింది.

శారదా చిట్‌ఫండ్ కేసు ఏమయింది? నారదా టేపుల స్కాం ఏమయింది? దబోల్కర్, కలబురిగి, గౌరీ లంకేష్ హంతకులు ఎందుకు ఇప్పటికీ దొరకలేదు. సంచనాలు సృష్టించిన హైదరాబాద్ ఫిలింనగర్ డ్రగ్స్ కేసులు పబ్ కేసులు ఏమయినాయి? ఔను.. అవిమరచిపోయేటట్లుచేయగలిగారు. రోడ్డుమీద ఒక అనాథపై కారు నడిపి సల్మాన్ హత్య చేస్తే 'రోడ్డుపై గేదెలు పడుకుంటాయి కాని మనుషులెందుకు పడుకోవాలి?' అని బాలీవుడ్ భామలు ప్రశ్నించారు. ఇదీ మన కళాకారుల మానవత్వం?

కళాకారులు అంటే గుర్తుకువచ్చింది. 2004లో గోపీనాథ్ సారంగ్ కేంద్ర సాహిత్య అకాడమీ అధ్యక్షుడిగా ఎన్నిక అయితే ఆయనను మహాశ్వేత అండ్ కో చిత్రహింసలు పెట్టింది. అగ్రహారం కృష్ణమూర్తిని బర్తరఫ్ చేశారు. అక్కిరాజు రమాపతిరావుపైన అవిశ్వాస తీర్మానం పెట్టారు. బి.హెచ్.కృష్ణమూర్తిగారి సంధ్యావసరాలు తీర్చి పురస్కారాలు కొనుక్కున్నారు. పాఠ్య గ్రంథాలను రోమిల్లా థాపర్‌ల వక్రీకరణ చరిత్రలో నింపారు. మరి మహాఘనత వహించిన నరేంద్ర మోదీ ప్రభుత్వం ఇప్పటివరకు ఈ దుర్మార్గాలను ఎందుకు సరిచేయలేదు?? పనామా పేపర్స్‌లో పేర్కొన్న శరద్‌పవార్‌కు పద్మవిభూషణ్ ఎలా వచ్చింది? అంజలి, జమున, సావిత్రి, ఎస్.వి.రంగారావు వంటి అగ్రశ్రేణి నటులకు కనీసం పద్మశ్రీ కూడా ఎందుకు రాలేదు?

''నేను తెలుగుదేశం పార్టీకి మద్దతునిచ్చానని నా పేరు పద్మ పురస్కారాల జాబితా నుండి నాటి హోం శాఖామాత్యులు శివరాజ్‌పాటిల్ తొలగించారు'' అని సభాముఖంగా కైకాల సత్యనారాయణ ప్రకటించారు. 21 డిసెంబర్ 2017 నాడు సిబిఐ స్పెషల్ కోర్టు 2జి వాయుతరంగాల (స్పెక్ట్రం) అమ్మకం కేసులో కనుమొళి, ఎ.రాజా ఇత్యాదులంతా నిర్దోషులేనని సంచలనాత్మకమైన తీర్పునిచ్చింది. మరి మరి స్పెక్ట్రం కొనుగోళ్లలోని వేలం నోట్ల డబ్బు ఎలా మాయమయింది? కపిల్ సిబాల్ (న్యాయవాది) కేసును నీరుగార్చాడని చెబుతున్నారు. మరి ఎన్‌డిఏ ప్రభుత్వం ఏమి చేసినట్లు? భారతదేశపు ప్రజలకు న్యాయవ్యవస్థమీద ఇంకా విశ్వాసం ఉంది. అది కూడా పోతే తిరుగుబాటు వస్తుంది.

పదివేల కోట్ల మేరకు బ్యాంకుల ఋణం ఎగగొట్టి లండన్ పారిపోయిన విజయ్ మాల్యా 2జి తరంగాల తీర్పు విని ఇలా అన్నాడు. ''నాకు భారత న్యాయవ్యవస్థపై విశ్వాసం పెరిగింది. ఇండియాకు రావడానికి నాకు ఎటువంటి అభ్యంతరం లేదు''-ఒక సామాన్యుడు కోర్టుకు వ్యతిరేకంగా మాట్లాడితే దానిని కోర్టుధిక్కార నేరం (కంటెప్ట్ ఆఫ్ కోర్ట్) అనే నేరం కింద పరిగణిస్తారు మరి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా మీద సుప్రీంకోర్టు న్యాయమూర్తులు చలమేశ్వర్ ప్రభృతులు నలుగురు నేరారోపణ చేస్తే ఇది కోర్టు ధిక్కారం కిందకి వస్తుందా? లేదా? అనే అంశం న్యాయ నిపుణులు పరిశీలించి దేశానికి వివరించాలి.

-ప్రొ.ముదిగొండ శివప్రసాద్

అన్నీ వ్యక్తిగత ముచ్చట్లే!

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

న్యూఢిల్లీ, జనవరి 22: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బిగ్‌బజార్ ద్వారా రద్దయిన పాత 100, 500 రూపాయల నోట్లను మార్చుకునేందుకు ఇచ్చినంత ప్రాధాన్యత రాష్ట్ర ప్రయోజనాల పరిరక్షణకు ఇవ్వలేదని రాష్ట్ర కాంగ్రెస్ రాజ్యసభ సభ్యుడు కేవీపీ రామచందర్‌రావు ఆరోపించారు. సోమవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో విభజన అంశాల సాధనపై చంద్రబాబుకు రాసిన లేఖను విడుదల చేశారు.



- రాష్ట్ర ప్రయోజనాలు పట్టని ముఖ్యమంత్రి
- విభజన హామీల సాధనకు ఏ శక్తి అడ్డుపడుతోంది
- చంద్రబాబును నిలదీసిన కాంగ్రెస్ ఎంపీ కేవీపీ
- చరిత్రహీనులుగా మిగిలిపోవద్దంటూ లేఖ

విభజన చట్టంలో ఇచ్చిన హామీల సాధనకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు చంద్రబాబును ఏ శక్తి ఆపుతోందని రామచందర్‌రావు నిలదీశారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వం ఫిబ్రవరి ఒకటో తేదీనాడు పూర్తి బడ్జెట్‌ను పార్లమెంటులో ప్రతిపాదిస్తోంది, ఈ బడ్జెట్‌లో రాష్ట్రానికి సంబంధించిన అంశాలను చేర్చుకోవటంలో నాయుడు విఫలమయ్యే పక్షంలో, రాష్ట్ర ప్రజలు ముఖ్యంగా యువత ఆయనను క్షమించదు, చరిత్రహీనుడుగా మిగిలిపోతారని రామచందర్‌రావు ఆరోపించారు. చంద్రబాబు ఎన్నిసార్లు ఢిల్లీకి వచ్చినా తన వ్యక్తిగత ప్రయోజనాలు, హెరిటేజ్ ప్రయోజనాలు, పోలవరం ప్రాజెక్టు కాంట్రాక్టర్ల ప్రయోజనాల గురించి చర్చిస్తారు తప్ప రాష్ట్ర ప్రయోజనాల గురించి ఎందుకు చర్చించటం లేదని నిలదీశారు.

పోలవరం కాంట్రాక్టర్ల ప్రయోజన పరిరక్షణ కోసమే ఎన్‌డీఏ ప్రభుత్వంతో గొడవ పడుతున్నారు తప్ప విభజన హామీలకోసం కాదని అన్నారు. విభజన చట్టంలో ఇచ్చిన హామీలు అమలుకాకపోతే సుప్రీం కోర్టుకు వెళతానని హెచ్చరిస్తున్న నాయుడు తన పిటిషన్‌లో ప్రతివాదులుగా ఎవరిని పేర్కొంటారని కేవీపీ నిలదీశారు. రాష్ట్ర విభజన జరిగి మూడున్నర సంవత్సరాలు కావస్తున్నది, ఈ కాలంలో చంద్రబాబు సాధించింది ఏమిటని ప్రశ్నించారు. పెద్ద పెద్ద మాటలు చెప్పే చంద్రబాబు రాష్ట్ర ప్రయోజనాలను తుంగలో తొక్కటంద్వారా రాష్ట్ర యువతను అన్యాయం చేస్తున్నారని అన్నారు. రాష్ట్రాన్ని అస్తవ్యస్తంగా విభజించారని ఇప్పుడు తెలుసుకోవటం ఏమిటని ఆయన ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాన్ని ఆదుకోవటం లేదని చంద్రబాబు ఆరోపించటాన్ని రామచందర్‌రావు ఖండించారు. నాయుడు అవకాశవాద రాజకీయాలు చేస్తున్నారు, తన అవసరాలు తీరటం లేదు కాబట్టే కేంద్రంపై దాడికి దిగుతున్నారని ఆయన విమర్శించారు. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వాన్ని తప్పుపడుతున్న చంద్రబాబు రేపు ఏపీ ప్రజలను తప్పుపడతారు, మీరు ఉద్యమించలేదు కాబట్టే ప్రత్యేక హోదా, ప్రత్యేక ప్యాకేజీ రాలేదనే ఆరోపణలు చేస్తారని రామచందర్‌రావు అన్నారు. చంద్రబాబు ప్రత్యేక విమానంలో నాగపూర్‌కు వెళ్లి జల వనరుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీతో పోలవరం ప్రాజెక్టు కాంట్రాక్టర్ల రేటు గురించి మాట్లాడటం ఏమిటని నిలదీశారు. పోలవరం నిర్మాణం గురించి చర్చించాలి కదా? అని ఆయన అన్నారు. పోలవరం ప్రాజెక్టుకోసం తెలంగాణలోని ఏడు మండలాలను ఏపీలో కలిపేందుకు ప్రధాని మోడీ మెడలు వంచానని చంద్రబాబు చెప్పుకుంటారు.. ఇదే నిజమైతే ప్రత్యేక ప్యాకేజీ సాధించేందుకు మరోసారి మోడీ మెడలు వంచగలరా? అని సవాల్ చేశారు. ప్యాకేజీ, ప్రత్యేక రైల్వే జోన్ తదితర హామీల సాధనకు కేంద్ర ప్రభుత్వంపై ఎందుకు వత్తిడి తీసుకురావటం లేదు? పోలవరం వాటాల గురించి అడుగుతారని భయపడుతున్నారా? అని రామచందర్ రావు ప్రశ్నించారు. అమరావతిలో వందలు, వేల ఎకరాల భూమిని పప్పుబెల్లాల మాదిరి పంచి పెట్టటం గురించి కేంద్రం ప్రశ్నిస్తుందని భయపడుతున్నారా? అని ప్రశ్నించారు. చంద్రబాబు వ్యవహరిస్తున్న తీరు ఆంధ్రప్రదేశ్‌కు శాపంగా మారిందని దుయ్యబట్టారు. విభజన చట్టం మూలంగా ఏపీకి ఇచ్చిన పథకాలు, ప్రత్యేక ప్యాకేజీ, రైల్వే జోన్, ఇతర ప్రాజెక్టులకు సంబంధించిన నిధులను రానున్న బడ్జెట్‌లో పొందుపరిచేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలి, లేకుంటే బాబును చరిత్ర క్షమించదని రామచందర్ రావు స్పష్టం చేశారు. మీరు ఇకనైనా మీ కుటుంబ ప్రయోజనాలు, హెరిటేజ్ ప్రయోజనాలను పక్కన పెట్టి రాష్ట్ర ప్రయోజనాల సాధనకు, విభజన చట్టం హామీల అమలుకు కృషి చేయాలని ఆయన బాబుకు హితవు చెప్పారు. ఇది విజ్ఞప్తితో కూడిన హెచ్చరిక అని రామచందర్‌రావు తెలిపారు.




ప్రపంచ ఆర్థిక ఫోరం సమావేశాల్లో పాల్గొనేందుకు సోమవారం దావోస్‌కు చేరిన మోదీకి జ్యూరిచ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో స్వాగతం చెబుతున్న దృశ్యం

దావోస్ సాక్షిగా విజయాల చిట్టా

మోదీ ప్రసంగంపై సర్వత్రా ఉత్కంఠ

జ్యూరిచ్, జనవరి 22: ఈ మూడేళ్ల కాలంలో భారత్ సాధించిన అభివృద్ధి విజయాలను ప్రపంచ ఆర్థిక ఫోరం వేదిక సాక్షిగా ప్రధాని నరేంద్ర మోదీ అంతర్జాతీయ నేతల కళ్లకు కట్టబోతున్నారు. జిఎస్టీ, పెద్దనోట్ల రద్దు సహా ఎన్నో విప్లవాత్మక నిర్ణయాలతో భారత ఆర్థిక ముఖ చిత్రాన్ని మార్చడంతోపాటు వృద్ధి, అభివృద్ధి, ఉపాధివంటి కీలకాంశాల విషయంలోనూ తాము సాధించిన విజయాలను మోదీ ప్రపంచ ఆర్థిక ఫోరం వేదిక ఆవిష్కరించనున్నారు. మంగళవారం జరిగే ప్లీనరీలో ఆయన మాట్లాడతారు. ఈ శిఖరాగ్ర సదస్సులో భాగంగా స్వీడన్ ప్రధాని స్టీఫెన్ లాఫ్‌వెన్‌తో మోదీ ద్వైపాక్షిక సమావేశం జరుపుతారు. మంగళవారం ప్రపంచ ఆర్థిక ప్రముఖులతో మోదీ సమావేశమవుతారని విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలిపింది. 'సంక్లిష్ట ప్రపంచ వాతావరణంలో భాగస్వామ్య భవిష్యత్ సృజన' అన్న అంశంపై ప్రపంచ ఆర్థిక ఫోరం సమావేశం జరుగుతోంది. దావోస్ బయలుదేరే ముందు ఢిల్లీలో మాట్లాడిన మోదీ ఇటీవలి కాలంలో ప్రపంచ దేశాలతో భారత్ సంబంధాలు బహుముఖీయంగా విస్తరించాయన్నారు. కేవలం రాజకీయ, ఆర్థిక సంబంధాలే కాకుండా అన్ని దేశాలతోనూ భారత్ ప్రజాసంబంధాలనూ పెంపొందించుకుంది. దాదాపు 20ఏళ్ల తరువాత ప్రపంచ ఆర్థిక ఫోరం వార్షిక సదస్సులో పాల్గొననున్న తొలి ప్రధానిగా నరేంద్ర మోదీ ఏమి చెప్పబోతున్నారన్నది ప్రపంచ పారిశ్రామికవేత్తలు, ఆర్థికవేత్తల్లో ఎనలేని ఉత్కంఠ రేకెత్తిస్తోంది.

దాదాపు ప్రపంచ నేతలంతా కూడా భారత అభివృద్ధి విధానాల విషయంలో అనుసరించిన పద్ధతులను మోదీ ఆవిష్కరిస్తారని ఎదురు చూస్తున్నారు. ఈ నేపథ్యంలో రక్షితవాదం, దేశీయత వంటి అంశాలను ఎదుర్కొనే విషయంలో భారత్‌కు 'స్టేట్స్‌మన్' హోదా కల్పించాలన్న డిమాండ్లూ తెరపైకి వచ్చాయి.



ఢిల్లీ కంటోన్మెంట్‌లో సోమవారం ఎన్‌సీసీ రిపబ్లిక్ డే శిబిరాన్ని సందర్శించి, కేడెట్ల గౌరవ వందనం స్వీకరిస్తున్న రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్

ప్రతికూల పరిస్థితుల్లోనూ తలొగ్గం: రాజ్‌నాథ్ సింగ్

పాక్‌కు హోం మంత్రి హెచ్చరిక



బారాబంకి (యుపీ), జనవరి 22: అంతర్జాతీయ సరిహద్దు వెంబడి, వాస్తవాధీన రేఖ వద్ద భారతీయ పోస్టులపై పాక్ సైనికుల కాల్పులు కొనసాగుతున్న క్రమంలో హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్ దాయాది దేశానికి గట్టి హెచ్చరిక చేశారు. ఎలాంటి ప్రతికూల పరిస్థితులు ఎదురైనా భారత్ తలవంచే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. కుయుక్తులకు పాల్పడుతున్న వారికి దీటుగా జవాబు చెప్పేందుకు తాము సిద్ధమేనని ఆయన సోమవారం ఇక్కడ జరిగిన ఓ సభలో అన్నారు. పాక్‌ను ఉద్దేశించి ఆయన పరోక్షంగా ఈ వ్యాఖ్యలు చేశారు. భారత్ ఎంత మాత్రం బలహీన దేశం కాదని, విశ్వవేదికపై భారత్ ప్రతిష్ఠ ఇటీవలి కాలంలో మరింతగా ఇనుమడించిందని రాజ్‌నాథ్ వివరించారు. భారత్ తన ప్రత్యర్థులను తమ భూభాగంలోనే గాక, వారి భూభాగంపైకి దూసుకువెళ్లి మరీ ఎదురిస్తుందని కొద్ది రోజుల ముందు హెచ్చరించిన ఆయన ఇపుడు తన స్వరం పెంచారు. జమ్మూ కాశ్మీర్‌లోని సరిహద్దు గ్రామాలపై పాక్ సైనికులు మూడు రోజులుగా విరుచుకుపడి సాధారణ పౌరులను, జవాన్లను హతమార్చిన సంగతి తెలిసిందే. కాశ్మీర్‌లోని మూడు జిల్లాల్లో పాక్ బలగాలు జరిపిన దాడుల్లో 12 మంది మరణించగా, 60మంది గాయపడ్డారు. కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తూ పాక్ ఈ ఘాతుకాలకు పాల్పడుతోంది. శత్రువులకు తగిన గుణపాఠం చెప్పే దేశంగా ప్రపంచంలోనే భారత్ ప్రతిష్ఠ పెరిగిందని హోం మంత్రి అన్నారు. అరాచకాలకు పాల్పడే ఏ దేశాన్నీ భారత్ ఉపేక్షించందని పరోక్షంగా పాక్‌ను ఆయన హెచ్చరించారు. రాజ్‌నాథ్ తాను ప్రాతినిధ్యం వహిస్తున్న లక్నో నియోజకవర్గంలో మూడు రోజుల పర్యటన సందర్భంగా పలు కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు.

ఆ రెండు పిటిషన్లు మాకు పంపండి

జస్టిస్ లోయ కేసులో సుప్రీం ఆదేశాలు

న్యూఢిల్లీ, జనవరి 22: జస్టిస్ లోయ మృతికి సంబంధించి బాంబే హైకోర్టులో ఉన్న రెండు పిటిషన్లు సుప్రీం కోర్టుకు బదిలీ చేస్తూ ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా నేతృత్వంలోని ధర్మాసనం నిర్ణయించింది. లోయ మృతిపై కుటుంబ సభ్యులు పలు అనుమానాలు వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. దీనిపై దాఖలైన పిటిషన్‌ను సుప్రీం కోర్టు సోమవారం విచారించింది. లోయ మృతికి సంబంధించి అన్ని పత్రాలు వచ్చేవాయిదా ఫిబ్రవరి 2 నాటికి తమకు అందజేయాలని బెంచ్ ఆదేశించింది. బాంబే హైకోర్టు అలాగే నాగ్‌పూర్ బెంచ్‌లో చెరొక పిటిషన్ పెండింగ్‌లో ఉన్నాయి. 'పెండింగ్‌లో ఉన్న పిటిషన్లను తీవ్రంగా పరిగణిస్తున్నాం' అంటూ జస్టిస్ ఏఎం ఖన్విల్కర్, జస్టిస్ డివై చంద్రచూడ్‌తో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. అలాగే లోయ అనుమానాస్పద మృతికి సంబంధించిన ఏ కేసూ దేశంలోని ఏ న్యాయస్థానంలో విచారించ వద్దని సుప్రీం ఆదేశించింది.

ఆసియాన్ దేశాధినేతల రాకతో 'యాక్ట్ ఈస్ట్'కు సమగ్ర రూపం

రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడి

న్యూఢిల్లీ, జనవరి 22: ఈ నెల 26న ఇక్కడ జరిగే గణతంత్ర దినోత్సవ వేడుకలకు పదిమంది 'ఆసియాన్' దేశాధినేతలు హాజరవుతున్నందున భారత్ సంకల్పించిన 'యాక్ట్ ఈస్ట్ విధానాని'కి సమగ్ర రూపం వస్తుందని రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. ఢిల్లీ కంటోన్మెంట్‌లో ఎన్‌సిసి రిపబ్లిక్ డే శిబిరాన్ని సోమవారం సందర్శించిన సందర్భంగా ఆమె విలేఖరులతో మాట్లాడారు. 'యాక్ట్ ఈస్ట్ విధానం' సమగ్ర రూపు దాల్చాలన్నదే ప్రధాని నరేంద్ర మోదీ ఆశయమని ఆమె అన్నారు. ఆసియాన్ దేశాల అధినేతల పర్యటన సందర్భంగా 'యాక్ట్ ఈస్ట్'పై ఫలవంతమైన చర్చలు జరిగే అవకాశం ఉందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. దేశ సరిహద్దుల్లో కాల్పుల విరమణ ఒప్పందాన్ని పాక్ ఉల్లంఘించడంపై విలేఖరులు ప్రశ్నించగా- 'ఎన్‌సిసి శిబిరం, రిపబ్లిక్ డే వేడుకలపై ఇపుడు దృష్టి పెడదాం' అని ఆమె ముక్తసరిగా అన్నారు. అంతకుముందు ఆమె ఎన్‌సిసి కేడెట్లకు 'రక్షణ మంత్రి పతకం'తో పాటు ప్రశంసాపత్రాలను అందజేశారు. రక్షణ మంత్రి పతకాన్ని 1989లో ప్రవేశపెట్టారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఎన్‌సిసి కేడెట్ ప్రియకు ఈ గౌరవం దక్కింది. ఎన్‌సిసి కేడెట్లు క్రమశిక్షణతో శిబిరంలో పాల్గొన్నారని ఆమె ప్రశంసించారు. ప్రకృతి వైపరీత్యాల్లో సహాయ కార్యక్రమాలు, స్వచ్ఛభారత్, ప్రభుత్వ సంక్షేమ పథకాల్లోనూ కేడెట్లు భాగస్వామ్యం కావడం హర్షణీయమన్నారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 13 లక్షల మంది ఎన్‌సిసిలో కేడెట్లుగా ఉన్నారని, 2022 నాటికి ఈ సంఖ్యను 15 లక్షలకు పెంచుతామని మంత్రి తెలిపారు. ఈ ఏడాది రిపబ్లిక్ వేడుకల్లో 703 మంది బాలికలు సహా 2,070 మంది ఎన్‌సిసి కేడెట్లు పాల్గొంటున్నారు. కేడెట్ల శిక్షణ శిబిరం ఈ నెల 28న జరిగే ర్యాలీతో ముగుస్తుంది.

వణుకుతున్న ఢిల్లీ

మూడు డెంగ్యూ కేసులు నమోదు

న్యూఢిల్లీ, జనవరి 22: ఏడాది ఆరంభంలోనే దేశ రాజధాని ఢిల్లీని డెంగ్యూ వణికిస్తోంది. వారం వ్యవధిలో ఇప్పటికే మూడు డెంగ్యూ కేసులు నమోదయ్యాయి. డెంగ్యూలాంటి వెక్టర్-బోర్న్ డిసీజెస్ సాధారణంగా జూలై రెండోవారం నుంచి నవంబర్ చివరి మధ్య నమోదవుతుంటాయి. ఒక్కోసారి డిసెంబర్ వరకూ కూడా ఇలాంటి పరిస్థితులు కనిపిస్తూ ఉండొచ్చు. 'జనవరి 20 వరకూ మూడు డెంగ్యూ కేసులు నమోదయ్యాయి. అయితే, మలేరియా, చికెన్ గున్యా కేసులో నమోదైన దాఖలాలు లేవు' అని ఢిల్లీ మున్సిపల్ వైద్యాధికారులు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. నిజానికి జనవరి 13 వరకూ ఎలాంటి కేసులు నమోదు కాలేదని, వారం వ్యవధిలోనే ముగ్గురు డెంగ్యూ బారిన పడినట్టు వైద్యాధికారులు పేర్కొన్నారు. దక్షిణ ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ అధికారుల లెక్కల ప్రకారం గత ఏడాది ఢిల్లీలో 9,271 మంది డెంగ్యూ బారిన పడ్డారు. ఈ ప్రాణాంతక వ్యాధికి పదిమంది ప్రాణాలు కోల్పోతే, వారిలో ఐదుగురు ఢిల్లీయేతరవాసులు. మున్సిపల్ అధికారుల లెక్కల ప్రకారం నలుగురే చనిపోయినట్టు గుర్తించినా, ప్రయివేట్ ఆస్పత్రుల్లో అనేక మరణాలు డెంగ్యూ కారణంగానే అని నమోదయ్యాయి. అన్నీ డెంగ్యూ మరణాలే కాకున్నా, దోమనుంచి వ్యాప్తిచెందే చికెన్ గున్యా, మలేరియా వ్యాధులవల్లా ఈ మరణాలు చోటుచేసుకున్నట్టు తెలుస్తోంది.

సరిహద్దుల్లో దినదిన గండం!

- మోర్టార్ కాల్పులతో భీతిల్లుతున్న జనం
- కుటుంబ సభ్యులను కోల్పోతున్న వైనం

జమ్మూ, జనవరి 22: జమ్మూకాశ్మీర్ సరిహద్దులో నివసించేవారి పరిస్థితి దినదిన గండం.. నూరేళ్ల ఆయుష్షు అన్నట్టుగా మారిపోయింది. బాంబుల మోతలతో సరిహద్దులో అనిశ్చిత వాతావరణం నెలకొంది. కాల్పులు, ఎదురు కాల్పుల ఘటనలో జనం ప్రమాదపుటంచున బితుకు బితుకు మంటూ కాలం గడుపుతున్నారు. ఎవరెప్పుడు విరుచుకుపడతారో అన్న భయం మధ్యే రోజులు గడుపుతున్నారు. అంతర్జాతీయ సరిహద్దులో జరిగిన ఓ కాల్పుల సంఘటన ఓ కుటుంబం కలలను ఛిద్రం చేసింది. ఎవర్ని కదిపినా కన్నీటి గాథలే. అంతర్జాతీయ సరిహద్దులో ఇటీవల చోటుచేసుకున్న కాల్పుల ఘటన ఓ కుటుంబానికి తీరని విషాదం మిగిల్చింది. సరిహద్దులోని సియాఖుర్ద్ గ్రామంలో మోర్టల్ దాడిలో దంపతులు గాయపడ్డారు. కాల్పుల దాటికి భార్య బఛానోదేవి చనిపోగా, భర్త జీత్‌రాజ్‌కు ప్రాణపాయం తప్పింది. పాక్ కాల్పుల్లో జీత్ రాజ్ కుమారుడూ గాయపడ్డాడు. పొలాల్లో పనిచేసుకుంటుండా అకస్మాత్తుగా మోర్టల్ పడిందని రాజ్ చెప్పాడు. తమ కళ్లముందే భార్య కుప్పకూలి చనిపోయిందని కన్నీళ్లపర్యంతమయ్యాడు. తనను, తన కొడుకుని హుటాహుటిన ఆసుపత్రికి తీసుకెళ్లారని, తన అర్ధాంగి మాత్రం చూస్తుండగానే ప్రాణాలు విడిచిందని రోదిస్తూ చెప్పాడు. తన గాయాలు మానిపోతున్నాయని గానీ తన హృదయానికి అయిన గాయం తొలిచేస్తోందని జీత్ రాజ్ ఆవేదన చెందాడు. సరిహద్దుల్లో నివసిస్తున్న వారి కుటుంబాల్లో పాక్ తుపాకీలు తీరని వేదన మిగులుస్తున్నాయి. సరిహద్దుల్లో రోజూ ఇలాంటి యుద్ధ వాతావరణమే ఉంటోందని జీత్ రాజ్ వాపోయారు. జమ్మూజిల్లాలో కంఛక్ బెల్ట్‌లో ఆదివారం పాక్ రేంజర్ల కాల్పుల్లో ఒక పౌరుడు మృతి చెందాడు. ఇద్దరు గాయపడ్డారు. గత గురువారం నుంచి కాల్పుల్లో కనీసం 12 మంది చనిపోగా 60 మందికిపైగా గాయపడ్డారు. అంతర్జాతీయ సరిహద్దు, ఎల్ఓసి వద్ద అనిశ్చిత పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో మరో మూడు రోజులు విద్యా సంస్థలు తెరుచుకునే అవకాశం లేదు.



జమ్మూకు సమీపంలోని కానాచెక్ గ్రామంలో పాకిస్తాన్ జరిపిన కాల్పుల్లో దెబ్బతిన్న గోడను చూపుతున్న ఓ మహిళ



రిపబ్లిక్ డే పరేడ్ ప్రెస్ ప్రివ్యూ సందర్భంగా ఢిల్లీలో సోమవారం నిర్వహించిన కళాకృతులు చూపరులను ఆకట్టుకున్నాయి. ఆసియాన్ దేశాలకు చెందిన కళాకారులు రూపొందించిన శకటంతోపాటు మహారాష్ట్ర, గుజరాత్ తదితర రాష్ట్రాలకు చెందిన శకటాలు ఈ ప్రదర్శనలో పాలుపంచుకున్నాయి.

జిల్లాల అభివృద్ధి పథకానికి మూడు రాష్ట్రాల విముఖత

న్యూఢిల్లీ, జనవరి 22: దేశవ్యాప్తంగా 115 వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం చేపట్టిన పథకంలో చేరేందుకు మూడు రాష్ట్ర ప్రభుత్వాలు విముఖత చూపుతున్నాయి. ఈ పథకం అమలు తీరును పర్యవేక్షించేందుకు కేంద్రం తన అధికారులను నియమించడమే ఇందుకు ఇందుకు కారణం. కేంద్రం ఎంపిక చేసిన జిల్లాల్లో కేరళ, పశ్చిమ బెంగాల్, ఒడిశాకు చెందిన 14 జిల్లాలు ఉన్నాయి. కేరళలో సిపిఎం, పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్, ఒడిశాలో బిజూ జనతాదళ్ పార్టీల ఆధ్వర్యంలో ప్రభుత్వాలు నడుస్తున్నాయి. 115 జిల్లాలను శరవేగంగా అభివృద్ధి చేసేందుకు కేంద్రం నిర్దేశించిన పథకంపై ఈ మూడు రాష్ట్ర ప్రభుత్వాలు అయిష్టతను వ్యక్తం చేస్తున్నాయి. కాగా, రాజకీయ కారణాలతో మాత్రమే కేరళ, బెంగాల్, ఒడిశా ప్రభుత్వాలు జిల్లాల అభివృద్ధి పథకంపై విముఖతను ప్రదర్శిస్తున్నాయని కేంద్ర మంత్రి రామ్‌కృపాల్ యాదవ్ ఆరోపించారు. ఈ తరహా ధోరణి వల్ల అభివృద్ధికి విఘాతం కలుగుతుందన్నారు. విద్య, వైద్యం, పేదరికం, సామాజిక, ఆర్థిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని 115 వెనుకబడిన జిల్లాలను ఎంపిక చేశామని ఆయన గుర్తు చేశారు. తీవ్రవాదం, వేర్పాటువాదం ప్రభావంతో వెనుకబడిన 35 జిల్లాలను అభివృద్ధి చేయాలని హోం మంత్రిత్వ శాఖ సిఫారసు చేసిందన్నారు. కేంద్రం ఎంపిక చేసిన జిల్లాల్లో కొన్నింటిని ప్రధాని నరేంద్ర మోదీ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా వచ్చే ఏప్రిల్ 14న సందర్శిస్తారని అధికారులు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో ఈ జిల్లాలను అభివృద్ధి చేస్తారు. 2022 నాటికి ఈ జిల్లాలను అభివృద్ధి చేసేందుకు భారీగా నిధులు ఖర్చు చేస్తామని, జిల్లా కలెక్టర్లు ఇందుకు ప్రత్యేక శ్రద్ధ వహించాలని మోదీ ఇదివరకే విజ్ఞప్తి చేశారని రామ్ కృపాల్ యాదవ్ తెలిపారు. ప్రతి మూడు జిల్లాలకు ఒక అధికారిని కేంద్రం నియమించింది. కేంద్రం, రాష్ట్రాల మధ్య సంబంధాలను మెరుగుపరచే విధంగా ప్రధాని చర్యలు తీసుకుంటున్నారని, అయితే రాజకీయ కారణాలతో ఇలాంటి పథకాలపై కొన్ని రాష్ట్రాలు విముఖత చూపడం సరికాదన్నారు. వెనుకబడిన జిల్లాలకు దండిగా నిధులిస్తామంటే అయిష్టత తెలపడం రాజకీయం కాక మరేమిటని ఆయన ప్రశ్నించారు.

ఎర్రకోట వద్ద మార్చిలో మహాయజ్ఞం

బీజేపీ ఎంపీ మహేష్ గిరి వెల్లడి

న్యూఢిల్లీ, జనవరి 22: దేశ రాజధాని ఢిల్లీలోని ఎర్రకోట వెలుపల మైదానంలో వారం రోజుల పాటు వేదిక్ యజ్ఞం జరగబోతోంది. దేశాన్ని అస్థిరపరచే శక్తులను నుంచి భారత్‌ను రక్షించాలన్న ఉద్దేశంతో ఈ మహాయజ్ఞం తలపెట్టినట్టు బీజేపీ ఎంపీ మహేష్ గిరి సోమవారం ఇక్కడ వెల్లడించారు. మార్చి 18 నుంచి 25 వరకూ దీన్ని నిర్వహించనున్నట్టు చెప్పారు. రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, ప్రధాని నరేంద్ర మోదీ సహా పలువురు రాజకీయ ప్రముఖులను ఈ కార్యక్రమానికి ఆహ్వానించినట్టు ఆయన స్పష్టం చేశారు. భారీగా ఏర్పాటవుతున్న ఈ యజ్ఞానికి 1,100 మంది సాధువులు పాల్గొంటారు. ఢిల్లీకి చెందిన పలువురు వ్యాపారవేత్తలు వేదిక్ యజ్ఞానికి విరాళాలు అందజేస్తున్నారని ఎంపీ పేర్కొన్నారు. కార్యక్రమం ఏర్పాటు దగ్గర నుంచి ఆహ్వానాల దగ్గర నుంచి ఎక్కడా పొరపాట్లు దొర్లకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్టు ఆయన తెలిపారు. మార్చిలో జరిగే మహాయజ్ఞానికి సంబంధించి కార్యక్రమాన్ని ప్రకటించారు. డోక్లామ్ నుంచి, అలాగే పూంచ్‌లోని ఎల్‌ఓసీ దగ్గర నుంచి మట్టి, నీరును యజ్ఞానికి తీసుకొస్తారు. అలాగే దేశవ్యాప్తంగా రథయాత్రలు నిర్వహించి ఆవునెయ్యిని రాజధానికి తెస్తారని, ఇక్కడకు వచ్చే ప్రతి ఒక్కరూ మనిషికి ఒక్క స్పూను నెయ్యి తీసుకురావాలని పిలుపునిస్తున్నట్టు బీజేపీ ఎంపీ చెప్పారు.

సీఎం, రాజ్‌నాథ్ రావాలి

అమరజవాన్ బంధువుల డిమాండ్

ఛందౌలీ (యూపీ), జనవరి 22: జమ్మూకాశ్మీర్‌లోని పూంచ్ కాల్పుల్లో మృతి చెందిన జవాన్ చందన్ కుమార్ రాయ్ అంత్యక్రియలకు కేంద్ర హోమ్‌మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ హాజరుకావాలంటూ కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. రాయ్‌కు వచ్చేనెలలో పెళ్లి నిశ్చయించారు. అతడు వచ్చేనెలలో స్వగ్రామం రావల్సి ఉండగా పాక్ దళాల కాల్పుల్లో మృతి చెందాడు. మృతదేహాన్ని ఛందౌలీ జిల్లా మదేసార్-మరుఫ్‌పూర్ గ్రామానికి తరలించారు. అంత్యక్రియలు జరిగే సమయంలో కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. హోమ్‌మంత్రి రాజ్‌నాథ్, సీఎం ఆదిత్యనాథ్ రావల్సిందేనని ధర్నాకు దిగారు. రాజ్‌నాథ్ సొంత జిల్లా ఛందౌలీ కాగా ఆదిత్యనాథ్ పూర్వికులు ఈ జిల్లాకు చెందినవారే. ఈ జిల్లాకే చెందిన ఇద్దరు నేతలు అమర జవాన్ అంత్యక్రియలకు రావాలని వారు పట్టుబట్టారు. యూపీ మంత్రులు అనిల్ రాజ్‌భార్, జైప్రకాశ్ నిషాద్, జిల్లా మెజిస్ట్రేట్ హేమంత్ కుమార్, ఎస్పీ సంతోష్ సింగ్ జవాన్ మృతదేహానికి నివాళులర్పించారు. స్థానిక ఎమ్మెల్యేలు, పలువురు ఉన్నతాధికారులు రాయ్‌మృతికి సంతాపం తెలిపారు.





ఢిల్లీలో సోమవారం జరిగిన ఆసియాన్-ఇండియా బిజినెస్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ మీట్ సందర్భంగా ఆయా దేశాల ప్రతినిధులతో కేంద్ర వాణిజ్య పరిశ్రమల శాఖ మంత్రి సురేష్ ప్రభు

మార్కెట్లలో కొనుగోళ్ల జోరు

- సరికొత్త గరిష్ఠ స్థాయిలకు సూచీలు
- 286 పాయింట్లు పెరిగిన సెనె్సక్స్
- 71 పాయింట్లు పుంజుకున్న నిఫ్టీ
- మదుపరులను ఆకర్షించిన టీసీఎస్, రిలయన్స్ ఇండస్ట్రీస్, ఓఎన్‌జీసీ షేర్లు

ముంబయి, జనవరి 22: దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా నాలుగో సెషన్ లాభాల్లో ముగిశాయి. విదేశీ నిధులు పెద్ద మొత్తంలో స్టాక్ మార్కెట్‌లోకి తరలి రావడంతో పాటు దేశీయ మదుపరులు ఎడతెరిపి లేకుండా కొనుగోళ్లకు పూనుకోవడంతో మార్కెట్ కీలక సూచీలు సోమవారం సరికొత్త రికార్డు గరిష్ఠ స్థాయిల వద్ద ముగిశాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్, ఓఎన్‌జీసీ, టీసీఎస్ వంటి బ్లూచిప్ కంపెనీల షేర్లు ఎక్కువగా మదుపరులను ఆకర్షించాయి. బొంబాయి స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్‌ఈ) సెనె్సక్స్ 286.43 పాయింట్లు పెరిగి, 35,798.01 పాయింట్ల వద్ద ముగియగా, నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్‌ఎస్‌ఈ) నిఫ్టీ 10,966.20 పాయింట్ల వద్ద స్థిరపడింది. ఈ రెండు కీలక సూచీలు కూడా సోమవారం సరికొత్త జీవనకాల గరిష్ఠ స్థాయిల వద్ద ముగిశాయి. లీడింగ్ కంపెనీలు తృతీయ త్రైమాసికంలో అంచనాలకు మించిన లాభాలు ఆర్జించడంతో పాటు ఇటీవల జరిగిన వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ) మండలి సమావేశంలో కొన్ని వస్తువులు, సేవలపై పన్ను రేట్లను తగ్గించడం వల్ల స్టాక్ మార్కెట్లలో ఉత్సాహపూరితమైన వాతావరణం నెలకొని కీలక సూచీలు రికార్డు స్థాయిలకు ఎగబాకాయి. సోమవారం ఉదయం పటిష్ఠమైన స్థాయి వద్ద ప్రారంభమైన సెనె్సక్స్ నిరాఘాటంగా పైకి ఎగబాకుతూ ఇంట్రా-డేలో ఆల్‌టైమ్ హై 35,827.70 పాయింట్లను తాకింది. అయితే, తరువాత మదుపరులు లాభాల స్వీకరణకు పూనుకోవడంతో క్రితం సెషన్ ముగింపుతో పోలిస్తే 286.43 పాయింట్లు (0.81 శాతం) పెరుగుదలతో 35,798.01 పాయింట్ల వద్ద



TOP GAINERS	%	TOP LOSERS	%
TCS	5.36	Wipro	-2.33
Reliance	4.50	Bharti Airtel	-1.56
Axis Bank	3.52	Asian Paints	-1.40
ONGC	3.28	HDFC	-1.38
Yes Bank	2.00	SBI	-0.91



TOP GAINERS	%	TOP LOSERS	%
TCS	5.31	HPCL	-3.46
Reliance	4.32	Idea Cellular	-2.74
ONGC	3.61	GAIL	-2.42
Axis Bank	3.61	Wipro	-2.25
Tech Mahi	3.00	BPCL	-1.71

PTI GRAPHICS

ముగిసింది. శుక్రవారం నాటి ముగింపు రికార్డు 35,511.58 పాయింట్లను అధిగమించింది. క్రితం మూడు సెషన్లలో కలిపి ఈ సూచీ 740.53 పాయింట్లు పెరిగింది. నిఫ్టీ కూడా సోమవారం ఇంట్రా-డేలో రికార్డు గరిష్ఠ స్థాయి 10,975.10 పాయింట్లను తాకింది. తరువాత స్వల్పంగా తగ్గి క్రితం సెషన్ ముగింపుతో పోలిస్తే 71.50 పాయింట్ల (0.66 శాతం) పెరుగుదలతో 10,966.20 పాయింట్ల వద్ద స్థిరపడింది. శుక్రవారం నాటి గరిష్ఠ ముగింపు రికార్డు అయిన 10,894.70 పాయింట్లను అధిగమించింది. ఇదిలా ఉండగా, క్రితం సెషన్‌లో ఫారిన్ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐలు) నికరంగా రూ. 988.25 కోట్ల విలువయిన షేర్లను, దేశీయ సంస్థాగత మదుపరులు (డీఐఐలు) రూ. 209.86 కోట్ల విలువయిన షేర్లను కొనుగోలు చేశారు.

సోమవారం సెనె్సక్స్ ప్యాక్‌లోని కంపెనీలలో టీసీఎస్ అత్యధికంగా 5.36 శాతం లాభపడింది. ఈ కంపెనీ షేర్ ధర సరికొత్త గరిష్ఠ స్థాయి రూ. 3,113.15కు చేరింది. తరువాత స్థానాన్ని రిలయన్స్ ఇండస్ట్రీస్ ఆక్రమించింది. ఈ కంపెనీ షేర్ ధర 4.50 శాతం పెరుగుదలతో, రూ. 971.20కు చేరింది. హెచ్‌పీసీఎల్‌లోని ప్రభుత్వ వాటా 51.11 శాతాన్ని కొనుగోలు చేస్తున్న ఓఎన్‌జీసీ షేర్ ధర 3.28 శాతం పెరిగింది. మూడో త్రైమాసికంలో నికర లాభాన్ని 25 శాతం పెంచుకోవడంతో పాటు నిరర్థక ఆస్తుల (ఎన్‌పీఏల)ను తగ్గించుకున్న యాక్సిస్ బ్యాంక్ షేర్ ధర 3.52 శాతం పుంజుకుంది.

లాభపడిన ఇతర కంపెనీలలో యెస్ బ్యాంక్, బజాజ్ ఆటో, ఎల్‌అండ్‌టీ, కోటక్ బ్యాంక్, అదాని పోర్ట్స్, టాటా మోటర్స్, సన్ ఫార్మా, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఇన్ఫోసిస్, హీరో మోటోకార్ప్, డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరి ఉన్నాయి. వీటి షేర్ల విలువ 3.52 శాతం వరకు పెరిగింది. మూడో త్రైమాసికంలో నికర లాభాలు 8.4 శాతం పడిపోయిన విప్రో షేర్ విలువ 2.33 శాతం తగ్గింది. మదుపరులు లాభాల స్వీకరణకు పూనుకోవడంతో భారతి ఎయిర్‌టెల్, ఆసియన్ పెయింట్, హెచ్‌డీఎఫ్‌సీ లిమిటెడ్, ఎస్‌బీఐ, హింద్ యూనిలీవర్, ఐసీఐసీఐ బ్యాంక్ షేర్ల ధరలు దిగజారాయి.

హెచ్‌పీసీఎల్ చేతికి ఎంఆర్‌పీఎల్

17శాతం వాటా కొనుగోలుకు కసరత్తు ▪ నగదు, షేర్ల మార్పిడి ద్వారా స్వాధీనం

న్యూఢిల్లీ, జనవరి 22: ప్రభుత్వ రంగ చమురు శుద్ధి కంపెనీ అయిన హిందుస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పీసీఎల్) నగదు, షేర్ల మార్పిడి ఒప్పందం ద్వారా మంగళూరు రిఫైనరీ అండ్ పెట్రోకెమికల్స్ లిమిటెడ్ (ఎంఆర్‌పీఎల్)ను స్వాధీనం చేసుకునే అవకాశాలు ఉన్నాయి. ఈ ప్రక్రియ పూర్తయితే హెచ్‌పీసీఎల్ దేశంలో మూడో అతిపెద్ద చమురు శుద్ధి కంపెనీగా అవతరిస్తుంది. దేశంలోని అతిపెద్ద చమురు, సహజ వాయువు ఉత్పత్తిదారు అయిన ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్ (ఓఎన్‌జీసీ) గత వారం రూ. 36,915 కోట్లకు హెచ్‌పీసీఎల్‌ను



స్వాధీనం చేసుకుంటున్నట్టు ప్రకటించింది. ఈ స్వాధీనం అనంతరం ఓఎన్‌జీసీకి రెండు చమురు శుద్ధి అనుబంధ సంస్థలు- హెచ్‌పీసీఎల్, ఎంఆర్‌పీఎల్ ఉంటాయి. 'హెచ్‌పీసీఎల్‌లోకి ఎంఆర్‌పీఎల్ వస్తే మేము ఎంతో సమన్వయాన్ని, సహకారాన్ని పెంపొందించుకోగలం' అని హెచ్‌పీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ముకేశ్ కుమార్ సూరన పేర్కొన్నారు. హెచ్‌పీసీఎల్‌ను స్వతంత్ర లిస్టెడ్ కంపెనీగా నిర్వహించడానికి ఓఎన్‌జీసీ ప్రణాళిక రూపొందించింది. 'మాకు ఎంఆర్‌పీఎల్ కొత్త కంపెనీ కాదు. ఏవీ బిర్లా గ్రూపులోని జాయింట్ వెంచర్‌ను 2003లో ఓఎన్‌జీసీ స్వాధీనం చేసుకోవడానికి ముందు ఇది హెచ్‌పీసీఎల్‌కు చెందిన కంపెనీయే. మేము ఎంఆర్‌పీఎల్‌లోని దాదాపు 17 శాతం వాటాను స్వాధీనం చేసుకుంటాము. అందువల్ల ఆ కంపెనీ గురించి మాకు మంచి అవగాహన ఉంటుంది' అని ముకేశ్ కుమార్ ఒక వార్తా సంస్థతో మాట్లాడుతూ అన్నారు. 'ఓఎన్‌జీసీ ప్రయోజనాల రీత్యా ఈ విలీనం చాలా మంచి అంశం' అని పేర్కొన్నారు.

వీడుతున్న విశ్వసనీయత

ఇండెక్స్‌లో దిగజారిన భారత్ రేటింగ్ ▪ ప్రజానమ్మకం చూరగొన్న చైనా

దావోస్, జనవరి 22: భారత్ పట్ల విశ్వసనీయత సన్నగిల్లుతోందా? అన్న ప్రశ్నకు సర్వేలు అవుననే సమాధానం ఇస్తున్నాయి. ప్రజల విశ్వసనీయత చూరగొన్న దేశాల జాబితాలో ప్రత్యేకస్థానంలో ఉండే భారత్, గత ఏడాదితో పోలిస్తే మాత్రం కిందకు దిగజారిందని తాజా సర్వే స్పష్టం చేస్తోంది. ప్రభుత్వం, వ్యాపారం, ఎన్జీవో, మీడియా రంగాలకు సంబంధించి భారత్‌లో ప్రజా విశ్వసనీయత గత ఏడాదికంటే దారుణంగా తగ్గిందని ఈడెల్‌మన్ ట్రస్ట్ బారోమీటర్ సర్వే వెల్లడించింది. వరల్డ్ ఎకనామిక్ ఫోరం వార్షిక సదస్సు ప్రారంభమవుతున్న తరుణంలో ఈ నివేదిక వెల్లడవ్వడం ఇబ్బందికర విషయమే. విశ్వసనీయతకు సంబంధించి 28 దేశాల్లో నిర్వహించిన సర్వేలో 20 దేశాలు కనీస అర్హతలేని ప్రాంతాల జాబితాలో ఉండిపోయాయి. ఒక్క చైనా మాత్రమే విశ్వసనీయతా ప్రమాణం గత ఏడాదికంటే పెంచుకోగలిగిందని సర్వే స్పష్టం చేసింది. ప్రజా విశ్వసనీయతను చూరగొన్న దేశాల జాబితాలో చైనా టాప్ ప్లేస్‌లో ఉందని పేర్కొంది. విషయ పరిజ్ఞానం కలిగిన ప్రజలు, సాధారణ ప్రజలను ప్రమాణంగా తీసుకుని నిర్వహించిన సర్వేలో చైనాకు నూటికి 83, 74 మార్కులు లభించాయి. ఈ రెండు క్యాటగిరీల్లోనూ భారత్‌కు 77, 68 మార్కులు సాధించి తృతీయ స్థానంలో నిలిస్తే, ఇండోనేసియా ద్వితీయ స్థానం సంపాదించుకుంది. 28 దేశాల్లో 33వేల మందినుంచి గత అక్టోబర్ 28నుంచి నవంబర్ 20 మధ్య విశ్వసనీయతపై అభిప్రాయాలు సేకరించినట్టు సర్వే పేర్కొంది. 'విశ్వసనీయతపై చైనా సాధించిన స్కోరు భారత్ సహా యుఏఇ, ఇండోనేసియా, సింగపూర్ దేశాలకు దగ్గరగానే ఉంది. ఇదిలావుంటే, కొన్ని పశ్చిమ దేశాలైతే అసలు విశ్వసనీయత పరిగణన జాబితాలోకే రాలేదు' అని సర్వే పేర్కొంది. విశ్వసనీయతలో గత ఏడాది యుఎస్ టాప్‌లో వుంటే, అప్పటి పరిస్థితితో పోల్చిచూస్తే విశ్వసనీయత తగ్గిన ఆరు దేశాల జాబితాలో భారత్ ఉన్నట్టు సర్వే పేర్కొంది. 'గత ఏడాదితో పోలిస్తే యుఎస్‌పట్ల విశ్వసనీయత తగ్గడానికి కారణం ప్రభుత్వం పట్ల ప్రజలకున్న నమ్మకం సన్నగిల్లడమే' అని సర్వే స్పష్టం చేస్తోంది. వ్యాపారం, మీడియా, ఎన్జీవో విభాగాల పట్లా యుఎస్‌లో గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది నమ్మకం సన్నగిల్లినట్టు సర్వే పేర్కొంది. విశ్వసనీయత తగ్గిన ఆరు దేశాల జాబితాను పరిశీలిస్తే అమెరికా (37 పాయింట్లు), ఇటలీ (21), బ్రెజిల్ (-17), దక్షిణ అమెరికా (-17), భారత్ (-13), కొలంబియా (-13)లు విశ్వసనీయత పాయింట్లను నష్టపోయాయి. ప్రపంచం మొత్తంమ్మీద మీడియాకే అత్యంత కనిష్ట విశ్వసనీయత పాయింట్లు లభించినట్టు సర్వే ప్రత్యేకంగా పేర్కొంది. 'సెర్చ్ ఇంజన్లు, సోషల్ మీడియా కారణంగానే మీడియా పట్ల నమ్మకం సడలిపోడానికి కారణం' అని సర్వేలో స్పష్టం చేయడం గమనార్హం.

పెట్టుబడులకు కొరియా ఆసక్తి

తెలంగాణ ప్రభుత్వ సలహాదారు జి. వివేక్

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 22: మన దేశంలో పెట్టుబడులు పెట్టేందుకు కొరియాకు చెందిన అనేకమంది పారిశ్రామికవేత్తలు ఆసక్తిగా ఉన్నారని తెలంగాణ ప్రభుత్వ సలహాదారు జి. వివేక్ తెలిపారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఉన్న అనుకూల పరిస్థితుల గురించి కొరియాలో పారిశ్రామికవేత్తలకు వివరించినట్లు ఆయన చెప్పారు. పెట్టుబడులు పెట్టేవారికి రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన సౌకర్యాల గురించి వివరించినట్లు తెలిపారు. రాష్ట్రంలో కొరియా భాషా కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని రాష్ట్ర మంత్రి తారక రామారావు చెప్పారని తెలిపారు. తెలంగాణలో టెక్స్‌టైల్ రంగానికి మంచి మార్కెట్ ఉందన్నారు. హైదరాబాద్‌లో ఫ్యాషన్ సిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. టెక్స్‌టైల్ పార్కుల్లో తయారు చేసిన వాటిని ఫ్యాషన్ సిటీలో ప్రదర్శిస్తామన్నారు. క్లీన్ ఎనర్జీ, పౌల్ట్రీకి సంబంధించిన ఒప్పందాలు సుజుకి సంస్థతో చర్చలు జరుగుతున్నాయని ఆయన తెలిపారు. హ్యుందాయ్ కంపెనీ ప్రతినిధులతో కూడా మంత్రి కేటీఆర్ చర్చలు జరుపుతున్నారని వివేక్ చెప్పారు.

రూ.9.5లక్షల కోట్లు

మార్చి నాటికి పెరగనున్న బ్యాంకుల నిరర్థక ఆస్తులు

న్యూఢిల్లీ, జనవరి 22: భారత బ్యాంకింగ్ వ్యవస్థపై స్థూల నిరర్థక ఆస్తుల భారం మరింత పెరగనుంది. ఈ మార్చి చివరి నాటికి ఈ మొత్తం రూ.9.5 లక్షల కోట్లకు పెరగనున్నాయి. క్రితం ఆర్థిక సంవత్సరం మార్చి చివరి నాటికి రూ.8 లక్షల కోట్లున్న ఈ మొత్తం ఏడాది వ్యవధిలో భారీగా పెరుగుతున్నాయని ఒక నివేదిక వెల్లడించింది. నిరర్థక ఆస్తుల సమస్య పరిష్కారంలో ఆస్తుల పునర్వ్యవస్థీకరణ కంపెనీలు ముఖ్యమైన భాగస్వాములని, అందువల్ల ఎన్‌పీఏలు పెద్దమొత్తంలో పేరుకుపోవడం ఈ కంపెనీలకు అనేక అవకాశాలను అందిస్తోందని అసోచామ్-క్రిసిల్ అధ్యయనం పేర్కొంది.

థియేటర్లలో 'జనతా కర్ఫ్యూ' తప్పదు!

'పద్మావత్' విడుదలపై కర్ణిసేన హెచ్చరిక ▪ సినిమాను నిషేధించాలని యూపీ సీఎంకు వినతి

లక్నో, జనవరి 22: వివాదాస్పద హిందీ చలనచిత్రం 'పద్మావత్'ను ఉత్తరప్రదేశ్‌లో నిషేధించాలని కర్ణిసేన పోషకుడు లోకేంద్ర సింగ్ కల్వీ ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌ను ఇక్కడ సోమవారం కలిసిన సందర్భంగా విజ్ఞప్తి చేశారు. ఈ సినిమాను యుపీలో విడుదల చేస్తే థియేటర్లలో ప్రజలే 'జనతా కర్ఫ్యూ'ను అమలు చేస్తారని ఆయన ప్రకటించారు. సుమారు 20 నిమిషాల సేపు యోగితో చర్చించిన అనంతరం లోకేంద్రసింగ్ మీడియాతో మాట్లాడుతూ, 'పద్మావత్'కు సంబంధించి తాము 40 అభ్యంతరాలను లేవనెత్తామని తెలిపారు. అవాస్తవాలతో ఇలాంటి సినిమాలు తీసే బదులు మహారాణా ప్రతాప్, ఛత్రపతి శివాజీ వంటి వీరుల జీవితచరిత్రలను చలనచిత్రాలుగా తీయాలని ఆయన అన్నారు. 'పద్మావత్'ను నిషేధించాలని తాము ఇదివరకే ప్రధాని మోదీకి విజ్ఞప్తి చేశామని, ఆయన సానుకూలంగా స్పందిస్తారని తాము ఆశిస్తున్నట్లు లోకేంద్రసింగ్ చెప్పారు. సుప్రీం కోర్టు తీర్పును యుపి సీఎం అమలు చేయాల్సి ఉన్నప్పటికీ, వ్యక్తిగతంగా ఆయన తమ డిమాండ్‌ను సమర్థించారని తెలిపారు. పద్మావతి పక్షాన నిలవాలో, అల్లాఉద్దీన్ ఖిల్జీ పక్షాన నిలవాలో జనం తేల్చుకోవాలన్నారు. రామరావణుల్లో ఎవరు గొప్పవారో తెలిసిన ప్రజలు సరైన నిర్ణయం తీసుకుంటారన్నారు. హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా ఉన్నందున ఈ సినిమా ప్రదర్శనకు అనుమతి ఇవ్వరాదంటూ కర్ణిసేన కార్యకర్తలు లక్నో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. చారిత్రక వాస్తవాలకు వక్రభాష్యం చెప్పిన సినిమా కొన్ని సామాజిక వర్గాలకు వ్యతిరేకంగా ఉందని వారు ఫిర్యాదు చేశారు.



విలేఖరులతో మాట్లాడుతున్న లోకేంద్రసింగ్ కల్వీ

త్వరలో యువ సాధికార నిరుద్యోగ భృతి

- ప్రభుత్వం నుండి డ్రాఫ్ట్ గైడ్‌లైన్స్
- జిల్లాల్లో సలహాలు, సూచనల స్వీకరణ
- భృతి కల్పనకై అధికారుల కసరత్తు

ఆంధ్రభూమి బ్యూరో

కాకినాడ, జనవరి 22: ఏపీలో త్వరలో నిరుద్యోగులకు భృతి కల్పించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఇందుకు సంబంధించి మార్గదర్శకాలను జిల్లాల అధికారులకు ప్రభుత్వం ఇప్పటికే అందజేసింది. సంబంధిత అధికారులు జిల్లాల్లో యువత, విద్యావంతుల నుండి సలహా సూచనలను స్వీకరిస్తోంది. విద్యావంతుల అభిప్రాయాలు, సలహాలు, సూచనల మేరకు అవసరమైన మార్పులుచేసి భృతి కల్పనకు చట్టరూపం కల్పించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. 2014 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ మ్యానిఫెస్టోలో నిరుద్యోగ భృతి చెల్లిస్తామని ప్రకటించింది. నిరుద్యోగులకు నెలకు కనీసం రూ.2000 భృతి కల్పిస్తామని చెప్పింది. 2019 ఎన్నికల నాటికి నిరుద్యోగ భృతి అంశాన్ని పరిష్కరించడానికి గాను యువ సాధికార నిరుద్యోగ భృతి పథకాన్ని అమలుచేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ప్రభుత్వం ఆయా జిల్లాల అధికారులకు డ్రాఫ్ట్ గైడ్‌లైన్స్‌ను విడుదల చేసింది. వీటిని విశ్వ విద్యాలయాలు, కళాశాలల్లోని విద్యార్థులకు అందజేసేలా చర్యలు తీసుకున్నారు. ఈ పథకం కింద లబ్ధిపొందగోరు అభ్యర్థులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వారై ఉండి, సమీప ఉపాధి కల్పన కార్యాలయంలో పేరు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. భృతి పొందేందుకు ఇంటర్మీడియట్, ఐటిఐ ఉత్తీర్ణత కనీస విద్యార్హతగా ప్రకటించారు.

ఒక శాతం మంది వద్దే 73 శాతం సంపద!

భారత్‌లో విస్తరిస్తున్న ఆర్థిక అసమానతలు ▪ ఆక్స్‌ఫామ్ సర్వేలో వెల్లడి

దావోస్, జనవరి 22: సమసమాజం స్థాపనకు ఘనమైన పథకాలను అమలు చేస్తున్నామని పాలకులు ఎంతగా గొప్పలు చెబుతున్నప్పటికీ భారత్‌లో ఆర్థిక అసమానతల తీరు ఆందోళనకరంగానే ఉంది. దేశంలో సంపద ఎక్కువ భాగం అత్యంత ధనవంతులైన కొద్ది మంది వద్దే కేంద్రీకృతమై ఉందని 'ఆక్స్‌ఫామ్' తాజా సర్వేలో తేటతెల్లమైంది. గత ఏడాది భారత్‌లో జరిగిన సంపద సృష్టిలో 73 శాతం కేవలం ఒక శాతం మంది వద్ద ఉందని ఆ సర్వేలో తేలింది. ప్రపంచం లోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంలో ఆర్థిక అసమానతలు అనూహ్యంగా పెరిగిపోతున్నాయనడానికి సర్వేలో వెలుగు చూసిన గణాంకాలే ప్రబల నిదర్శనంగా కనిపిస్తున్నాయి. కేవలం ఒక్క శాతం మంది చేతుల్లో 73 శాతం సంపద కేంద్రీకృతం కావడం గమనార్హం. కేవలం భారత్‌లోనే కాదు, ప్రపంచ వ్యాప్తంగానూ ఇదే రకమైన పరిస్థితి కనిపిస్తోంది. ఆర్థిక నిపుణలు ఈ విపరిణామాలపై ఆందోళన చెందుతున్నారు.

గత సంవత్సరం ప్రపంచ వ్యాప్తంగా సృష్టించిన సంపద మొత్తంలో 82 శాతం ధనవంతులైన కేవలం ఒక శాతం మంది వద్దకు చేరుకుందని 'ఆక్స్‌ఫామ్' సర్వేలో వెల్లడైంది. కాగా, విశ్వవ్యాప్తంగా దాదాపు 3.7 బిలియన్ల మంది ప్రజలకు వారి సంపాదనలో ఎలాంటి వృద్ధి కానరావడం లేదని స్పష్టమైంది.

దావోస్‌లో జరిగే 'ప్రపంచ ఆర్థికవేత్తల సదస్సు'లో ఆక్స్‌ఫామ్ సర్వే వివరాలపై కూలంకుషంగా చర్చించే అవకాశాలున్నాయి. ఈ సదస్సులో పాల్గొనే వివిధ దేశాల అధినేతలు తమ చర్చల సందర్భంగా ఆర్థిక, లింగ అసమానతలపై ప్రధానంగా తమ అభిప్రాయాలను బహిర్గతం చేసే అవకాశం ఉంది. 2016కు సంబంధించి ఆక్స్‌ఫామ్ సర్వేను విశ్లేషిస్తే భారత్‌లో ఒక్క శాతం మంది ధనికుల వద్ద దేశంలోని సంపదలో 58 శాతం కేంద్రీకృతమైందని, ప్రపంచ వ్యాప్తంగా 50 శాతం సంపద అతి కొద్దిమందికే పరిమితమైపోయిందని తేలింది. భారత్‌సహా అనేక దేశాల్లో ఇలా ధనవంతులు మరింత సంపన్నులవుతుండగా పేదవాళ్లు మరింత పేదరికంలో మగ్గుతున్నారు.

దావోస్‌లో 'ప్రపంచ ఆర్థికవేత్తల సదస్సు' ప్రారంభం కావడానికి కొద్ది గంటల ముందు ఆక్స్‌ఫామ్ సర్వే వివరాలు వివిధ దేశాధినేతలను ఆందోళన కలిగించేలా ఉన్నాయి. ఆ సర్వే ప్రకారం సంపద పంపిణీ తీరు భారత్‌లో ఏటా నిరాశాజనకంగానే ఉంది. తాజా సర్వే ప్రకారం భారత్‌లోని ఒక్క శాతం ధనికుల సంపద 2017లో 20.9 లక్షల కోట్ల రూపాయలకు చేరుకుంది. ఈ సంఖ్య 2017-18 వార్షిక సంవత్సరానికి ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో విద్య, ఆరోగ్య రంగాలకు కేటాయించిన మొత్తంతో సమానం కావడం గమనార్హం. అన్ని దేశాల్లో సంపద వృద్ధి జోరుగా ఉన్నా పేదరికం కూడా అదే స్థాయిలో పెరిగిపోతోంది. 2017లో భారత్‌లో కోటీశ్వరుల సంఖ్య గణనీయంగా పెరిగింది. 2010 నుంచి చూస్తే భారత్‌లో కోటీశ్వరులు సంపద ఏడాదికి 13 శాతం సగటున వృద్ధి చెందింది. సాధారణ ఉద్యోగి సంపదతో పోల్చిచూస్తే ఇది ఆరురెట్లు ఎక్కువ అని సర్వేలో వెల్లడైన గణంకాలు చెబుతున్నాయి. భారత్‌లో ఓ ప్రముఖ కంపెనీలో అధిక జీతభత్యాలు తీసుకునే ఎగ్జిక్యూటివ్ స్థాయి అధికారి ఏడాదిపాటు సంపాదించిన మొత్తం గ్రామీణ ప్రాంతంలో కనీస వేతనం తీసుకునే ఓ చిన్న ఉద్యోగి సంపాదించడానికి కనీసం 941 ఏళ్లు పడుతుందట! వినడానికి వింతగా ఉన్నా ఇవన్నీ వాస్తవాలేనని 'ఆక్స్‌ఫామ్' సర్వేను అధ్యయనం చేస్తే తెలుస్తుంది. అమెరికాలో అయితే ఓ ప్రముఖ కంపెనీ ముఖ్య కార్యనిర్వణాధికారి (సీఈవో) ఒక రోజుకు తీసుకునే జీతభత్యాన్ని అక్కడి సాధారణ ఉద్యోగి సంపాదించడానికి ఏడాది కాలం పడుతుందని తేలింది.

భారత్ సహా పది దేశాల్లో ఆక్స్‌ఫామ్ సర్వే సందర్భంగా 70వేల మంది నుంచి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్నారు. పేద, ధనిక వర్గాల మధ్య విస్తరిస్తున్న అంతరాన్ని తగ్గించాల్సిన సమయం ఆసన్నమైందని సర్వే నిర్వాహకులు తెలిపారు. ఇందుకు వివిధ దేశాల అధినేతలు సమగ్ర కార్యాచరణ పథకాన్ని అమలు చేయడం తక్షణ అవసరం అని 'ఆక్స్‌ఫామ్' తెలిపింది. భారత ప్రధాని నరేంద్ర మోదీ దావోస్‌లో జరిగే ప్రపంచ ఆర్థికవేత్తల సదస్సులో పాల్గొంటున్నందున, భారతీయ ఆర్థిక వ్యవస్థ అన్ని వర్గాల వారికి మేలు చేసేలా దృష్టి సారించాలని ఆక్స్‌ఫామ్ విజ్ఞప్తి చేసింది. ఉపాధిని పెంచే ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలని, సామాజిక భద్రతా పథకాలను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని నిపుణులు సూచిస్తున్నారు. పన్నులు ఎగవేసేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, అత్యంత సంపన్నులపై పన్నులను పెంచే అవకాశాలను కూడా పరిశీలించాలని ఆక్స్‌ఫామ్ సూచిస్తోంది. బ్రిటన్, అమెరికా, భారత్ వంటి దేశాల్లో సీఈవోలకు 60 శాతం వేతనాలను తగ్గించాలని సర్వేలో పాల్గొన్నవారిలో చాలా మంది అభిప్రాయపడ్డారు.

కార్మికుల హక్కులను హరించడం, ఆర్థిక విధానాల రూపకల్పనలో కార్పొరేట్ శక్తుల, సంపన్నుల ప్రభావం తగ్గించడం వంటి చర్యలు తీసుకోవాలని కూడా ఆక్స్‌ఫామ్ సూచించింది. దేశ ఆర్థిక ఫలాలు కొంతమంది చేతుల్లోకి వెళుతుండడం ప్రమాదకరమైన సంకేతమని 'ఆక్స్‌ఫామ్ ఇండియా' సీఈవో నిషా అగర్వాల్ అంటున్నారు. ఆర్థిక వ్యవస్థ పతనానికి ఇదో ఉదాహరణ అన్నారు. కార్మికులు, కర్షకులు తమ పిల్లల చదువులకు, వైద్య అవసరాలకు నోచుకోవడం లేదని ఆమె అన్నారు. ఆర్థిక వ్యత్యాసాల కారణంగా అవినీతి పెరుగుతోందన్నారు. కోటీశ్వరుల జాబితాలో పురుషులదే ఆధిపత్యం కాగా, వంశపారంపర్యంగా మాత్రమే కొద్దిమంది మహిళలకు ఆ జాబితాలో చోటు లభించింది.

దేవాలయాలను పరిరక్షించండి

సుప్రీంకోర్టులో సౌందరరాజన్ పిటిషన్

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 22: ప్రభుత్వ అధీనం నుండి దేవాలయాలను పరిరక్షించాలని కోరుతూ సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ దాఖలు చేసినట్టు చిలుకూరు బాలాజీ టెంపుల్ ప్రధాన అర్చకులు, దేవాలయాల పరిరక్షణ ఉద్యమ కన్వీనర్ డాక్టర్ ఎం వి సౌందరరాజన్ సోమవారం నాడు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన స్వామి దయానంద సరస్వతి దాఖలు చేసిన పిటీషన్లను, ఆంధ్రప్రదేశ్ దేవాదాయ ధర్మాదాయ చట్టం అంశంపై సుప్రీంకోర్టులో దీర్ఘ కాలం పాటు సాగిన కేసులను ప్రస్తావించారు. ప్రభుత్వాల కబంధాల నుండి దేవాలయాలకు స్వతంత్ర ప్రతిపత్తికల్పించాలని, దేవాలయాల పరిరక్షణకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని స్వామి దయానంద సరస్వతి దాఖలు చేసిన పిటీషన్‌పై మార్చి నెలలో మరోమారు విచారణ జరగనుందని, తెలుగు రాష్ట్రాల్లో సైతం దేవాలయాల స్వతంత్రప్రతిపత్తి కోరుతూ తాను ఇంప్లీడ్ పిటీషన్ వేశానని ఆయన వివరించారు. శ్రీమన్ రామా అని పేర్కొంటూ డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ ప్రతిపాదించిన తీర్మానాన్ని రాజ్యాంగ సభలో డాక్టర్ రాధా కృష్ణన్ సమర్ధించారని చిలుకూరు బాలాజీ టెంపుల్ ప్రధాన అర్చకులు, దేవాలయాల పరిరక్షణ ఉద్యమ కన్వీనర్ డాక్టర్ ఎం వి సౌందరరాజన్ పేర్కొన్నారు.

విద్యార్థుల ఆత్మహత్యలపై నివేదిక ఇవ్వండి

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 22: ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో విద్యార్థుల ఆత్మహత్యలపై నివేదిక ఇవ్వాలని ఇరు తెలుగు రాష్ట్రాలను హైకోర్టు సోమవారం నాడు ఆదేశించింది. ప్రకాశం జిల్లాకు చెందిన లోక్‌సత్తా నేత దాసరి ఇమ్మాన్యుయల్ ప్రధాన న్యాయమూర్తికి రాసిన లేఖను హైకోర్టు పిల్‌గా స్వీకరించింది. ప్రైవేటు కాలేజీల్లో విద్యార్థుల ఆత్మహత్యలపై విచారణ జరిపించాలని, హైకోర్టు జోక్యం చేసుకోవాలని ఇమ్మాన్యుయల్ లేఖ రాశారు. ఏపి ప్రభుత్వంలో కేబినెట్ మంత్రిగా ఉన్న నాయకుడికి చెందిన కాలేజీలే ఎక్కువగా ఉన్నాయని, అలాంటి కాలేజీల్లో చదువుతున్న విద్యార్థుల ఆత్మహత్యలపై అక్కడి ప్రభుత్వం కమిటీ వేసిందని, ఆ కమిటీ ఇచ్చిన నివేదికపై ఎలాంటి సమాచారం లేదని అన్నారు. విద్యార్థుల ఆత్మహత్యలకు బాధ్యులైన కాలేజీల యాజమాన్యాలపై కేసులు నమోదు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని హైకోర్టును ఇమ్మాన్యుయల్ కోరారు.

కోడి పందాలు ఎందుకు ఆపలేకపోయారు?

సంక్రాంతి పండుగ సందర్భంగా కోడి పందాలను ఎందుకు ఆపలేకపోయారంటూ హైకోర్టు సోమవారం నాడు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. కలిదిండి రామచంద్రరావు దాఖలు చేసిన ప్రజావాజ్య పిటీషన్‌ను స్వీకరించిన తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేష్ రంగనాథన్, జస్టిస్ ఎం గంగారావులతో కూడిన డివిజన్ బెంచ్ ఈమేరకు అధికారులను ప్రశ్నించింది. పిటీషనర్ తరపున న్యాయవాది పి వెంకటరెడ్డి వాదనలు వినిపించగా, ప్రభుత్వం తరపున విద్యావతి, జయంతిలు తమ వాదనలు వినిపించారు. హైకోర్టు చాలా స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినా, వాటిని పట్టించుకోరా అంటూ న్యాయమూర్తులు ప్రశ్నించారు. ఈ నెల 29న ఏపి సిఎస్, డిజిపిలు హైకోర్టులో హాజరుకావాలని ఆదేశించారు. కోడి పందాలపై తీసుకున్న చర్యలను వివరిస్తూ సమగ్ర నివేదికతో రావాలని డిజిపి, సిఎస్‌లను హైకోర్టు ఆదేశించింది.

బాణాసంచా తయారీ కేంద్రంలో పేలుడు: ఒకరి మృతి

సామర్లకోట, జనవరి 22: తూర్పు గోదావరి జిల్లా సామర్లకోట మండలం వేట్లపాలెంలోని వీర వెంకట విఘ్నేశ్వర ఫైర్ వర్క్స్ బాణాసంచా తయారీ కేంద్రం ఆవరణలో సోమవారం సంభవించిన పేలుడులో ఒక యువకుడు దుర్మరణం చెందగా, మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. సోమవారం మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో పేలుడు తారాజువ్వలు తయారుచేస్తుండగా నిప్పురవ్వలు లేచి, పేలుడు సంభవించింది. ఈ ప్రమాదంలో జువ్వలు తయారుచేస్తున్న సామర్లకోటకు చెందిన వేలంగి వెంకటరమణ (23) పొట్ట భాగంలో తీవ్రగాయాలయ్యాయి. ఆ సమయంలో పక్కనే ఉన్న మరో తయారీ కార్మికుడు రేపాక రమణ (38)కి కూడా తీవ్ర గాయాలయ్యాయి. ఇద్దరినీ హుటాహుటిన కాకినాడలోని ప్రయివేటు ఆసుపత్రికి తరలించగా, అప్పటికే వెంకటరమణ పరిస్థితి విషమించడంతో కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మృతిచెందినట్లు ధ్రువీకరించారు. తీవ్రంగా గాయపడిన రేపాక రమణ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అయితే ప్రమాదం తయారీ షెడ్‌లో కాకుండా బయట ఆవరణలో జరగడంతో పెనుప్రమాదం తప్పినట్లయ్యింది.

31న చంద్రగ్రహణం

శ్రీశైలం ఆలయం మూత

శ్రీశైలం, జనవరి 22: చంద్రగ్రహణం సందర్భంగా ఈనెల 31వ తేదీ శ్రీశైలం ఆలయాన్ని మూసివేస్తున్నట్లు దేవస్థానం ఈఓ భరత్‌గుప్తా తెలిపారు. బుధవారం ఉదయం 8 గంటల నుండి మరుసటి రోజు ఫిబ్రవరి 1వ తేదీ తెల్లవారుజామున 3.30 గంటల వరకు శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి వార్ల ఆలయ ద్వారాలు మూసివేస్తున్నట్లు తెలిపారు. గ్రహణం ముగిసిన అనంతరం గురువారం తెల్లవారుజామున 3.30 గంటలకు ఆలయ ద్వారాలు తెరచి ఆలయ శుద్ధి, సంప్రోక్షణ, స్వామి అమ్మవార్ల ప్రాతఃకాల పూజల అనంతరం ఉదయం 6.30 గంటల నుండి స్వామి వార్ల దర్శనాలు, ఆర్జిత సేవలకు భక్తులను అనుమతిస్తామన్నారు. రని ఆలయాధికారులు తెలిపారు. 31వ తేదీ 7.30 గంటల వరకు సర్వదర్శనానికి భక్తులను అనుమతిస్తామని ఆ తరువాత ఆలయాన్ని మూసివేస్తామన్నారు.

సింహ భాగం ఖర్చు కేంద్ర ప్రభుత్వానిదే

సంక్షేమ పథకాల అమలుపై బీజేపీ నాయకురాలు పురంధ్రీశ్వరి

నందిగామ, జనవరి 22: రాష్ట్రప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో సింహ భాగం నిధులు విడుదల చేస్తున్నది కేంద్ర ప్రభుత్వమేనని భారతీయ జనతా పార్టీ మహిళా మోర్చా జాతీయ అధ్యక్షురాలు, కేంద్ర మాజీమంత్రి దగ్గుబాటి పురంధ్రీరి అన్నారు. కృష్ణాజిల్లా నందిగామ గాంధీ సెంటర్ వద్ద సోమవారం సాయంత్రం జరిగిన నియోజకవర్గ స్థాయి పార్టీ కార్యకర్తల సమావేశంలో యువనాయకుడు మండవ భవానీ శంకర్ (నాని) అట్టహాసంగా బీజేపీలో చేరగా పురంధ్రీశ్వరి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు బండారు కేదార్‌నాథ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తొలుత మహాత్మా గాంధీ, నందమూరి తారక రామారావు విగ్రహాలకు పురంధ్రీశ్వరి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో తెలుగువాడి గొప్పతనాన్ని తెలియజేస్తూ నారాయరెడ్డి రాసిన కవితను వల్లెవేసిన పురంధ్రీశ్వరి మాట్లాడుతూ ఇక్కడ బీజేపీకి పునాదే లేదు అని విమర్శించే వారికి ఈ బహిరంగ సభే ఒక చెంప పెట్టులాంటిదన్నారు. వారసత్వ రాజకీయాలు లేని పార్టీ భారతీయ జనతా పార్టీ అని, పార్టీ గొప్పతనాన్ని వివరిస్తూ పార్టీలో అంకితభావంతో పని చేసే వారు ఎటువంటి గాడ్ ఫాదర్ లేకుండానే ఉన్నత స్థానాలకు ఎదిగే అవకాశం ఈ పార్టీలో ఉందన్నారు. అందుకు ఉదాహరణ ప్రధాని నరేంద్ర మోదీ, రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, ఉప రాష్ట్రపతి వెంకయ్యానాయుడు, పార్టీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షాలేనని పేర్కొన్నారు. సామాన్య కార్యకర్త, నాయకుడికి సైతం పెద్ద పీట వేసేది బీజేపీయేనని అన్నారు. గత ఎన్నికల్లో రాజకీయ విశ్లేషకుల అంచనాలకు భిన్నంగా 282 పార్లమెంట్ స్థానాలు కైవసం చేసుకొని ఏ రాజకీయ పార్టీ మద్దతు అవసరం లేకుండానే బీజేపీ కేంద్రంలో అధికారంలోకి వచ్చిందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ తొలిసారి పార్లమెంట్‌కు అడుగు పెట్టిన సందర్భంలో ఎటువంటి గర్వాన్ని ప్రదర్శించకుండా తాను ఈ దేశ ప్రధాన సేవకుడిని అని చెప్పుకోవడం గమనించాల్సిన విషయమన్నారు. పేదరికం నిర్మూలనే లక్ష్యంగా ప్రధాని నరేంద్ర మోదీ అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే అనేక సంక్షేమ పథకాల్లో సింహ భాగం నిధులు కేటాయించేది కేంద్ర ప్రభుత్వమే అన్న విషయాన్ని ప్రజలు గుర్తించాలని కోరారు. మరుగుదొడ్ల నిర్మాణంలో రూ.15వేలు ఖర్చు అవుతుండగా అందులో రూ.12వేలు కేంద్ర ప్రభుత్వం అందిస్తుండగా రూ.3వేలు మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుందన్నారు.జన్‌ధన్ యోజన పథకాన్ని ప్రవేశపెట్టారని, అదే విధంగా ప్రతి పేద వాడి ఇంటికి గ్యాస్ కనెక్షన్ ఉచితంగా అందేందుకు ఉజ్వల పథకాన్ని ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారని పేర్కొన్నారు.

‘హోదా’తో ముడిపడి పొత్తులుండవు: సోము

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

అమరావతి, జనవరి 22: హోదాతో ముడిపడి ఎన్నికల పొత్తులు, రాజకీయాలు ఉండవని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, ఎమ్మెల్సీ సోము వీర్రాజు స్పష్టం చేశారు. ప్రత్యేక హోదా ఇస్తే తాను బీజేపీతో కలసి నడిచేందుకు సిద్ధంగా ఉన్నానన్న వైసీపీ అధినేత జగన్ వ్యాఖ్యలపై సోము స్పందించారు. జగన్ వ్యాఖ్యలపై బీజేపీ వివరణ కోరగా, ప్రత్యేక హోదాను అనుసరించి పొత్తులుండవని వ్యాఖ్యానించారు. అయినా మేం టీడీపీతోనే ఉన్నాం. విడిపోలేదు కదా? అని ప్రశ్నించారు. ప్రత్యేక హోదా ఉన్న రాష్ట్రాలకు భవిష్యత్తులో ఆ హోదా ఉండదని, కమిషన్ల సిఫార్సు వల్ల ఇకపై ఆ ప్రయోజనాలు రావని, హోదా ఇచ్చే కమిటీ ఇప్పుడు లేదన్న విషయం గుర్తుంచుకోవాలన్నారు. ఈ విషయం రోజూ పత్రికలు చదివే అందరికీ తెలుసనన్నారు. ‘రాష్ట్రానికి మోదీ ఇచ్చిన హామీలన్నీ అమలవుతున్నాయి. హోదాను మించిన ప్యాకేజీ ఇస్తామన్నాం. ఇస్తున్నాం. ఇప్పటికి 4 వేల కోట్ల రూపాయలిచ్చాం. మరో రెండు, మూడు నెలల్లో మరో 2,3 వేల కోట్లు ఇస్తారన్న సమాచారం ఉంది. తర్వాత మరో 4 వేల కోట్లు ఇస్తామంటున్నారు.

12 మంది ఐపీఎస్‌లు, ఐదుగురు ఐఏఎస్‌లకు ప్రమోషన్లు

విజయవాడ (క్రైం), జనవరి 22: రాష్ట్రంలో పని చేస్తున్న 12మంది ఐపీఎస్ అధికారులతోపాటు, కేంద్ర, రాష్ట్ర సర్వీసుల్లో ఉన్న మరో ఐదుగురు ఐఏఎస్‌లకు పదోన్నతి కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. వీరిలో ఆరుగురు ఎస్పీలకు సీనియర్ అధికారులుగా, నలుగురు డీఐజీలకు ఐజీలుగా, మరో ఇద్దరు సీనియర్లకు డీఐజీలుగా ప్రమోషన్ లభించింది. 2004 బ్యాచ్‌కు చెందిన సీనియర్ ఐపీఎస్ హోదాలో ఉన్న విజయవాడ లా అండ్ ఆర్డర్ డీసీపీ కాంతి రానా టాటా, కోస్తల్ సెక్యూరిటీ ఎస్పీ డాక్టర్ నవీన్ గులాటి డీఐజీలుగా పదోన్నతి పొందారు. అదేవిధంగా 2000 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన గుంటూరు రేంజ్ డీఐజీ కేవీవీ గోపాలరావు, విజయవాడ జాయింట్ పోలీసు కమిషనర్ బీవీ రమణకుమార్, ఏసీబీ అదనపు డైరెక్టర్ పి హరికుమార్, అదేవిధంగా బెంగళూరులో సీబీఐలో పని చేస్తున్న మనీష్‌కుమార్ సిన్హాలకు డీఐజీ హోదా నుంచి ఐజీలుగా పదోన్నతి కలిగింది. ఇక..పలుచోట్ల విధులు నిర్వహిస్తున్న ఎస్పీలు ఎస్ శ్యాం సుందర్, డాక్టర్ సిఎం త్రివిక్రమ వర్మ, కె కోటేశ్వరరావు, ఎల్‌కెవి రంగారావు, పి వెంకటరామిరెడ్డి, జి పాలరాజులకు సీనియర్ ఎస్పీలుగా ప్రమోషన్ దక్కింది. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. అదేవిధంగా వివిధ చోట్ల పని చేస్తున్న ఐదుగురు ఐఏఎస్ అధికారులకు కూడా పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. వీరిలో 2005 బ్యాచ్‌కు చెందిన ఆంధ్రప్రదేశ్ సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ముదావత్ ఎం నాయక్, తిరుమల తిరుపతి దేవస్థానం జాయింట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పి భాస్కర, 2002 బ్యాచ్‌కు చెందిన సివిల్ సప్లయిస్ డైరెక్టర్ జి రవిబాబు, 2005 బ్యాచ్‌కు చెందిన భారత ప్రభుత్వ రూరల్ డవలప్‌మెంట్ డిపార్ట్‌మెంట్ డిప్యూటీ సెక్రటరీ ఎం జానకి, భారత ఉప రాష్ట్రపతి ప్రైవేటు సెక్రటరీ ఎన్ డాక్టర్ ఎన్ యువరాజ్‌లకు సీనియర్ ఐఏఎస్ అధికారులుగా పదోన్నతి లభించింది.

డీలర్లకు రూ. 6.5 కోట్ల చెల్లింపులు

విజయవాడ, జనవరి 22: చంద్రన్న సంక్రాంతి కానుకపై చౌకడిపో డీలర్ల సమాఖ్య చేసిన పోరాటాలు ఫలించాయి. గడచిన రెండేళ్లుగా రంజాన్ తోఫా, క్రిస్మస్, సంక్రాంతి కానుక కిట్‌లపై ఒక్కో కార్డుకు కేవలం ఐదు రూపాయలు మాత్రమే డీలర్లకు కమీషన్ లభించేది. అయితే ఆ కమీషన్ రవాణా ఖర్చులకే సరిపోవటం లేదంటూ డీలర్లు ఆందోళన చేస్తూ వచ్చారు. దీనిపై స్పందించిన ప్రభుత్వం కమీషన్ పెంచింది. 29వేల మంది డీలర్లకు ఆరున్నర కోట్ల రూపాయల అదనపు కమీషన్‌ను డీలర్ల బ్యాంక్ ఖాతాలకు జమ చేశారు.

అన్యమతస్థుల తొలగింపునకు నిర్ణయం

ఆంధ్రభూమి బ్యూరో

తిరుపతి, జనవరి 22: తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలనా పాలనా చూసే తిరుమల తిరుపతి దేవస్థానంలో వివిధ హోదాల్లో ఉన్న అన్యమతస్థులను తొలగించాలని టీటీడీ యాజమాన్యం ఉన్న ఫళంగా తీసుకున్న నిర్ణయం వివాదాస్పదంగా మారుతోంది. వివిధ హోదాల్లో 35 మంది మైనార్టీలు, 10 మంది క్రైస్తవులు ఉన్నట్టు టీటీడీ గుర్తించింది. దీంతో వీరికి శ్రీముఖాలు జారీ చేసింది. శ్రీముఖాలు అందుకున్న బాధిత ఉద్యోగులు టీటీడీ ఈఓ ఎకె సింఘాల్‌ను కూడా కలిసి తమకు అన్యాయం చేయవద్దని కోరినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఈ ఓ కూడా తన నిస్సహాయతను వ్యక్తం చేసినట్లు బాధితులు చెబుతున్నారు. టిటిడి దేవస్థానం పాలన ప్రారంభమైన తొలినాళ్లల్లో అన్యమతస్థులను టీటీడీలో తీసుకోరాదన్న నిబంధనలు ఎక్కడాలేవు. అయితే అటు తరువాత క్రైస్తవులు హైందవులను మత మార్పిడులకు పాల్పడుతున్న నేపథ్యంలో టీటీడీ అన్యమతస్థుల వ్యవహారంపై తీవ్రస్థాయిలో దృష్టిసారించింది. తిరుమలలో అన్యమతస్థులు ఎలాంటి ప్రార్థనలు కాని, మత మార్పిడిలకు పాల్పడటం కాని, చివరకు తిరుమలకు వెళ్లే వాహనాలపై అన్యమతస్థుల గుర్తులే కాకుండా ఏ రాజకీయ పరమైన వ్యక్తుల ఫోటోలు, పార్టీ గుర్తులు, నినాదాలు ఉండకూడదనే విధానాన్ని టీటీడీ అమలు చేస్తోంది.

ఇంద్రకీలాద్రిపై ఘనంగా శ్రీపంచమి

విజయవాడ (ఇంద్రకీలాద్రి) జనవరి 22: శ్రీపంచమి సందర్భంగా ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న జగజ్జనని శ్రీ కనకదుర్గమ్మ సోమవారం భక్తులకు శ్రీ సరస్వతీ దేవి దివ్య అలంకారంతో దివ్య దర్శనం మిచ్చింది. ఈచదువుల తల్లిఆశీస్సులను పొందటానికి స్కూళ్లు, కళాశాలలకు చెందిన విద్యార్థులు వేకువ జామునుంచే ఇంద్రకీలాద్రికి పోటెత్తారు. జ్ఞానాన్ని అందించే చదువుల తల్లి సరస్వతీ దేవి జన్మనక్షత్రం సందర్భంగా శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం అధికారులు ‘విజయీభవ’ పేరుతో అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. పరీక్షల్లో అందరు విద్యార్థులు అఖండ విజయం సాధించాలని ఆకాంక్షిస్తూ అంతరాలయంలో ఉన్న మూల విరాట్‌తో పాటు, ఉత్సవ మూర్తికి సైతం శ్రీసరస్వతీదేవి అలంకారం చేశారు.



వేడుకగా పోలమాంబ తొలేళ్ల ఉత్సవం

మక్కువ, జనవరి 22: విజయనగరం జిల్లా మక్కువ మండలంలోని శంబర శ్రీ పోలమాంబ అమ్మవారి జాతరకు సంబంధించి సోమవారం తొలేళ్ల ఉత్సవం కన్నుల పండువగా జరిగింది. మంగళవారం నిర్వహించే సిరిమానోత్సవానికి ఆలయ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. పార్వతీపురం ఆర్డీవో సుదర్శనదొర పర్యవేక్షణలో ఆదివారం రాత్రి అమ్మవారి ఘటాలను ఊరేగించాక సోమవారం రాత్రి తొలేళ్ల ఉత్సవాన్ని నిర్వహించారు. వేలాది మంది భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. గత ఏడాది కంటే ఈ ఏడాది భక్తుల సంఖ్య పెరిగింది. ఇదిలా ఉండగా జాతరలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా 900 మంది పోలీసులను బందోబస్తుగా నియమించారు. మంగళవారం జరిగే సిరిమానోత్సవానికి ఇప్పటికే ఆలయ పరిసర ప్రాంతాల్లో భక్తులుగా భారీగా తరలివచ్చారు.



1వ పేజీ తరువాయి

రెండు రాష్ట్రాల్లో పోటీ

అనంతపూర్ జిల్లాలో కరవు యాత్ర నిర్వహించనున్నట్టు ప్రకటించారు. అలాగే, విశాఖ ఏజన్సీ, తూర్పు గోదావరి జిల్లా ఉద్దానంలో కూడా పర్యటించి, అక్కడి ప్రజల సమస్యలు ప్రభుత్వానికి నివేదిస్తానని చెప్పారు. తమ పార్టీ వివాదాస్పద రాజకీయాలకు చోటునివ్వదని, పరిష్కార రాజకీయాలకు మాత్రమే పెద్దపీట వేయనుందని అన్నారు. ప్రచారం కోసం చౌకబారు విమర్శలు చేయటం తమ పార్టీ విధానం కాదని, ప్రజల తీర్పుతో వచ్చిన ప్రభుత్వాలను గౌరవించాల్సిన అవసరముందని అన్నారు. ఇతర పార్టీల మాదిరి తప్పుడు ఆరోపణలు చేస్తూ, రాజకీయ అస్థిరతకు గురిచేసే ఆలోచన తమ పార్టీకి ఎంతమాత్రం లేదన్నారు. అందుకే ఓటు నోటు కేసు విషయంలో మౌనంగా ఉన్నట్టు చెప్పారు. నిర్మాణాత్మక రాజకీయాలతో పార్టీని విస్తరించనున్నట్టు, ఇందుకోసం మేధావులు, రాజకీయ విశ్లేషకులు, జర్నలిస్టులు, విద్యావంతులు కూడా సలహాలు, సూచనలు ఇస్తున్నట్లు, వాటిని పరిగణలోకి తీసుకుంటూ ముందుకు సాగుతామని అన్నారు. తాను ఎవరి ప్రమేయంతో కానీ, ఎవరి ప్రోద్బలంతో కానీ రాష్ట్రంలో పర్యటించటం లేదని, తెలంగాణపై తనకున్న అభిమానం, ప్రేమతోపాటు అభిమానుల ఆశీస్సులతోనే ప్రజాసేవ చేసేందుకు రాజకీయాల్లోకి వస్తున్నట్టు తెలిపారు. గతంలో ఎన్నికల ముందు ఆవిర్భవించి, అనంతరం కనుమరుగైన పార్టీల మాదిరి కాకుండా, సుదీర్ఘ రాజకీయాలు చేసేందుకే పార్టీ స్థాపించామని తెలిపారు. బీజేపీ జాతీయాధ్యక్షుడు అమిత్‌షా గతంలోనే ఆ పార్టీలో చేరాలంటూ ఆహ్వానించినా తాను సున్నితంగా తిరస్కరించినట్టు చెప్పారు. ఎన్నో ఉద్యమాల ఫలితంగా వచ్చిన తెలంగాణలో సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వానికి అవకాశమివ్వాల్సిన అవసరముందని, ఉద్యమ ట్యాగ్‌లైన్ నీళ్ళు, నిధులు, నియామకాలపై కూడా ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించాలని సూచించారు. తెలంగాణలో ముఖ్యమంత్రి కేసీఆర్ పాలన స్మార్ట్‌గా ఉందని కొనియాడారు. ఉమ్మడి రాష్ట్రాల్లో సమస్యలపై రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు దృష్టి సారించాలని, ప్రధానంగా ఉద్యోగుల అంతర్రాష్ట్ర బదిలీలపై సత్వరం స్పందించాలన్నారు. ముఖ్య కార్యకర్తల సమావేశాలానంతరం సమన్వయకర్తలను ప్రకటిస్తామని, అనంతరం క్షేత్ర స్థాయి పర్యటనలకు షెడ్యూల్ విడుదల చేయనున్నట్టు వెల్లడించారు. అనంతరం కరీంనగర్, పెద్దపల్లి, ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల ముఖ్యకార్యకర్తల సమావేశంలో పాల్గొని చర్చించారు. అంతకుముందు జనసేన కార్యకర్తలు, అభిమానులు పవన్‌కు ఘన స్వాగతం పలికారు. ఇదిలావుంటే, సోమవారం ఉదయం ఆయన నివాసగృహం నుండి బయలుదేరినపుడు భార్య అన్నా లెచినోవా తిలకం దిద్ది హారతితో స్వాగతం పలికారు. పవన్ అక్కడి నుండి ప్రశాసన్ నగర్‌లోని పార్టీ పరిపాలనా కార్యాలయానికి చేరుకున్నారు.

విభిన్న మతాలకు చెందిన మహిళలు వారి సంప్రదాయాలు ప్రకారం దైవ ప్రార్థనలు జరిపి పవన్ కళ్యాణ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జనసేన సోషల్ మీడియాకు సంబంధించి వీర మహిళ పేరుతో ఏర్పాటైన విభాగాలను ప్రారంభించారు. ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇన్‌స్టాగ్రామ్‌లలో ‘ఎస్పీ వీరమహిళ’ పేరుతో ఖాతాలను ప్రారంభించారు.

సాగులో ఏపీ టాపర్

ఏ రాష్ట్రంలోలేని విధంగా 54 లక్షల మంది రైతులకు భూసార పరీక్షా పత్రాలు అందజేశామన్నారు. భూసార పరీక్షల ఆధారంగా రైతులకు నూరుశాతం సబ్సిడీతో మైక్రో న్యూట్రిషన్లు అందజేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర విభజన తరువాత సమస్యలు అధికమైనా ప్రభుత్వం వ్యవసాయ రంగంపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. రైతులకు సలహాలు, సూచనలు అందించేందుకు ఎంపీఈఓల వ్యవస్థను ఏర్పాటు చేశామన్నారు. బిందుసేద్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. ఇందుకోసం 700 కోట్లు విడుదల చేశామన్నారు. రూ 5 వేల కోట్లతో వచ్చే నెలాఖరులోగా మూడోవిడత రుణమాఫీని పది శాతం వడ్డీతో మంజూరు చేయనున్నట్లు ప్రకటించారు. వ్యవసాయ రంగంలో అధునాతన టెక్నాలజీతో పరిశోధనలు నిర్వహిస్తోందని, అన్నిరకాల వ్యవసాయాన్ని సుసంపన్నం చేసేందుకు చర్యలు తీసుకుంటోందని చెప్పారు. రైతులు వ్యవసాయంలో మెళకువలు పాటించాలన్నారు. ఇన్‌పుట్ సబ్సిడీ కింద రూ 19వందల కోట్లు రైతులకు అందజేశామని, అనంతపురం జిల్లాకే రూ 1031 కోట్లు కేటాయించామని తెలిపారు. వ్యవసాయ రంగంలో యాంత్రికీకరణకు పెద్దపీట వేస్తున్నామని, ఈ ఏడాది రైతు రథం పథకం కింద 12వేల 800 ట్రాక్టర్లను రైతులకు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. పౌరసరఫరాలశాఖ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు మాట్లాడుతూ రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులను అందించటం, కనీస మద్దతు ధరతో పాటు మార్కెట్ సదుపాయాలు కల్పిస్తున్నామని వివరించారు. రైతాంగ సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందని వాటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలోలేని విధంగా రుణ మాఫీ పథకం కింద రూ 24 వేల కోట్ల రుణమాఫీ చేసిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ప్రపంచంలోనే అత్యుత్తమ వ్యవసాయ విశ్వవిద్యాలయ నిర్మాణాన్ని ప్రభుత్వం చేపట్టిందన్నారు. తెలంగాణలో పత్తి పంటకు గులాబీరంగు 50 శాతం మేర ఆశిస్తే మన శాస్త్రవేత్తల కృషి ఫలితంగా కేవలం 5 శాతానికి తగ్గిందన్నారు. రీజనల్ అగ్రికల్చరల్ రీసెర్చ్ సెంటర్, రూ 24 కోట్లతో నిర్మించనున్న కాలేజ్ ఆఫ్ హోం సైన్సెస్, సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ ఇన్ కల్చర్ భవన నిర్మాణాలకు మంత్రులు శంకుస్థాపన చేశారు. తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్, రాష్ట్ర వ్యవసాయ శాఖ ప్రత్యేక కమిషనర్ కెఎస్ జవహర్‌లాల్, ఆచార్య ఎన్జీ రంగా విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ దామోదరనాయుడు, విస్తరణ సంచాలకులు కె రాజారెడ్డి, గుంటూరు మిర్చి యార్డు చైర్మన్ మన్నవ సుబ్బారావు, ఎమ్మెల్సీ ఎఎస్ రామకృష్ణ, జడ్పీ వైస్‌చైర్మన్ వడ్లమూడి పూర్ణచంద్రరావు, లాం వ్యవసాయ పరిశోధనా కేంద్రం డైరెక్టర్లు, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు. తొలుత కిసాన్‌మేళాలో పాల్గొన్న వ్యవసాయ, అనుబంధ రంగాలకు చెందిన స్టాల్స్‌ను ప్రారంభించారు.

పెట్టుబడులకు పయనీర్ సిద్ధం

చెప్పారు. ప్రతికూల పరిస్థితుల్లో సైతం తమ రాష్ట్రం ఒక్క ఉద్యానరంగంలోనే 30 శాతం వృద్ధిరేటును నమోదు చేసిందని చంద్రబాబు తెలిపారు. ఆక్వారంగాన్ని పెద్ద స్థాయిలో అభివృద్ధి చేశామని, ఆక్వాలో దేశంలోనే తమ రాష్ట్రం నెంబర్-1 అని తెలిపారు. ‘ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టేందుకు పూర్తి ప్రణాళికతో రండి. మీకు అన్ని విధాలా సహకారం అందజేస్తాం. సింగిల్ డెస్క్ విధానం ద్వారా అన్ని అనుమతులను మూడు వారాల్లో ఇస్తున్నాం. నాదీ భరోసా’ అన్నారు. ‘ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ ఆర్గనైజేషన్స్ తరహాలో పాల ఉత్పత్తులకు అదనపు విలువ జోడించేలా పెద్దఎత్తున సహకార సంస్థల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. కుప్పంలో చిన్నపాటి విమానాశ్రయం ఏర్పాటు చేస్తాం. దీనివల్ల మీ ప్రయాణాలు సాఫీగా జరుగుతాయి. సరుకు రవాణా సులభతరం అవుతుందని’ చంద్రబాబు వివరించారు. ఈ సంస్థతో సంప్రదింపులు జరిపి పనులు వేగవంతంగా పూర్తిచేయాలని పరిశ్రమల శాఖ కార్యదర్శిని ఆదేశించారు.

ఐదువేల కోట్ల పెట్టుబడులు లక్ష్యం: రోన్‌పాల్

జ్యూరిచ్‌లో పయనీరింగ్ వెంచర్స్ చైర్మన్ రోన్‌పాల్ స్పందిస్తూ పండ్ల తోటలు, పాడి పరిశ్రమలో ఇప్పటికే తమ సంస్థ పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టిందని, రానున్న ఐదేళ్లలో రూ.5వేల కోట్లు పెట్టుబడి పెట్టాలని భావిస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ భారతంలో పెట్టుబడులు వెచ్చించాలని నిశ్చయించామన్నారు. ఆంధ్రలో వ్యవసాయాభివృద్ధిని పరిశీలించి భవిష్యత్ కార్యాచరణ సవివరంగా ప్రకటిస్తామన్నారు.

జ్యూరిచ్‌తో సిస్టర్ స్టేట్ ఒప్పందం

చంద్రబాబు సమక్షంలో జ్యూరిచ్, ఆంధ్ర అధికారులు సిస్టర్ స్టేట్ ఒప్పంద పత్రాలు మార్చుకున్నారు. ఈ ఒప్పందం వల్ల పర్యావరణ సాంకేతికత, జీవశాస్త్రాలు, పట్టణ, ప్రాంతీయాభివృద్ధి రంగాల్లో పరస్పరం సహకరించుకుంటాయి. ఒప్పందానికి ముందు బాబుతో జ్యూరిచ్ ప్రభుత్వ ఆర్థిక వ్యవహారాల మంత్రి కార్మెన్ వాకెర్ స్పా, ఆర్థిక వ్యవహారాల ఉప మంత్రి బ్యూన్ సాటర్, జ్యూరిచ్ ప్రభుత్వ ప్రాజెక్టు మేనేజర్ కొరిన్ ప్యేర్ భేటీ అయ్యారు. టెక్నాలజీ, ఇన్నోవేషన్ అంశాల్లో జ్యూరిచ్ ఎంతో పటిష్టంగా ఉన్నట్లు బాబుకు కార్మెన్ వాకెర్ వివరించారు. ‘లెటర్ ఆఫ్ ఇండెంట్’ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ పక్షాన ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు, జ్యూరిచ్ తరపున ఆర్థిక వ్యవహారాల మంత్రి కార్మెన్, ఉప మంత్రి బ్యూన్ పాల్గొన్నారు. ముఖ్యమంత్రి బృందంలో రాష్ట్ర ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు డాక్టర్ పరకాల ప్రభాకర్, ఐటీ, పంచాయతీరాజ్ శాఖ మంత్రి నారా లోకేష్, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

ప్రత్యేక హోదా ఇస్తే ..

రాష్ట్రాభివృద్ధికి దన్నుగా నిలిచి ప్రత్యేక హోదా కల్పిస్తే బీజేపీతో జతకట్టడానికి వెనుకాడనన్నారు. 2014 ఎన్నికల్లో కేవలం ఒకటిన్నర శాతం ఓట్లతోనే చంద్రబాబు అధికారంలోకి వచ్చాడన్నారు. అందుకు కారణం నరేంద్రమోదీ, జనసేన నేత పవన్ కల్యాణ్ టీడీపీ వెంట ఉండటంతోపాటు చంద్రబాబు ప్రజలకు తప్పుడు హామీలిచ్చి మోసం చేయడమేనన్నారు. బాబు ప్రజలనే కాకుండా నరేంద్ర మోదీని కూడా తప్పుదారి పట్టించారన్నారు. కాంగ్రెస్, టీడీపీలు కలిసి తనపై కేసులు పెట్టిన విషయం ప్రజలందరికీ తెలుసునన్నారు. కాంగ్రెస్‌ను వీడిన తరువాతే తనపై కేసులు బనాయించారన్నారు. ఓటుకు నోటు కేసులో ఆడియో, వీడియో టేపుల్లో రెడ్‌హ్యాండెడ్‌గా దొరికిపోయిన చంద్రబాబు ఇంకా ఆపదవిలో ఎలా కొనసాగుతున్నారని ప్రశ్నించారు.

అధికారమిస్తే దళితులకు ఎన్నో చేస్తా

రానున్న ఎన్నికల్లో వైకాపాకు అధికారం ఇస్తే దళితులకు వారి భూములు వారికి ఇప్పించి ఉచితంగా బోర్లు వేయిస్తానని, దళిత మహిళలకు పక్కా ఇళ్లు కట్టి రిజిస్ట్రేషన్ చేయిస్తానని, 45 సంవత్సరాలు నిండిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు రూ.2000 పెన్షన్ ఇప్పిస్తానని వైకాపా అధినేత జగన్మోహన్ రెడ్డి హామీ ఇచ్చారు. వైకాపా అధ్యక్షుడు జగన్ చేపట్టిన మహా సంకల్ప పాదయాత్ర సోమవారం చిత్తూరు జిల్లా బుచ్చినాయుడుకండ్రిగ మండలంలోని పల్లమాలలో సాగింది. ఈక్రమంలో రాయలసీమ జిల్లాల్లో జగన్ పాదయాత్ర ముగిసినట్లయింది. కాగా పల్లమాలలో జరిగిన దళితుల ఆత్మీయ సమావేశంలో జగన్ ఉద్వేగంగా, ఉత్సాహంగా మాట్లాడారు. పరిశ్రమల్లో స్థానికులకు 75 శాతం ఉద్యోగాలిచ్చేలా చట్టం తీసుకొస్తామన్నారు. ఎస్సీ, ఎస్టీ భూముల పరిరక్షణకు ప్రత్యేక చట్టం తెస్తామన్నారు. ఎక్కడైనా అభివృద్ధి కోసం వారి భూములు సేకరించాల్సిన పరిస్థితి ఏర్పడితే అదనపు చెల్లింపులు చేసేలా నిర్ణయాలు తీసుకుంటామన్నారు. తన అవసరాల కోసం ఎవరినైనా మోసం చేయగలిగిన ఘనుడు చంద్రబాబు అని ఆరోపించారు. ఎన్నికల సమయంలో రకరకాల వేషాలు వేసి ప్రజలను నమ్మించి ఆచరణ సాధ్యం కాని హామీలు ఇచ్చి అధికారంలోకి రాగానే ఇచ్చిన మాటను అటకెక్కించారన్నారు. తాను అధికారంలోకి రాగానే విద్యార్థులకు యేడాదికి రూ.20,000 ఉపకార వేతనంగా అందిస్తానన్నారు. శ్రీసిటీలో స్థానికులకు ఉద్యోగాలిచ్చే విధానాన్ని అమలు చేయిస్తానన్నారు. మంత్రి ఆదినారాయణ రెడ్డి దళితులపై చేసిన వ్యాఖ్యలు నీచాతినీచమైనవన్నారు. దళితులు స్నానం చేయరని, చదువుకోరని ఒక మంత్రి హోదాలో ఉన్న వ్యక్తి వ్యాఖ్యానించడం ఎంత వరకు ధర్మమన్నారు.

రోడ్డెక్కిన పోలీస్ పరువు

వెలువడే అవకాశం ఉంది. తెలంగాణ అవినీతి నిరోధక శాఖలో డీఎస్పీ హోదాలోవున్న సునీతారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లా కల్వకుర్తి సీఐ మల్లిఖార్జునరెడ్డికి మధ్య కొంతకాలంగా వివాహేతర సంబంధం కొనసాగుతోంది. ఈ విషయాన్ని గమనించిన సునీతారెడ్డి భర్త సురేందర్‌రెడ్డి వారిపై నిఘా పెట్టారు. ఆదివారం రాత్రి కేపీహెచ్‌బీ కాలనీ ఇందు ప్రాజెక్టులోని తన ఫ్లాట్‌లో భార్య సునీత సిఐ మల్లిఖార్జునరెడ్డితో కలిసివున్న సమయంలో సురేందర్‌రెడ్డి, ఆయన తల్లి, బంధువులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఇంట్లో నుంచి బయటకు తీసుకొచ్చి చెప్పులతో దేహశుద్ధి చేశారు. తన భార్యను మల్లిఖార్జునరెడ్డి లోబర్చుకుని తనను మానసిక క్షోభకు గురిచేశాడని సురేందర్‌రెడ్డి వాపోయాడు. వారిద్దరి మధ్య జరుగుతున్న వివాహేతర సంబంధాన్ని బయటపెట్టాలన్న ఉద్దేశంతోనే పక్కా ప్రణాళికతో సురేందర్ రెడ్డి పట్టుకున్నట్టు తెలుస్తోంది. అనంతరం సాక్ష్యాధారాలతో కేపీహెచ్‌బీ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు మల్లిఖార్జునరెడ్డిపై ఐపీసీ 447, 497, 506 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. దీంతో ఈ సంగతి ఏసీబీ డీజీ కార్యాలయానికి, మహబూబ్‌నగర్ ఎస్పీ కార్యాలయానికి చేరడంతో ఉన్నతాధికారులు విస్తుబోయారు. పోలీస్ స్టేషన్ వద్ద సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ సీఐ మల్లిఖార్జునరెడ్డి రెండేళ్ల నుంచి తన భార్యను లోబరుచుకున్నాడన్నారు. మానసికంగా హింసించాడని, ఈ క్రమంలోనే తాను ఆత్మహత్య చేసుకోవాలని కూడా నిర్ణయించుకున్నట్లు తెలిపాడు. అయితే సునీతారెడ్డి, మల్లిఖార్జునరెడ్డిల అక్రమ వ్యవహారాన్ని బయటపెట్టాలన్న ఉద్దేశ్యంతోనే రెండురోజుల క్రితం భార్యకు తెలియకుండానే అమెరికా నుంచి వచ్చానని తెలిపారు. ఇక్కడ జరుగుతున్న తతంగాన్ని కళ్లారా చూసి దిగ్భ్రాంతికి గురయ్యానన్నారు. తన భార్యను లోబరుచుకున్న మల్లిఖార్జునరెడ్డిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

భళిరా భారత్!

జిహ్వాచాపల్యాన్నీ రేకెత్తిస్తున్నాయి. అన్నీ నిముషాల్లోనే ఎగిరిపోతున్నాయి. ముఖ్యంగా చాయ్, పకోడీలకు ఉన్న డిమాండ్ గురించి చెప్పనే అక్కర్లేదు. వడాపావ్, దోశల కోసమైతే ఎగబడుతున్నారు. అన్ని వీధులూ భారతీయ లాంజ్‌లతో నిండిపోవడంతో భిన్న రుచులకు కొదవ లేదు. ఆంధ్ర ప్రదేశ్, మహారాష్ట్ర ప్రభుత్వాలు ఏకంగా సొంత లాంజ్‌లనే ఏర్పాటు చేశాయి. వీటితో పాటు భారతీయ కంపెనీల స్టార్టప్‌లూ ప్రతి ఒక్కరినీ అలరిస్తున్నాయి. అంతర్జాతీయ కంపెనీలకు పోటీగా భారత్ కంపెనీలూ అందరినీ ఆకర్షిస్తున్నాయి. ఐదు రోజుల పాటు జరిగే ఈ ఆర్థిక సదస్సుకు గతంలో ఎన్నడూ లేనంత ప్రాధాన్యత లభించింది. మంచు కూడా అన్ని చోట్లా దట్టంగానే కురుస్తోంది. సమావేశ తొలి రోజే చాలా రహదారులు మంచుతో మూసుకు పోయాయంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. దాదాపు 70 దేశాలు, ప్రభుత్వాలకు చెందిన అధ్యక్షులు, ప్రధానలులు హాజరు అవుతున్నందున భారీగానే భద్రతా బలగాలనూ తరలించారు.

అంతపనీ అమ్మే చేసింది!

ఉన్నారు. కాగా తమ చిన్నారి తరుచూ అనారోగ్యానికి గురికావడంతో తట్టుకోలేని తల్లి తీవ్ర మనస్థాపానికి గురై సోమవారం మధ్యాహ్నం ఐదు అంతస్తుల అపార్టుమెంటు టెర్రస్‌పై నుంచి కూతురును పట్టుకుని కిందకు దూకింది. రక్తపు మడుగులో పడి తల్లీకూతురు అక్కడికక్కడే ప్రాణాలు వదిలారు. మృతురాలు తండ్రి ఎం.సత్యనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన చందానగర్ ఇన్‌స్పెక్టర్ ఎస్.తిరుపతి రావుఆధ్వర్యంలో ఎస్ఐ వేణుకుమార్ దర్యాప్తు చేస్తున్నారు.

క్రీడ

ఆస్ట్రేలియా గ్రాండ్ శ్లామ్ టెన్నిస్ టోర్నమెంట్‌లో సోమవారం మూడు సంచలన ఫలితాలు నమోదయ్యాయి. మహిళల సింగిల్స్‌లో ఎనిమిదో ర్యాంక్ క్రీడాకారిణి కరోలిన్ గార్సియాను మాడిసన్ కీస్ ఓడించింది. పురుషుల సింగిల్స్‌లో 14వ సీడ్‌గా బరిలోకి దిగిన మాజీ చాంపియన్, ప్రపంచ నంబర్ వన్ నొవాక్ జొకోవిచ్‌పై చుంగ్ హియాన్ సంచలన విజయాన్ని నమోదు చేశాడు. మరో మ్యాచ్‌లో ఐదో సీడ్ డామినిక్ థియేమ్‌పై టెనిస్ శాండ్‌గ్రీన్ గెలుపొంది క్వార్టర్ ఫైనల్స్‌లోకి అడుగుపెట్టాడు. ఈ టోర్నమెంట్ ముగిసేలోగా ఇంకెన్ని సంచలనాలు చోటు చేసుకుంటాయో చూడాలి.

క్వార్టర్ ఫైనల్స్‌లో ఎవరితో ఎవరు?

పురుషుల సింగిల్స్

రోజర్ ఫెదరర్ Vs థామస్ బెర్డిచ్
రాఫెల్ నాదల్ Vs మారిన్ సిలిక్
గ్రిగరీ దిమిత్రోవ్ Vs కేల్ ఎడ్మండ్
టెనిస్ శాండ్‌గ్రీన్ Vs చుంగ్ హియాన్

మహిళల సింగిల్స్

సిమోనా హాలెప్ Vs కరోలిన్ ప్లిస్కోవా
ఏంజెలిక్ కెర్బర్ Vs మాడిసన్ కీస్
ఎలిస్ మెర్టెన్స్ Vs ఎలినా స్విటోలినా
కార్లా సొరెజ్ నవరో Vs కరోలినా వొజ్నియాకి



ఊహించని ఓటమి.. నొవాక్ జొకోవిచ్

ఆస్ట్రేలియా ఓపెన్ గ్రాండ్ శ్లామ్ టెన్నిస్

జొకోవిచ్‌కు షాక్

మెల్బోర్న్, జనవరి 22: మోచేతి గాయం కారణంగా సుమారు ఆరు నెలలు విశ్రాంతి తీసుకొని, తిరిగి అంతర్జాతీయ సర్క్యూట్‌లోకి అడుగుపెట్టిన ప్రపంచ మాజీ నంబర్ వన్ నొవాక్ జొకోవిచ్ పోరాటం ఆస్ట్రేలియా ఓపెన్ పురుషుల సింగిల్స్ నాలుగో రౌండ్‌తో ముగిసింది. దక్షిణ కొరియాకు చెందిన చుంగ్ హియాన్‌తో జరిగిన హోరాహోరీ పోరులో జొకోవిచ్ 6-7, 5-7, 6-7 తేడాతో పరాజయాన్ని చవిచూశాడు. కెరీర్‌లో ఇప్పటి వరకూ అతను 12 గ్రాండ్ శ్లామ్ సింగిల్స్ టైటిళ్లను అందుకోగా, వాటిలో ఆరు ఆస్ట్రేలియా ఓపెన్‌లో కైవసం చేసుకున్నవే కావడం గమనార్హం. 2016లో చివరిసారి ఇక్కడ విజేతగా నిలిచిన జొకోవిచ్ ఫిట్‌నెస్‌తో పాటు ఫామ్ కోసం కూడా తీవ్రంగా ప్రయత్నిస్తున్నాడు. ఈ క్రమంలోనే అతను గాయం సమస్యను అధిగమించి, నాలుగో రౌండ్ వరకూ చేరాడు. కానీ, హియాన్ అనూహ్య విజృంభణతో కంగుతిన్నాడు. తీవ్రంగా పోరాడినప్పటికీ ఫలితం లేక, వరుస సెట్లలో ఓటమిపాలై టోర్నీ నుంచి నిష్క్రమించాడు.



అనుకోని విజయం.. చుంగ్ హియాన్

ఎవరీ హియాన్?

ఆస్ట్రేలియా ఓపెన్ ప్రారంభమైన తర్వాత మొదటిసారి ఒక పేరు టెన్నిస్ రంగంలో మారుమోగుతున్నది. ప్రపంచ మాజీ నంబర్ వన్ జొకోవిచ్ వంటి స్టార్‌ను ఓడించిన దక్షిణ కొరియా యువ ఆటగాడు హియాన్ ఒక్కసారిగా అందరి దృష్టినీ ఆకర్షించాడు. ఒక గ్రాండ్ శ్లామ్ టోర్నీలో క్వార్టర్ ఫైనల్స్ చేరడం 21 ఏళ్ల హియాన్‌కు ఇదే మొదటిసారి. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో అత్యుత్తమంగా 44వ ర్యాంక్ వరకూ చేరిన అతను ప్రస్తుతం 58వ స్థానంలో ఉన్నాడు. గత ఏడాది ఫ్రెంచ్ ఓపెన్‌లో మూడో రౌండ్‌కు చేరడం అతనికి అత్యుత్తమ ప్రదర్శనకాగా, ఇప్పుడు క్వార్టర్ ఫైనల్స్‌కు దూసుకెళ్లి, తనకు ఉజ్వల భవిష్యత్తు ఉందని నిరూపించుకున్నాడు. 2015 వింబుల్డన్‌లో మొదటి రౌండ్‌కే పరిమితమైన అతని పోరు, మరో గ్రాండ్ శ్లామ్ యుఎస్ ఓపెన్‌లో రెండు పర్యాయాలు (2015, 2017) రెండో రౌండ్ నుంచి నిష్క్రమించాడు. ఎవరూ ఊహించని విధంగా ఈ ఏడాది తొలి గ్రాండ్ శ్లామ్ ఆస్ట్రేలియా ఓపెన్‌లో క్వార్టర్ ఫైనల్స్‌లో టెనిస్ శాండ్‌గ్రీన్‌తో పోరుకు సిద్ధమవుతున్నాడు. సోమవారం జరిగిన మరో ఉత్కంఠ భరిత మ్యాచ్‌లో శాండ్‌గ్రీన్ అసాధారణ ప్రతిభ కనబరచి, ఐదో సీడ్ డామినిక్ థియేమ్‌ను 6-2, 4-6, 7-6, 6-7, 6-3 తేడాతో ఓడించి, క్వార్టర్ ఫైనల్స్ చేరాడు. సెమీస్‌లో స్థానం కోసం సంచలన వీరులు హియాన్, శాండ్‌గ్రీన్ మధ్య జరిగే పోరు ఉత్కంఠ రేపనుంది.




మాడిసన్ కీస్

కీస్ సంచలనం

మెల్బోర్న్, జనవరి 22: ఆస్ట్రేలియా ఓపెన్ గ్రాండ్ శ్లామ్ టెన్నిస్ టోర్నమెంట్ మహిళల సింగిల్స్ నాలుగో రౌండ్‌లో సంచలన విజయాన్ని నమోదు చేసిన ప్రపంచ 17వ ర్యాంక్ క్రీడాకారిణి మాడిసన్ కీస్ క్వార్టర్ ఫైనల్స్‌లో ఏంజెలిక్ కెర్బర్‌తో పోరును ఖాయం చేసుకుంది. తన కంటే మెరుగ్గా, 8వ సీడ్‌గా బరిలోకి దిగిన కారోలిన్ గార్సియాను ఆమె సోమవారం నాటి ప్రీ క్వార్టర్స్‌లో 6-3, 6-2 తేడాతో సునాయాసంగా ఓడించి, అందరినీ దిగ్భ్రాంతికి గురి చేసింది. మరో నాలుగో రౌండ్ మ్యాచ్‌లో హీచ్ సువెయ్‌ని 4-6, 7-5, 6-2 తేడాతో ఓడించిన 21వ ర్యాంకర్ కెర్బర్ కూడా క్వార్టర్ ఫైనల్స్ చేరింది. బలమైన సర్వీసులు, శక్తివంతమైన ఫోర్‌హ్యాండ్ షాట్లతో ప్రత్యర్థులపై విరుచుకుపడే కీస్, కెర్బర్ క్వార్టర్‌లో పరస్పరం ఎదురుపడడంతో, ఆ మ్యాచ్ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

టైటిల్ వేటలో హాలెప్



సిమోనా హాలెప్

మెల్బోర్న్, జనవరి 22: ఈసారి ఆస్ట్రేలియా ఓపెన్ టైటిల్ రేసులో అందరి కంటే ముందున్న ప్రపంచ నంబర్ వన్ క్రీడాకారిణి సిమోనా హాలెప్ కూడా క్వార్టర్ ఫైనల్స్‌లోకి అడుగుపెట్టింది. నాలుగో రౌండ్ మ్యాచ్‌లో ఆమె నవోమీ ఒసాకాను 6-3, 6-2 తేడాతో చిత్తుచేసింది. ఈ టోర్నమెంట్‌లో క్వార్టర్ ఫైనల్స్ చేరడం ఆమెకు ఇది మూడోసారి. ఇంతకు ముందు 2014, 2015 సంవత్సరాల్లోనూ క్వార్టర్స్ చేరింది. అయితే, సెమీస్‌కు వెళ్లలేకపోయింది. గ్రాండ్ శ్లామ్ టోర్నీల్లో అత్యుత్తమంగా ఆమె 2014, 2017 సంవత్సరాల్లో ఫ్రెంచ్ ఓపెన్ ఫైనల్స్ చేరి, రన్నరప్ ట్రోఫీతో సంతృప్తి చెందింది. 2014 వింబుల్డన్, 2015 యుఎస్ ఓపెన్‌లో ఆమె సెమీస్ నుంచి నిష్క్రమించింది.

కాగా, మహిళల సింగిల్స్‌లో జరిగిన మరో మ్యాచ్‌లో ఆరో సీడ్ కరోలినా ప్లిస్కోవా 6-7, 6-3, 6-2 తేడాతో బార్బరా స్ట్రయికోవాను ఓడించి క్వార్టర్ ఫైనల్స్ చేరింది.



టీమిండియా కోచ్ రవి శాస్త్రి, కెప్టెన్ విరాట్ కోహ్లీ

ఈ ప్రశ్నకు బదులేదీ?

జొహాన్నెస్‌బర్గ్, జనవరి 22: దక్షిణాఫ్రికా పర్యటనలో వరుసగా రెండు టెస్టులను కోల్పోయి, మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను ప్రత్యర్థికి సమర్పించుకున్న విరాట్ కోహ్లీ నాయకత్వంలోని టీమిండియా చివరిదైన మూడో టెస్టును గెల్చుకుంటుందా లేక దానినీ చేజార్చుకొని వైట్ వాష్ వేయించుకుంటుందా? అన్న ప్రశ్న అభిమానులను వేధిస్తున్నది. జరిగిన పొరపాట్లను గుర్తించి, అవి పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకుంటారా? అని అభిమానులు వేస్తున్న ప్రశ్నకు టీమిండియా మేనేజ్‌మెంట్ నుంచి సరైన సమాధానమే లేదు. క్రికెట్‌ను భుజాలపై మోస్తూ, విపరీతమైన డిమాండ్ తీసుకొచ్చిన అభిమానుల వల్లే కోట్లకు పడగలెత్తిన భారత క్రికెటర్లు చివరికి అభిమానులనే పట్టించుకోవడం లేదన్న విమర్శ ఈనాటిది కాదు. దక్షిణాఫ్రికా పర్యటనలోనూ భారత క్రికెటర్లు, ప్రత్యేకించి కెప్టెన్ కోహ్లీ టీమిండియాను సొంత జట్టుగా భావిస్తూ, ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నారన్న ఆరోపణలు లేకపోలేదు. కోట్లాది మందికి జవాబుదారీ వహించాల్సిన జట్టు ఆ దిశగా ఒక్క అడుగు కూడా వేయడం లేదన్నది వాస్తవం. స్వదేశంలో పిచ్‌లను తమకు అనుకూలంగా సిద్ధం చేయించుకొని గెలుస్తున్నారే తప్ప భారత క్రికెటర్లలో పస లేదని, విదేశాల్లో పిల్లులుగా మారిపోయి, ప్రత్యర్థులకు దాసోహమంటారని తీవ్ర స్థాయిలో విమర్శించే వారి వాదనకు ప్రస్తుతం దక్షిణాఫ్రికా టీమిండియా పరిస్థితి మరింత బలాన్నిస్తున్నదనేది ఎవరూ కాదనలేని నిజం.

ఆస్ట్రేలియా జట్టు భారత్‌లో పర్యటించినప్పుడు, స్టీవ్ స్మిత్ నిబంధనలకు వ్యతిరేకంగా ప్రవర్తించాడంటూ కోహ్లీ చేసిన ఫిర్యాదును అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) బుట్టదాఖలు చేసింది. అంపైర్ నిర్ణయాన్ని సవాలు చేసే డీఆర్‌ఎస్‌కు వెళ్లే ముందు ఆసీస్ కెప్టెన్ స్మిత్ నిబంధనలను తుంగలోతొక్కాడన్నది కోహ్లీ ఆరోపణ. ఒక కెప్టెన్ చేసిన ఫిర్యాదును ఐసీసీ పట్టించుకోలేదంటే, అందులో ఏమాత్రం బలం ఉందో స్పష్టమవుతున్నది. భారత క్రికెట్ అధికారులనుగానీ, సపోర్టింగ్ స్టాఫ్‌ను గానీ సంప్రదించకుండా, ఏకపక్షంగా వ్యవహరించిన కోహ్లీ ఏకంగా బీసీసీఐ పరువు తీశాడన్న విమర్శలున్నాయి. ఇలా ఎందుకు వ్యవహరించాడనే ప్రశ్నకు కోహ్లీనే సమాధానం చెప్పాలి. దక్షిణాఫ్రికాతో జరిగిన రెండు టెస్టుల్లో దొర్లిన పొరపాట్లను కోహ్లీ సరిదిద్దుకుంటాడో లేదో అన్న అనుమానం రావడానికి స్మిత్ ఉదంతమే కారణం. ఇటీవల ఒక ఇంటర్వ్యూలో కోహ్లీ మాట్లాడుతూ, బ్యాట్స్‌మెన్‌తోపాటు బౌలర్లు కూడా నూటికి 120 శాతం సేవలు అందించారంటూ అందరికీ కితాబునిచ్చాడు. స్వదేశంలో చక్కగా ఆడినందుకే, ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, శ్రీలంక జట్లపై టీమిండియారు తిరుగులేని ఆధిక్యాన్ని ప్రదర్శించి, సిరీస్‌లను కైవసం చేసుకుంది. ఇక 120 శాతం శ్రమిస్తే, దక్షిణాఫ్రికాలో ఎలాంటి ఫలితాలు రావాలి? రెండు టెస్టుల్లోనూ నాసిరకంగా ఆడి, సిరీస్‌ను ఎందుకు కోల్పోయింది? కోహ్లీ చేసిన ఫిర్యాదుల్లోనేకాదు.. అతని మాటల్లోనూ పస లేదన్న వాస్తవం స్పష్టంగా కనిపిస్తున్నది. పరాజయాలకు సరైన కారణాలు లేవన్న నిజాన్ని కప్పిపుచ్చుకునే ప్రయత్నంలో, విమర్శకులు సంధిస్తున్న ప్రశ్నలకు ఏదో ఒక జవాబు చెప్పి తప్పించుకోవాలని కోహ్లీ ప్రయత్నించాడని అతని వ్యాఖ్యలే స్పష్టం చేస్తున్నాయి. దక్షిణాఫ్రికా వాతావరణానికి అలవాటు పడేందుకేకాదు.. అక్కడి పిచ్‌ల తీరును పరిశీలించడానికి కూడా పనికొచ్చే ప్రాక్టీస్ మ్యాచ్‌ని కోహ్లీ బృందం ఎందుకు వద్దంది? ఈ ప్రశ్నకు ఇంత వరకూ జట్టు మేనేజ్‌మెంట్ నుంచి సమాధానం రాలేదు. అన్ని విభాగాల్లోనూ టీమిండియా విఫలమైందనేది అందరికీ తెలిసిన నిజం. ఆ వైఫల్యాల నుంచి బయటపడేందుకు ఏం చేస్తున్నారనే ప్రశ్నకు కూడా జవాబు రావడం లేదు. బుధవారం నుంచి మొదలయ్యే చివరి, మూడో టెస్టులో అనుసరించే విధానాలను, వ్యూహాలను బయటపెట్టకపోయినా, కనీసం తగిన జాగ్రత్తలు తీసుకుంటామని కూడా భారత జట్టు మేనేజ్‌మెంచ్ చెప్పకపోవడం దారుణం. తాము ఎవరికీ జవాబుదారీ కాదన్న రీతిలో టీమిండియా ఆటగాళ్లు ప్రవర్తించడం అన్యాయం. సోషల్ మీడియా ద్వారా అభిమానులు సంధిస్తున్న ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన అవసరం వారిపై ఉంది. కాదూ.. కూడదూ అంటే, చివరి మ్యాచ్‌ని గెలిచి సత్తా చాటడమేగాక, ఆతర్వాత జరిగే పరిమిత ఓవర్ల సిరీస్‌లను కూడా కొల్లగొట్టాలి. ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా, తీరును ఏమాత్రం మార్చుకోకుండా కోహ్లీ సేన ఇదే తీరును కొనసాగిస్తే, స్వదేశంలో వీరాభిమానుల నుంచే నిరసనలు ఎదుర్కోవాల్సి వస్తుంది.

అది సరైన నిర్ణయమే

రహానేకు విశ్రాంతిపై కోచ్ రవి శాస్త్రి స్పష్టీకరణ

జొహాన్నెస్‌బర్గ్, జనవరి 22: దక్షిణాఫ్రికాతో జరిగిన మొదటి రెండు టెస్టుల్లో బ్యాట్స్‌మన్ అజింక్య రహానేను ప్లేయింగ్ ఎలెవెన్‌లోకి తీసుకోకపోవడాన్ని టీమిండియా కోచ్ రవి శాస్త్రి సమర్థించుకున్నాడు. జట్టు మేనేజ్‌మెంట్ తీసుకున్న నిర్ణయం సరైనదేనని సోమవారం ఇక్కడ విలేఖరులతో మాట్లాడుతూ వ్యాఖ్యానించాడు. స్వదేశంలో జరిగిన సిరీస్‌ల్లో రోహిత్ శర్మ ఏ విధంగా రాణించాడో అందరికీ తెలుసునని, ఆ ఫామ్‌ను దృష్టిలో ఉంచుకొని అతనికి అవకాశం ఇచ్చామని అన్నాడు. ఒకవేళ రహానేను తుది జట్టులోకి తీసుకొని, అతను సరిగ్గా ఆడలేకపోతే, రోహిత్‌ను ఎందుకు తీసుకోలేదని అంతా తమను ప్రశ్నించేవారని అన్నాడు. విమర్శించడం చాలా సులభమని, పరిస్థితులను బట్టి నిర్ణయాలు తీసుకుంటామే తప్ప వ్యక్తులను బట్టి కాదని చెప్పాడు. ఈ విషయంలో జట్టు మేనేజ్‌మెంట్‌పై వస్తున్న విమర్శలను అతను తోసిపుచ్చాడు. విమర్శకులంతా ఏదో ఒకటి మాట్లాడుతునే ఉంటారని, అది వారి నైజమని వ్యాఖ్యానించాడు. అలాంటి వారి మాటలను పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నాడు. వాతావరణం, పిచ్ తీరు, ప్రత్యర్థి జట్టు బలాబలాలు వంటి అంశాల ఆధారంగానే తుది జట్టు కూర్పు ఉంటుందని రవి శాస్త్రి తెలిపాడు.

ముందుగానే వచ్చి వుంటే...

దక్షిణాఫ్రికాకు కనీసం పదిపదిహేను రోజులు ముందుగానే వచ్చివుంటే, పరిస్థితి కొంత మెరుగ్గా ఉండేదని రవి శాస్త్రి అభిప్రాయపడ్డాడు. ఈ నెల 5న మొదటి టెస్టు ప్రారంభంకాగా, అంతకు వారం రోజుల ముందే భారత జట్టు దక్షిణాఫ్రికాలో అడుగుపెట్టింది. అయితే, మరో రెండు వారాల ముందుగానే వచ్చివుంటే, ఇక్కడి వాతావరణానికి అలవాటు పడి ఉండేవాళ్లమని రవి శాస్త్రి అన్నాడు. భారత జట్టు ఆటగాళ్లు పాఠశాల పిల్లల మాదిరిగా పొరపాట్లు చేశారని ఒక ప్రశ్నకు సమాధానంగా అతను చెప్పాడు. ప్రత్యేకంగా రనౌట్లను ప్రస్తావిస్తూ, అనవసరంగా వికెట్లు పారేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు. బుధవారం నుంచి మొదలయ్యే చివరి, మూడో టెస్టులో దక్షిణాఫ్రికాకు గట్టి పోటీనిస్తామని ధీమా వ్యక్తం చేశాడు.

ఏప్రిల్‌లో 11వ ఐపీఎల్


న్యూఢిల్లీ, జనవరి 22: ఈ ఏడాది జరిగే 11వ ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) టీ-20 క్రికెట్ టోర్నమెంట్ ఏప్రిల్ 7న మొదలవుతుంది. టోర్నీ పాలక మండలి సోమవారం ప్రకటించిన వివరాల ప్రకారం, 11వ ఐపీఎల్ ఏప్రిల్ 7న మొదలై మే 27న ముగుస్తుంది. మన దేశంలోనేగాక, యావత్ ప్రపంచంలోనూ అత్యధిక ఆదాయాన్ని సంపాదించిపెట్టే టోర్నమెంట్‌గా గుర్తింపు పొందిన ఐపీఎల్‌లో ఈసారి మొదటి మ్యాచ్‌కి ముంబయి ఆతిథ్యమిస్తుంది. కాగా, మ్యాచ్‌లు మొదలయ్యే సమయాలను కూడా ఐపీఎల్ గవర్నింగ్ బాడీ మార్చింది. ఇంతకు ముందు డే మ్యాచ్‌లు సాయంత్రం 4 గంటలకు, డే/నైట్ మ్యాచ్‌లు రాత్రి 8 గంటలకు మొదలయ్యేవి. అయితే, బ్రాడ్‌కాస్టర్ల విజ్ఞప్తి మేరకు డే మ్యాచ్‌లను సాయంత్రం 5.30 గంటలకు, డే/నైట్ మ్యాచ్‌లను రాత్రి 7 గంటలకు మొదలుపెట్టనున్నట్టు ఐపీఎల్ చైర్మన్ రాజీవ్ శుక్లా ఒక ప్రకటనలో తెలిపాడు. కింగ్స్ ఎలెవెన్ పంజాబ్ తన హోం గేమ్స్‌లో నాలుగు మ్యాచ్‌లను మొహాలీలో, మూడు మ్యాచ్‌లను ఇండోర్‌లో ఆడుతుందని అతను తెలిపాడు. రెండేళ్ల సస్పెన్షన్‌ను ముగించుకొని, మళ్లీ ఐపీఎల్‌లోకి అడుగుపెట్టిన రాజస్థాన్ రాయల్స్ హోం గేమ్స్ వేదికను ఇంకా ఖరారు చేయలేదని తెలిపాడు. ప్రస్తుతం రాజస్థాన్ హైకోర్టులో కేసు నడుస్తున్నదని, 24వ తేదీన తీర్పు వెలువడిన తర్వాత వేదికలను ఖాయం చేస్తామని శుక్లా వివరించాడు. ఈనెల 27, 28 తేదీల్లో జరిగే ఐపిఎల్ వేలంలో మొత్తం 578 మంది ఆటగాళ్లు తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటారని వివరించాడు.

ఇండోనేషియా టోర్నీపై సింధు, శ్రీకాంత్ కన్ను

జకార్తా, జనవరి 22: ఇండోనేషియా మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్-500 టోర్నీపై భారత బ్యాడ్మింటన్ స్టార్లు పీవీ సింధు, కిడాంబి శ్రీకాంత్ కన్నేశారు. మంగళవారం నుండి జరిగే ఈ టోర్నీ ద్వారా విజేతలకు 350,000 డాలర్లు దక్కుతాయి. గత సీజన్‌లో ఆడిన వివిధ టోర్నీల్లో మిశ్రమ ఫలితాలు కనబరిచిన ఈ ఇద్దరూ రానున్న సీజన్‌ను కూడా విజయవంతం చేయాలని ఉవ్విళ్లూరుతున్నారు. ఇండోనేషియాకు చెందిన హన్నా రమదిని, మలేషియాకు చెందిన జుల్ఫ ఫదిల్ జుల్‌కిఫ్‌లీతో వేర్వేరుగా తలపడతారు. గత సీజన్‌లో సింధు మూడు టైటిళ్లతోపాటు మూడు కాంస్య పతకాలు సాధించగా, శ్రీకాంత్ అందరి అంచనాలను అధిగమించి నాలుగు టైటిళ్లు కైవసం చేసుకున్నాడు. అదే ఉత్సాహంతో ఇండోనేషియా టోర్నీలో ఆడి సత్తా చాటుతామని వారు పేర్కొన్నారు.

బొపన్న జోడీ పరాజయం

మెల్బోర్న్, జనవరి 22: ఆస్ట్రేలియా ఓపెన్ టెన్నిస్ మ్యాచ్‌లో భారత జోడి రోహన్ బొపన్న, దివిజ్ శరణ్ పరాజయం ఓటమి చెందారు. సోమవారం ఇక్కడ జరిగిన డబుల్స్ మూడో రౌండ్‌లో ఫ్రాన్స్‌కు చెందిన ఎడ్వర్డ్ రోజర్ వాజలిన్‌తో కలసి ఆడిన బొపన్న జోడి ఆస్ట్రియాకు చెందిన వలివర్ మరచ్, క్రొయేషికాకు చెందిన మాట్ పెవిక్ చేతిలో 6-4, 7-6 (7-5), 3-6 తేడాతో పరాజయం చెందారు. అదేవిధంగా దివిజ్ శరణ్, అమెరికాకు చెందిన రాజీవ్ రామ్‌తో కలిసి ఆడిన మూడో రౌండ్‌లో పోలాండ్‌కు చెందిన లుకాజ్ కుబొట్, బ్రెజిల్‌కు చెందిన మార్సిలో మెలో చేతిలో ఓడారు.



రోజర్ ఫెదరర్

టైటిల్ దిశగా ఫెదరర్

మెల్బోర్న్, జనవరి 22: కెరీర్‌లో మొత్తం 19 గ్రాండ్ శ్లామ్ సింగిల్స్ టైటిళ్లతో రికార్డు సృష్టించిన స్విట్జర్లాండ్ వీరుడు, రెండో ర్యాంక్ ఆటగాడు రోజర్ ఫెదరర్ ఈసారి ఆస్ట్రేలియా ఓపెన్ టైటిల్‌ను నిలబెట్టుకునే దిశగా మరో అడుగు ముందుకేశాడు. పురుషుల సింగిల్స్ నాలుగో రౌండ్‌లో అతను మార్టన్ ఫొస్కోవిక్స్‌ను 6-4, 7-6, 6-2 తేడాతో ఓడించాడు. రెండో సెట్‌లో కొంత సేపు తీవ్రంగా ప్రతిఘటించాల్సిన అవసరాన్ని పక్కకుపెడితే, ఈ మ్యాచ్ మొదటి నుంచి చివరి వరకూ అతను ఆధిపత్యం కనబరిచాడు. 14వ సారి ఆస్ట్రేలియా ఓపెన్ క్వార్టర్స్ చేరిన అతను సెమీస్‌కు వెళ్లేందుకు 19వ ర్యాంక్ ఆటగాడు థామస్ బెర్డిచ్‌ని ఢీ కొంటాడు. నాలుగో రౌండ్‌లో సోమవారం జరిగిన మరో మ్యాచ్‌లో బెర్డిచ్ 6-1, 6-4, 6-4 తేడాతో ఫాబియో ఫోగ్నినీపై విజయం సాధించాడు.

ఐసీసీ అండర్-19 వరల్డ్ కప్

సెమీస్‌కు కెనడా, జింబాబ్వే

క్రైస్‌చర్చ్, జనవరి 22: ఐసీసీ అండర్-19 టోర్నీలో కెనడా, జింబాబ్వే జట్లు సెమీ ఫైనల్స్‌లోకి దూసుకెళ్లాయి. పపువా న్యూ గునియా, నమీబియాతో సోమవారం జరిగిన వేర్వేరు మ్యాచ్‌లలో ఆ రెండు జట్లు విజయం సాధించాయి. కెనడా ఆల్‌రౌండర్ ఆకాశ్ గిల్ తన అద్భుత సెంచరీతో జట్టును విజయపథంలోకి తీసుకెళ్లగా, అందుకు ప్రతిగా పపువా న్యూ గునియా కేవలం 80 పరుగులు చేయగలిగింది. అదేవిధంగా నమీబియాను జింబాబ్వే ఏడు వికెట్ల తేడాతో ఓడించింది.

ఇంగ్లాండ్‌తో నేడు ఆస్ట్రేలియా ఢీ

ఐసీసీ అండర్-19 ప్రపంచ కప్ సూపర్ లీగ్ క్వార్టర్ ఫైనల్స్‌లో ఇంగ్లాండ్‌ను ఆస్ట్రేలియా ఢీకొననుంది. టోర్నీ ప్రథమార్ధంలో భారత్ చేతిలో 100 పరుగుల తేడాతో ఓడిపోయిన ఆస్ట్రేలియా, ఇప్పటికే మూడు లీగ్ మ్యాచ్‌లలో ముందున్న ఇంగ్లాండ్‌తో తలపడుతుంది. ఇరు జట్లు గెలుపుపై ధీమాను వ్యక్తం చేస్తున్నాయి. క్వార్టర్ ఫైనల్స్‌లో తమ సత్తా చూపుతామని ఆస్ట్రేలియా కెప్టెన్ జసోన్ సంగ అన్నాడు. 15 సభ్యులు గల తమ టీమ్ సమష్టిగా ఆడి విజయం సాధించగలమన్నాడు. ఇంగ్లాండ్ కెప్టెన్ హారీ బుక్ మాట్లాడుతూ తమ జట్టు ఆస్ట్రేలియాతో పోరుకు సంసిద్ధంగా ఉందని అన్నాడు.

సయ్యద్ ముస్తాక్ అలీ క్రికెట్

ముంబయిపై పంజాబ్ గెలుపు

కోల్‌కతా, జనవరి 22: సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ టీ-20 క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా సోమవారం జరిగిన మొదటి మ్యాచ్‌లో పంజాబ్ మూడు వికెట్ల తేడాతో ముంబయిపై విజయం సాధించింది. జాతీయ జట్టులో చోటు సంపాదించుకోలేకపోయిన యువరాజ్ సింగ్ 34 బంతుల్లోనే 40 పరుగులు సాధించి, పంజాబ్ విజయానికి తోడ్పడ్డాడు. తొలుత బ్యాటింగ్‌కు దిగిన ముంబయి 20 ఓవర్లలో నాలుగు వికెట్లు కోల్పోయి 198 పరుగులు చేసింది. శ్రేయాస్ అయ్యర్ 79, అఖిల్ హెర్వాద్కర్ 42 చొప్పున పరుగులు సాధించారు. అనంతరం పంజాబ్ 19.2 ఓవర్లలో ఏడు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. గుర్‌కీరత్ మాన్ 43, మానన్ వోహ్రా 42, యువరాజ్ సింగ్ 40 చొప్పున పరుగులు చేశారు. ముంబయి బౌలర్ శివమ్ దూబే 27 పరుగులకు మూడు వికెట్లు కూల్చాడు.

మరో మ్యాచ్‌లో జార్ఖండ్‌పై రాజస్థాన్ నాలుగు వికెట్ల తేడాతో గెలిచింది. జార్ఖండ్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 157 పరుగులు చేసింది. విరాట్ సింగ్ 43, ఇషాన్ కిషన్ 39 చొప్పున పరుగులు సాధించారు. రాజస్థాన్ బౌలర్లు ఆదిత్య గర్వాల్ 15 పరుగులకు రెండు, దీపక్ చాహర్ 35 పరుగులకు రెండు వికెట్లు కూల్చారు. అనంతరం రాజస్థాన్ 19.1 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 158 పరుగులు సాధించి, విజయాన్ని నమోదు చేసింది. ఆదిత్య గర్వాల్ 43, సల్మాన్ ఖాన్ 34, దీపక్ చాహర్ 20 (నాటౌట్) చొప్పున పరుగులు చేసి, రాజస్థాన్‌ను నాలుగు వికెట్ల తేడాతో గెలిపించారు.

కాగా, ఆదివారం జరిగిన మరో రెండు మ్యాచ్‌లో బెంగాల్‌ను ఉత్తర ప్రదేశ్ 75 పరుగుల తేడాతో ఓడించింది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన ఈ జట్టు 20 ఓవర్లలో 3 వికెట్లకు 235 పరుగులు చేసింది. అనంతరం బెంగాల్‌ను 16.1 ఓవర్లలో 160 పరుగులకే ఆలౌట్ చేయగలిగింది.

సియెట్‌తో హర్మన్‌ప్రీత్ ఒప్పందం

న్యూఢిల్లీ, జనవరి 22: అసాధారణ నైపుణ్యంతో భారత జట్టును గత ఏడాది జరిగిన అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) మహిళల వరల్డ్ కప్‌లో ఫైనల్ చేర్చిన మహిళా క్రికెటర్ హర్మన్‌ప్రీత్ కౌర్ అరుదైన అవకాశాన్ని అందిపుచ్చుకుంది. సియెట్‌తో బ్యాట్ ఎండార్స్‌మెంట్‌పై సంతకం చేసింది. ఆ సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్న తొలి భారత మహిళా క్రికెటర్‌గా గుర్తింపు పొందింది. సియెట్‌తో ఆమె కాంట్రాక్టు రెండేళ్లు ఉంటుంది. రోహిత్ శర్మ, అజింక్య రహానే, ఇషాన్ కిషన్ సియెట్ బ్యాట్ ఎండార్స్‌మెంట్‌పై సంతకాలు చేసిన వారిలో ఉన్నారు. ఇప్పుడు వీరి సరసన హర్మన్‌ప్రీత్ కూడా చేరింది. ఈ ఒప్పందాన్ని అనుసరించి రెండేళ్లపాటు అన్ని ఫార్మాట్స్‌లో, ప్రతి మ్యాచ్‌లోనూ ఆమె సియెట్ స్పాన్సర్‌షిప్‌ను గుర్తు చేసే రీతిలో, ఆ సంస్థ స్టికర్ అంటించిన బ్యాట్లనే ఉపయోగించాల్సి ఉంటుంది. అటు టెస్టుల్లో, ఇటు పరిమిత ఓవర్ల ఫార్మాట్స్‌లో నిలకడగా రాణిస్తున్న హర్మన్‌ప్రీత్ భారత క్రికెట్ జట్టులో కీలక భూమిక పోషిస్తున్నది.

పాక్‌తో తొలి టీ-20

న్యూజిలాండ్ విజయభేరి

వెల్లింగ్టన్, జనవరి 22: న్యూజిలాండ్‌తో ఇక్కడ సోమవారం జరిగిన తొలి టీ-20 మ్యాచ్‌లో పాకిస్తాన్ ఓటమిపాలైంది. టాస్ గెలిచిన న్యూజిలాండ్ బౌలింగ్ ఎంచుకోగా బ్యాటింగ్‌కు దిగిన పాక్ 19.4 ఓవర్లలో 105 పరుగులు చేసింది. అందుకు సమాధానంగా న్యూజిలాండ్ 15.5 ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 106 పరుగులు చేసింది. పాక్ జట్టులో బాబర్ ఆజం అత్యధికంగా 41 పరుగులు చేశాడు. కాగా, న్యూజిలాండ్ జట్టులో కొలిన్ మున్రో 49 పరుగులతో నాటౌట్‌గా నిలిచి జట్టును గెలిపించాడు.

Printed and Published from Vijayawada by K.Sudhakar on behalf of Deccan Chronicle Holdings Limited at Deccan Chronicle Holdings Press, No.C 3 & 4, Patamata, Industrial Estate, Vijayawada. Chief Editor T.V.Ravi Reddy, Phones:2555284,2555185,2555287 Regd. No.AP/VJA/41/51/2000. RNI Registration No.52743/90

వెన్నెల
ఆంధ్రభూమి
మంగళవారం, 23 జనవరి 2018

రివ్యూ 11లో

12









స్పీడ్ పెంచేసింది!

తెలుగు చిత్రసీమలో ఇప్పుడు ఎవ్వరినోటా విన్నా అందాల భామ అను ఇమ్మాన్యుయేల్ గురించే. చూస్తుండగానే ఈ బ్యూటీ స్టార్ హీరోల సరసన చేరిపోయింది. గ్లామర్‌తో పాటు నటనలోనూ మెరుపులు కురిపిస్తూ అటు చిత్రసీమను, ఇటు ప్రేక్షకులను తన వైపునకు మళ్లేలా చేసుకుంది. వస్తున్న అవకాశాల్లో తనకు నచ్చినవి ఎంచుకుంటూ కెరీర్‌లో మెరుపు వేగంతో దూసుకువెళుతోంది. అంతేకాదు, స్టార్ హీరోల చిత్రాలు చేస్తూ స్పీడ్ పెంచేసి అందర్నీ ఆశ్చర్యపడేలా చేస్తోంది. మంచి అవకాశాలను అందుకుంటూ కెరీర్ రేస్‌లో తిరుగులేని తారగా పేరుతెచ్చుకుంటోంది. స్టార్ హీరోల సరసన నటించడం తన అదృష్టమని కూడా చెబుతోంది. కెరీర్ ఎలా ఉంది? అని అనును కదిలిస్తే- ''చాలా హ్యాపీగా ఉంది. తెలుగులో మంచి మంచి అవకాశాలు వస్తున్నాయి. అనతి కాలంలో స్టార్ హీరోలతో చిత్రాలు చేసే అవకాశం లభించింది. ఇది నిజంగా నా అదృష్టమనే చెప్పాలి. పరిశ్రమకొచ్చిన అతి తక్కువ సమయంలోనే నాకు ఇలాంటి అవకాశాలు రావడం అంతకంటే ఆనందమేముంటుంది చెప్పండి? తాజాగా నేను చేస్తున్న చిత్రాలు చూస్తుంటే ఎంతో ఆనందం కలుగుతోంది. టాలీవుడ్ ప్రోత్సాహం, తెలుగు ప్రేక్షకుల ఆదరణ నేను ఎన్నటికీ మరచిపోలేను''అంటూ ఎంతో సంతోషంగా చెబుతున్న అను ఇమ్మాన్యుయేల్ తాజాగా పవర్‌స్టార్ పవన్‌కళ్యాణ్ సరసన త్రివిక్రమ్ దర్శకత్వంలో రూపుదిద్దుకున్న 'అజ్ఞాతవాసి'లో నటించింది. ఈ చిత్రం ఈ సంక్రాంతికే ప్రేక్షకుల మందుకొచ్చింది. చిత్రం ఎలా వున్నా, గ్లామర్ తారగా ఈ బ్యూటీకి మంచి క్రేజే ఏర్పడింది. ఈ చిత్రంతో పాటు మరో నాలుగు సినిమాల్లోనూ యువతరం క్రేజీ స్టార్‌తో నటించడానికి గ్రీన్ సిగ్నల్ కూడా ఇచ్చింది. అక్కినేని నాగచైతన్యకు జోడీగా నటించే ఓ చిత్రం ఇటీవలే పట్టాలెక్కింది. మారుతి దర్శకత్వంలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై తెరకెక్కనున్న ఈ సినిమా ఇటీవలే హైదరాబాద్‌లో ప్రారంభమైంది కూడా. ఈ చిత్రానికి సూర్యదేవర నాగవంశీ నిర్మాత. ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ త్వరలోనే మొదలు కానుంది, మారుతి-నాగచైతన్యల కాంబినేషన్‌లో వస్తున్న ఈ చిత్రం విభిన్నమైన కథాంశంతో రూపుదిద్దుకోనుందట. ఇందులో అందాల భామ అను ఇమ్మాన్యుయేల్ పాత్రకు ఎంతో ప్రాధాన్యం ఉంటుందని దర్శక, నిర్మాతలు చెబుతున్నారు. సో.. 2018 ఆరంభమే అనుకు అదిరిపోయేలా అదృష్టం కలిసొచ్చిం దన్నమాట! ఇప్పుడు మలయాళం, తెలుగు, తమిళం అంటూ అన్ని భాషల్లోనూ మంచి అవకాశా లను అంది పుచ్చుకుంటోంది. రాబోయే సీజన్ అంతా తనదేనంటూ ఎంతో హుషారుగా గట్టి నమ్మకంతో చెబుతోంది.

★

> **''తెలుగులో మంచి మంచి అవకాశాలు వస్తున్నాయి. అనతి కాలంలో స్టార్ హీరోలతో చిత్రాలు చేసే అవకాశం లభించింది. ఇది నిజంగా నా అదృష్టమనే చెప్పాలి. పరిశ్రమకొచ్చిన అతి తక్కువ సమయంలోనే నాకు ఇలాంటి అవకాశాలు రావడం అంతకంటే ఆనందమేముంటుంది? ఒకసారి కలిసి పని చేసిన దర్శకుడు రెండోసారి పిలవడం అనేది గొప్ప గౌరవం. అటువంటి అవకాశం తెలుగులో నాకు ఇంకా రాలేదు. భవిష్యత్తులో తప్పకుండా వస్తుందని ఆశిస్తున్నా. కెరీర్ ఆరంభంలో మలయాళంలో నాకు ఇటువంటి అవకాశం వచ్చినట్టే వచ్చి చేజారిపోయింది. తాజాగా నేను చేస్తున్న చిత్రాలు చూస్తుంటే ఎంతో ఆనందం కలుగుతోంది. టాలీవుడ్ ప్రోత్సాహం, తెలుగు ప్రేక్షకుల ఆదరణ నేను ఎన్నటికీ మరచిపోలేను''**

మెహరీన్ మెరుపులు!

తెలుగు చిత్రసీమలోకి అడుగుపెట్టి రెండేళ్లయినా నిండకముందే వరుస అవకాశాలతో వెండితెరపై మెరుపులు కురిపిస్తోంది బ్యూటీ మెహరీన్. తొలి సినిమా 'కృష్ణగాడి వీర ప్రేమగాథ' (2016)లో మహాలక్ష్మిగా చక్కటి నటనను కనబరిచి అందరి మనసుల్ని గెలుచుకుంది. అమ్మాయి భలే ఉందంటూ విమర్శకులు సైతం ప్రశంసల వర్షం కురించారు. కథానాయికగా అలా పేరు తెచ్చుకున్నా, ఎందుకోగానీ అవకాశాలు మాత్రం పుంజుకోలేదు. 2016 చివరికి వచ్చే సరికి మెహరీన్ కెరీర్ జోరందుకుంది. వరుస ఆఫర్లు క్యూ కట్టాయి. ఇక కెరీర్‌లో తనకు ఎదురేలేదనుకుంది. అదే ఉత్సాహంతో, ఆనందంతో 2017ను ఎంతో తెలివిగా ఆటాడేసుకుంది. వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకుని నటనలో మెరుపులు కురిపించి తన అందంతో యువతరం మనసుల్ని కొల్లగొట్టేసింది. అదే జోరును కొనసాగిస్తూ కెరీర్‌లో రివ్వున దూసుకెళ్లింది. 2017లో వరుసగా 'మహానుభావుడు'లో మేఘనగా, 'రాజా ది గ్రేట్'లో లక్కీగా, 'కేరాఫ్ సూర్య'లో జననిగా, 'జవాన్'లో భార్గవిగా తన ప్రతాపాన్ని చూపి టాలీవుడ్‌ను తనవైపునకు తిప్పుకుంది. మోడలింగ్ నుంచి వెండితెరపై అడుగుపెట్టిన ఈ సుందరాంగి తొలి సినిమా తర్వాత నటిగా మంచి మార్కుల్నే కొట్టేసినా, కాస్త గ్యాప్ రావడంతో ఎంతో ఫీలయింది. అవకాశాలు ఎందుకు దరిచేరలేదో అస్సలు తనకి అర్థం కాలేదు. ఎక్కడ పొరపాటు జరిగిందో కూడా ఊహించలేదు. 2016 ఫిబ్రవరిలో తొలి చిత్రం విడుదలయింది. అదే సంవత్సరం నవంబర్‌లో తమిళ సినిమా ఆడిషన్ కోసం పిలుపు వచ్చింది. ఆ తర్వాత నెలలో టాలీవుడ్‌లో నాలుగు సినిమాలకు సంతకాలు చేసింది. 2017ను ఎంతో బిజీ బిజీగానే గడిపేసింది. పంజాబ్ బఠిండాలో పుట్టిన మెహరీన్ ఢిల్లీలో సెటిలయింది. అక్కడే ఫస్ట్ దాకా చదువుకుంది. ఎన్‌సిసి, ఎడ్వెంచర్ స్పోర్ట్స్, ట్రెక్కింగ్ అంటే అమితంగా ఇష్టపడే ఈ బ్యూటీ వాటిలో పాల్గొని మెడల్స్ అందుకుంది. అంతటితో ఆగకుండా భరతనాట్యంలోనూ శిక్షణ పొందింది. ప్లస్ టూ తర్వాత అండర్ గ్రాడ్యుయేషన్ కోసం అమెరికా వెళ్లింది. అమెరికా వెళ్లి మెహరీన్ ఎందుకనో అక్కడి కాలేజీలో చేరలేక పోయింది. కెనడా వెళ్లి బిజినెస్, ఎకనామిక్స్‌లో అండర్ గాడ్యుయేషన్‌లో చేరింది. అక్కడ చదువే లోకం. ఇంకో పని ఉండేది కాదు. దాంతో బాగా బరువు పెరిగిపోయింది. అప్పుడు దక్షిణాసియా వారికే అందాల పోటీ నిర్వహించారు. వాళ్ల అమ్మ ప్రోత్సాహంతో వెళ్లాలనుకుంది. అటువంటి చోటికి వెళ్తేనన్నా నాజూగ్గా తయారవ్వాలన్న ఆలోచన వస్తుందన్నది వాళ్ల అమ్మ అభిప్రాయం. గెలుస్తానని వెళ్లిన మెహరీన్ 'మిస్ పర్సనాలిటీ సౌత్ ఏషియా కెనడా 2013' కిరీటం అందుకో గలిగింది. మెహరీన్‌కు అది మరచిపోలేని అనుభవంగా మిగిలిపోయింది. ఈ పోటీల్లో లభించిన ప్రోత్సాహంతో ఆమెలో ఆత్మ విశ్వాసం పెంచింది. అందాల పోటీల్లో గెలిచాక సినిమాల్లో నటించాలన్న ఆలోచన కలిగింది మెహరీన్‌కు. కెనడాలో వుండగా రెండు వాణిజ్య ప్రకటనలు చేసింది. చదువు ఆపేసి ఇండియా వచ్చేసింది. ఆ తర్వాత ఇక్కడ ఎన్నో కమర్షియల్స్ చేసింది. అప్పుడే మెహరీన్‌ను చూసిన దర్శకుడు ఆడిషన్‌కు పిలిచాడు. ఆ చిత్రం గురించి తెలిసిందే. అదే 'కృష్ణగాడి వీర ప్రేమగాథ'. ఆ తర్వాత ఒకేసారి టాలీవుడ్‌లో నాలుగు సినిమాలకు పనిచేయడం చాలా కష్టం అనిపించింది. విశ్రాంతి, విరామం లేకుండా పనీ, ప్రయాణాలతో గడిచిపోయింది. సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్న అమ్మ మాటల్ని ప్రతిరోజూ ఉదయం గుర్తు చేసుకునేది. అవకాశాలు వచ్చాయి కదా అని ప్రతి సినిమానూ ఒప్పేసుకోలేదు. జాగ్రత్త పడింది. ఆచితూచి అడుగులు వేసింది. మంచి కథలు ఎంచుకోవాలన్నదే తన ప్రయత్నం అని చెప్పేది. ఇలాంటి మెహరీన్‌కు కోరికంటూ ఒకటుందిట. టాలీవుడ్‌లో ఫలానా కాలాన్ని 'మెహరీన్ శకం'గా చెప్పుకునేలా గుర్తింపు తెచ్చుకోవాలన్నదేనట! వినటానికి ఆశ్చర్యంగా వున్నా ఇదే తన కోరిక, కల అని మిత్రులతో పంచుకుంటుందిట.

- కరిష్మా





మా సినిమా ఇష్టం!


టికెట్ల నిర్ణయాధికారం నిర్మాతలదే!

సగటు మనిషికి అందుబాటులో వుండే ఏకైక వినోద సాధనం సినిమా. కానీ అది రానురాను అందరాని చందమామగా మారుతోంది. సగటు, మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి ప్రేక్షకులు ఒక సినిమా చూడటానికి కుటుంబ సమేతంగా వెళ్లాలంటే వెయ్యి రూపాయల నోటు ఖర్చయిపోవాల్సిన పరిస్థితి..

ఒక మామూలు కుటుంబానికి ఇది సాధ్యమా?

ఇంత ఖర్చుపెట్టి సినిమా చూడాల్సిన అవసరం అతనికుంటుందా? అని ఎవరైనా ప్రశ్నిస్తే ఆ ప్రశ్నకు సమాధానం ఎవరూ ఇవ్వలేని పరిస్థితి..! ఇప్పటికే ఉన్న ధరలను పెట్టి సినిమాలు చూడడం తగ్గించుకున్న సగటు ప్రేక్షకుల నెత్తిన మరోసారి పిడుగుపాటులాంటి వార్త ఏంటో తెలుసా? రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ సినిమా టికెట్ల ధరలను పెంచుకోవడానికి థియేటర్లకు అనుమతిస్తూ ఉమ్మడి హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. సంక్రాంతి సీజన్‌లో విడుదలయిన పెద్ద సినిమాలను చాలా ఎక్కువ రేట్లకు కొన్నాం, ఆ డబ్బు తిరిగి రాబట్టుకోవాలంటే ప్రస్తుతం వున్న టికెట్ల ధరలు సరిపోవు, కాబట్టి టిక్లెట్ల ధరలను పెంచుకునేందుకు అనుమతివ్వాలని రెండు తెలుగు రాష్ట్రాల్లోని కొన్ని థియేటర్ల యాజమాన్యాలు వేసిన పిటిషన్‌ను హైకోర్టు పరిశీలించి ధరలను పెంచుకోవచ్చని అనుమతినిచ్చింది. ఈ ప్రభుత్వాలు ఈ టిక్కెట్ల ధరల గురించి మార్గదర్శకాలు, ఏవైనా నిర్ణయాలు తీసుకుని అమలుపరిచేంతవరకు ప్రస్తుతం పెంచుతున్న ఈ ధరలను ఇలాగే కొనసాగించుకోవచ్చని హైకోర్టు తన తీర్పులో పేర్కొన్నట్లు తెలుస్తుంది.

గతంలో మాదిరిగా విడుదలైన సినిమాలన్నింటినీ చూడలేకపోతున్నాం, కనీసం సంక్రాంతి పండగకైనా కుటుంబ సమేతంగా సినిమా చూద్దాం అని కలలుగన్న సగటు ప్రేక్షకులకు ఇది అశనిపాతంగానే మారింది. గత సంవత్సరకాలంగా టిక్కెట్ల ధరలను పెంచుకునేందుకు థియేటర్ల యాజమాన్యాలు ప్రయత్నిస్తూనే ఉన్నాయి. కానీ సినీ పరిశ్రమలోని చిన్న నిర్మాతల అభ్యర్థన మేరకు ప్రభుత్వాలు ఈ పెంపు విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకోవడంలేదు. ఆ మధ్య తెలంగాణ ప్రభుత్వం తరపున సంబంధిత శాఖ అధికారులు టికెట్ల ధరలను పెంచుతున్నట్లు అకస్మాత్తుగా ప్రకటించగా తెలంగాణ ముఖ్యమంత్రి కెసిఆర్ ఆ ప్రకటనపై ఆగ్రహం వెలిబుచ్చి సదరు ప్రయత్నాలకు కళ్లెం వేశారు. ఇలా ప్రభుత్వాలు తమ విన్నపాలను వినిపించుకోవడంలేదని థియేటర్ల యాజమాన్యం హైకోర్టును ఆశ్రయించడం, ఆ మేరకు జస్టిస్ ఎస్.వి.భట్‌గారు పై ఉత్తర్వులు జారీ చేయడం జరిగింది.ఇక్కడే ఒక ధర్మబద్ధమైన సందేహం.. న్యాయమైన ప్రశ్న ఒకటి ఉద్భవిస్తుంది.



సినిమా టికెట్ల ధరలను నిర్ణయించాల్సింది సినిమాను తీసిన నిర్మాతనా? ఆ సినిమాను ప్రదర్శించే ఎగ్జిబిటరా? ప్రభుత్వమా? హైకోర్టా? తప్పనిసరిగా నిర్ణయాధికారం నిర్మాతకే వుండాలి. ఎందుకంటే సదరు సినిమా అనే వస్తువును తయారుచేసింది నిర్మాత కాబట్టి! సమాజంలో గుండు సూది దగ్గరనుంచి టీవీనో, కారునో,

- బాబ్జీ, సినీ దర్శకుడు

మరే ఇతర వస్తువునో ఎవరైతే తయారు చేస్తాడో ఆ తయారీదారుడే ఆ వస్తువు రేటును నిర్ణయించి అమ్ముకుంటాడు? కానీ ఆరుగాలం కష్టపడి రెక్కలు ముక్కలు చేసుకొని పంటను పండించే రైతుకు, అష్టకష్టాలు పడి తన జీవితాన్నే ఫణంగా పెట్టి సినిమాలను నిర్మించే నిర్మాతకు మాత్రం ఆ హక్కు ఉండడం లేదు. ఆ నిర్ణయాధికారం వుండడం లేదు. అందువలననే రైతులు, నిర్మాతలు తీవ్రంగా నష్టపోతూ భవిష్యత్తు లేని జీవితాలను గడుపుతున్నారు. యాభై కోట్లో, వంద కోట్లో, రెండు వందల కోట్లో పెట్టి పెద్ద పెద్ద స్టార్ హీరోలతో తీసిన సినిమాలను చూడటానికి ఎంత రేటైనా పెట్టడానికి ప్రేక్షకుడు సై అంటాడు. కానీ.. తక్కువ బడ్జెట్‌తో రూపొందించిన ఒక చిన్న హీరో లేదా కొత్త హీరోల సినిమాలను ఎక్కువ రేటు పెట్టి చూడటానికి ఏ ప్రేక్షకుడు ఇష్టపడతాడు? సగటుప్రేక్షకుడు అసలు ఈ ఆలోచనే చేయలేడు! అటువంటి చిన్న బడ్జెట్ సినిమాను అంతంత పెద్ద (మిగతా 11వ పేజీలో...)


జవాన్‌లో సాయిధరమ్‌తేజ, మెహ్రీన్

సాదా సీదా సినిమా

యువతకు చక్కని సందేశం ఇచ్చే కథను ఎంచుకున్న బివిఎస్ రవి, ఎటువంటి పాత్రనైనా అవలీలగా పండించే సాయిధరమ్ తేజ్ లాంటి హీరో, కళ్ళల్లో సాఫ్ట్‌నెస్, క్రూరత్వం రెంటినీ క్షణాల్లో మార్చి చూపించగల ప్రసన్న లాంటి విలన్‌తో జత కట్టినా బలహీనమైన కథనం కారణంగా జవాన్‌ను ఒక సాదా సీదా సినిమాగా మిగల్చడం స్వయంకృతాపరాధమే! కుటుంబం కంటే దేశమే శ్రేష్టం అన్న కాన్సెప్ట్‌ను బలంగా పండించినా, అందుకు అనుగుణంగా హత్తుకునే డైలాగులు గాని సన్నివేశాలు కాని లేకపోవడం పెద్ద లోపం. కీలక సన్నివేశాల వద్ద చూపిన అలసత్వం కారణంగా బ్లాక్‌బస్టర్ స్థాయి నుండి సగటు స్థాయి వద్ద ఆగిపోయింది. క్లైమాక్స్ కూడా రసవత్తరంగా లేదు. గుహన్ ఫొటోగ్రఫీ, తమన్ సంగీతం సినిమాకు బలమైన ఆకర్షణలు కాగా, హద్దులు దాటి అంగాంగ ప్రదర్శన హీరోయిన్ మెహ్రీన్ చేయడం జుగుప్స కలిగించింది.

-ఎం.కనకదుర్గ, తెనాలి

మీ వ్యూస్

చాలా విషయాలు తెలియజేశారు

వెన్నెల 12 డిసెంబర్ సంచికలో ఫ్లాక్‌బ్యాక్ లో ప్రచురించిన 'రహస్యం' చిత్రం గురించి మాణిక్యేశ్వరి చాలా విషయాలు తెలియజేశారు. ఎంతోమంది నటీనటులు, సాంకేతిక నిపుణులు 'రహస్యం' చిత్రానికి పనిచేశారు. ఆ రోజుల్లో ఈ చిత్రం బాగా ప్రదర్శింపబడింది. బావుందని చెప్పుకొనేవారు. 'రహస్యం'లో పనిచేసిన నటీనటులకు, సాంకేతిక నిపుణులకు బాగా పేరు వచ్చింది. బి.సరోజాదేవి, కృష్ణకుమారి, ఘంటసాలవారికి చిరస్థాయిగా గుర్తింపునిచ్చింది.

-పట్నాల సూర్యనారాయణ, రాజమండ్రి

ట్రిక్ ఉపయోగిస్తే..?

రుద్రమదేవికి ఒక్క నంది రాకపోవడంతో ఎంపికలో అవకతవకలు జరిగాయని, వాటిని పునఃపరిశీలించాలని రఘువీరారెడ్డి, రుద్రమకు నంది ఇవ్వాల్సిందేనని నారాయణమూర్తి సలహా ఇచ్చారు. దశాబ్దాల క్రితం దాసరి నారాయణరావు తాను తీసిన చారిత్రక చిత్రానికి ఒక్క అవార్డు ఇవ్వలేదని అవార్డు కమిటీని దుయ్యబట్టారు. అంతే, ఒక కొత్త సంస్థ పుట్టుకొచ్చింది. అన్ని ముఖ్యమైన అవార్డులూ దాసరి చిత్రాలకే ప్రకటించి ఆ తరువాత మాయమైంది. గుణశేఖర్ కూడా ఇలాంటి ట్రిక్ ఉపయోగిస్తే బాగుంటుంది.

-ఆర్.శాంతిచంద్రిక, సామార్లకోట

పేలవం అంటే ఇదే!

హైదరాబాద్ రవీంద్రభారతిలో జరిగిన సినీ టెలివిజన్ దర్శకుల శిక్షణా శిబిరంలో నవంబర్ 5న కథా రచయిత విజయేంద్ర ప్రసాద్ పాల్గొని ఏదైన కథ నుంచి స్ఫూర్తి పొందడానికి, కాపీ కొట్టడానికి తేడా వుందని చెప్పారని పత్రికల్లో వచ్చింది. పసివాడిప్రాణం నుంచి లభించిన స్ఫూర్తితో హిందీలో భజరంగీ భాయిజాన్ చేశానని చెప్పాడు. ఇది నిజం. దీన్నే అనుసరించడం అంటారు. అనుకరణ పేలవంగా వుంటుంది. పేలవం అనడమూ దండగే. ఇప్పుడు తెలుగు దర్శకులు వెనుతిరిగి చూసుకోవాలి. సమీక్షించుకోవాలి. ఇతర భాషలలో సినిమా విజయవంతం కావడం పాపం, అనుకరణ సినిమాలు డజను వస్తాయి తెలుగులో! అనుసరణ మంచిదే. మంచి ప్రమాణమై వుండాలి అన్నట్లు విజయేంద్ర ప్రసాద్ చిత్రం రాజమౌళి బాహుబలి-2లో ఇలాగే వరుసగా యువతులను తడుముతూ ప్రవేశింపజేయడం అనుసరణగా అనిపించలేదు. రాజన్నలో కూడా ఇలాంటి సన్నివేశాలే ఉన్నాయి. కాగా ఆ ఆలోచనే పేలవం. అదే పేలలేదు. పేలవం అంటే ఇదే!

-వి.ఆర్.ఆర్.ఎ.రాజు, హైదరాబాద్

తిరిగి పుష్పించింది

మాణిక్యేశ్వరిగారు తిరిగి పాత సినిమా సమీక్షలు మొదలుపెట్టడం పాఠకులకు ఆనందదాయకంగా ఉన్నది. ఒక్క సినిమాను మాత్రమే సమీక్షించక, ఆ సినిమాకు సంబంధించిన పూర్వాపరాలను కూడా తెలియపరుస్తున్నారు. పూర్వం ఒక్క సినిమా నటీనటులనే గుర్తుపెట్టుకునేవారు. ఈ సమీక్షలవల్ల సాంకేతిక వర్గం, వారి ప్రతిభలను కూడా చక్కగా వ్యక్తీకరించడంవల్ల ఇంకా చాలా సంగతులు తెలుస్తున్నాయి. పూలరంగడు సినిమా గురించి వ్యాసం చాలా బాగుంది. ఎందువల్లనో ఈ చిత్రం విడుదల సంవత్సరాన్ని రాయలేదు. ఎఎన్నార్, జమునలు సినిమాకెళ్లి నేల టిక్కెట్టు కొనుక్కొని ఆడవాళ్ళ, మగవా ళ్ళ వరుసలో తడిక ప్రక్కన కూర్చుని చూసే సన్నివేశం, వీరే తెరమీద మంచి దుస్తుల్లో 'నీ జిలుగు పైట' పాటకు పాడే యుగళగీతం అద్భుత చిత్రీకరణ.

-ఎన్.ఆర్.లక్ష్మి, సికిందరాబాద్

ఆలోచింపజేసింది...

'రుద్రమదేవి ఎవరు?' వ్యాసం ఆలోచింపజేసింది. సామాన్య ప్రజలు కుల, ప్రాంతీయ భావనలు లేకుండా గొప్పవారందర్నీ సమాదరిస్తారు. ప్రాంతీయ రచ్చ నేతల పుణ్యమే. ఉద్యమ సమయంలో ఈ రచ్చ విజృంభించింది. మేధావి వర్గం అయిన రచయితలు, జర్నలిస్టులు ప్రభావితులై ఆంధ్రుల రచనలు చదవొద్దని కొందరు తీర్మానించారు. నన్నయ్య, తిక్కన్న లాంటి పురాతన కవులకు ప్రాంతీయ తత్వం అంటగట్టారు. ఇప్పటికీ కోనసీమ కొబ్బరిబోండాలు, ఆంధ్ర కూరగాయలు వద్దని ఖరీదు ఎక్కువైనా బెంగుళూరు నుంచి తెప్పించే దళారులున్నారు. ఈ సెగ రుద్రమదేవికీ తగలడంలో ఆశ్చర్యం లేదు. నేతల ప్రభ తగ్గేవరకూ ఈ రచ్చ కొనసాగుతూనే వుంటుంది. కొద్ది కాలం తర్వాత తగ్గవచ్చు.

-కె.సుధీర్, శ్రీనగర్, తూ.గో.





ఉమాచండీ గౌరీశంకరుల కథ

ఫ్లాష్‌బ్యాక్ @50

విజయవంతమైన పలు చిత్రాల నిర్మాణంతో ఒక ప్రత్యేకతను నిలుపుకున్న సంస్థ విజయా ప్రొడక్షన్స్. ఈ సంస్థ తొలి చిత్రం 'షావుకారు' 'పెళ్లిచేసి చూడు' (తెలుగు, తమిళ), 'మిస్సమ్మ' (తెలుగు, తమిళ), 'అప్పుచేసి పప్పుకూడు' చిత్రాలకు ఎల్.వి.ప్రసాద్ దర్శకత్వం వహించారు. తోటరాముడిగా ఎన్‌టిఆర్‌ని సాహస యువకునిగా 'పాతాళభైరవి'ని ఆబాలగోపాలాన్ని మురిపించేస్తూ, ఓ అద్భుత చిత్రరాజంగా నిలిచిన 'మాయాబజార్'ను రూపొందించిన దర్శకులు కె.వి.రెడ్డి. విజయా ప్రొడక్షన్స్ పతాకంపై 'జగదేకవీరుని కథ' 'సత్యహరిశ్చంద్ర' తరువాత వీరు రూపొందించిన చిత్రం 'ఉమా చండీ గౌరీ శంకరుల కథ'. కె.వి.రెడ్డి జయంతి పతాకంపై 'పెళ్లినాటి ప్రమాణాలు', 'శ్రీకృష్ణార్జున యుద్ధం', 'భాగ్యచక్రం' నిర్మించారు. అన్నపూర్ణావారి 'దొంగరాముడు', ఎన్.టి.రామారావు 'శ్రీకృష్ణసత్య'కు దర్శకత్వం వహించారు. విజయవంతమైన చిత్రాల దర్శకునిగా వాసిగాంచారు కె.వి.రెడ్డి (కదిరి వెంకటరెడ్డి).

'ఉమా చండీ గౌరీ శంకరుల కథ' చిత్రానికి కథను రచయిత పింగళి నాగేంద్రరావు, కె.వి.రెడ్డి, సంగీతం శ్రీనివాసరావు కలిసి సిద్ధం చేసారు. నృత్యం-పసుమర్తి కృష్ణమూర్తి, కళ-గోఖలే,కళాధర్, ఛాయాగ్రగహణం- మాధవ్ బుల్‌బులే, సంగీతం- పెండ్యాల నాగేశ్వరరావు, కూర్పు-జి.కల్యాణ సుందరం, డి.జి.జయరాం, మాటలు,పాటలు- పింగళి నాగేంద్రరావు, స్పెషల్ ఎఫెక్ట్స్- హర్బాన్ సింగ్, సినిమ అనుసరణ-కె.వి.రెడ్డి, నిర్మాత- దర్శకుడు- కె.వి.రెడ్డి. 11-01-1968 సంక్రాంతి నాడు విడుదల.

నైమిశారణ్యంలో మహర్షులందరూ ఉండగా ఏది సత్కద అని చర్చ వస్తుంది. జమదగ్ని (దూళిపాళ) శ్రీకరంబైన కథ ఏది అని ప్రశ్నించగా, భృగు మహర్షి (ముక్కామల) పార్వతీ, పరమేశ్వరులలో ఎవరు గొప్పవారో తేల్చుకోవాలని కైలాసం వెళతాడు. అక్కడ శివభటులు (మోతుకూరి సత్యం, జూ.భానుమతి) వానిని అడ్డగించడం, శంకరుడు పార్వతితో నృత్యం చేస్తూ మహర్షి రాకను గమనించినా పార్వతి నృత్యం పూర్తి చేయమని ముమ్మారు వారిస్తుంది. దానికి భృగుమహర్షి కోపించి, పార్వతిని మూడు రూపాలలో జన్మించమని శపిస్తాడు. ఆగ్రహించిన పార్వతి (బి.సరోజాదేవి) భృగుమహర్షిని రాక్షసునిగా మారమని ప్రతి శాపం ఇస్తుంది. ఈశ్వరుడు పార్వతికి అభయం ఇవ్వగా ఆమె భూలోకంలో భృగుమహర్షి భార్య పులోమి (ఋష్యేంద్రమణి)కి ముగ్గురు ఆడపిల్లలుగా జన్మిస్తుంది. లంబకర్ణుడనే రాక్షసునిగా మారి భృగు వలన ఆ పిల్లలు పకృతి విలయానికి లోనై వేరవుతారు. ఒకరు కోయదొర (డా. శివరామకృష్ణయ్య)కు మరొకరు ఆనంద భూపతి మహరాజు (రేలంగి), ఇంకొకరు మనోరంజని (ఛాయాదేవి) వేశ్యకు లభిస్తారు. కోయగూడెంలో చండీగా, రాజు వద్ద ఉమగా, వేశ్యవద్ద గౌరీగా పిలవబడతారు. ఈశ్వరుడు, శంకరుడనే బాలునిగా పులోమి వద్ద పెరుగుతాడు. శివభటులు ఇద్దరూ హాహాహుహు అదే దెయ్యాలుగా లంబకర్ణుని వద్ద చేరతారు. శంకరుడు యుక్త వయస్కుడై అనుచరుడు బాలకృష్ణతో కలిసి ఋషుల రక్షణ చేస్తుంటాడు. లంబకర్ణుని బాధలనుంచి విముక్తి కలిగించాలని బయలుదేరి, హాహాహుహు దెయ్యాల వలన తొలుత ఉప వద్దకు, ఆపైన చండీ, గౌరీలను కలుసుకుని వారిని ప్రేమించి వారి ప్రేమను పొందుతాడు. లంబకర్ణుడు ఉమను చిలకగా మార్చి గుహలో బంధిస్తాడు. ఓ అనాథ ప్రేతానికి శవ సంస్కారం చేసిన శంకరకు, యక్షుడు ప్రత్యక్షమై 'పరరూపధారణ' శక్తిని ప్రసాదిస్తాడు. అంతేకాక ఆ మంత్రం వలన, దానిని ఎవరిపై ప్రయోగిస్తే వారి రూపం శంకర్, శంకర్ రూపం వారికి వస్తుందని తెలియచేస్తాడు. లంబకర్ణునిగా మారిన శంకర్ అతని గుహకు వెళ్లి ఉమను కాపాడగా, శంకర్ రూపం వచ్చి మహిమలు లేని లంబకర్ణుని రాజభటులు బంధించి హింసిస్తారు. ఉమతో ఆశ్రమానికి వచ్చి తల్లికి నిజరూపం చూపిన శంకర్ తిరిగి లంబకర్ణుని వద్దకు వెళ్లి ఋషులను హింసిస్తున్న దానిని అంతం చేసి భృగు శాపం తొలగించి మూడు రూపాలలో వున్న ఉమ, చండీ, గౌరీలను స్వీకరించి ఆకసం నుంచి భృగుమహర్షి దంపతుల నాశ్వీరదించటంతో చిత్రం శుభంగా ముగుస్తుంది.



ఈ చిత్రంలో ఉమ చెలికత్తె చతురికగా మీనాకుమారి, లేఖల్ పాఠక్‌గా అల్లు రామలింగయ్య, వంగర, సీతారాం, విటునిగా పద్మనాభం అతని భార్యగా సూర్యకళ, ఛాయాదేవి తమ్మునిగా రమణారెడ్డి, మహరాణిగా గిరిజ ఇతర పాత్రలు పోషించారు. విజయవారి షావుకారు నుంచి రాజేశ్వరి విలాస్ కాఫీక్లబ్ వరకు ఒక్క సిఐడికి తప్ప పసుమర్తి కృష్ణమూర్తిగారే నృత్య దర్శకులు. ఈ చిత్రానికి కూడా తొలుత శివపార్వతులపై (ఎన్.టిఆర్, బి.సరోజాదేవి)లపై చిత్రీకరించిన 'థిల్లాన' నృత్యం, ఆపైన ఎన్.టి.ఆర్. కోయగూడెం జానపద శైలిలో అభినయించిన 'అబ్బలాలో ఓయబ్బలాలో' (ఘంటసాల), మరో గీతం 'ఓ సిగ్గు లొలికే సింగారి పిల్లా' (ఎన్.టి.ఆర్. బి.సరోజాదేవి (ఘంటసాల, ఎల్.ఆర్.ఈశ్వరి), బి.సరోజాదేవి బృందంపై గీతం 'నన్నూ వరించు ధీరుడు' (ఎల్.ఆర్.ఈశ్వరి బృందం) చెప్పుకోదగినంత స్థాయిలో అలరించాయి. మాధవ్ బుల్‌బులే చక్కని ఛాయాగ్రహణంతో చిత్రాన్ని తీర్చిదిద్దారు. ముఖ్యంగా ఉమాశంకరుల విరహగీతం 'ఏమిటో ఈ మాయా కలలోని కథవలె' (ఘంటసాల, సుశీల) మరోగీతం ప్రకృతిలో, వనంలో, ఆరుబయట వెన్నెలలో చిత్రీకరించిన గీతం 'నీ లీలలోనే ఒక హాయిలే నీ ప్రేమ లాలనలో ఒక మాయలే' (ఘంటసాల, సుశీల) పరవశింపచేస్తాయి. మిగిలిన గీతాలు 'కలగంటివా చెలి' ఎన్.టి.ఆర్ (ఘంటసాల) గౌరీపై గీతం 'నన్నేల మరచినావో దేవా (ఎస్.జానకి), ఉమ చెరులపై గీతం 'ఆహా సఖి ఈ వనమే' (సుశీల బృందం), గౌరీపై గీతం 'సుందరేశ్వరా ఇందు శేఖరా' (సుశీల) ఋషేంద్రమణిపై గీతం 'శ్రీ గౌరి నాపాపలై' (లీల) చివర మాధవపెద్ది బృందం శివస్తుతి, జయజయ శంకర ఉమామహేశ్వర (ఘంటసాల).

ఈ చిత్రంలో బి.సరోజాదేవి మూడు పాత్రలకు, ముగ్గురు గాయనీమణులు పి.సుశీల, ఎస్.జానకి, ఎల్.ఆర్ ఈశ్వరి పాడడం. ఘంటసాల ఎన్‌టిఆర్‌కే కాక ధూళిపాళకు 'శ్రీకరంబై' పద్యం, చిత్రం చివరి గీతం 'జయశంకర' (ముక్కామలపై) పాడడం విశేషం.

ఈ చిత్రానికి సందర్భోచిత మాటలు, పాటలులో పింగళి నాగేంద్రరావు చక్కని స్వరాలతో పెండ్యాల నాగేశ్వరరావు ఆకట్టుకున్నారు.

శంకరునిగా అటు కైలాసంలో ఇటు పార్వతిగా అండగా భూలోకంలో మూడు రూపాల్లో వున్న ఉమ, చండీ, గౌరీలను అలరించే ప్రియునిగా తనదైన చక్కని చిరునవ్వుతో కూడిన, సందర్భోచిత భావప్రకటనలలో ఆకట్టుకునే ఆభినయం చూపారు. అందాల నటి బి.సరోజాదేవి పార్వతితో సహా నాలుగు పాత్రలను చక్కగా మెప్పించినా ఆమె ఆహార్యంలోని కొంత మార్పువలన కొన్ని సన్నివేశాలు ఆకట్టుకోలేక పోయాయి. మిగిలిన పాత్రధారులందరూ, పాత్రల పరిధుల మేరకు నటించారు.

సర్వశక్తిమంతులు ఒక్క క్షణం సహనం కోల్పోతే జరిగే అనర్థాలను తెలియజేసే ఈ చిత్ర కథను ముగ్గురు ప్రజ్ఞావంతులు పింగళి, కె.వి.రెడ్డి, సింగీతం శ్రీనివాసరావులు రూపొందించగా, ప్రతిభావంతుడైన దర్శకునిగా వాసిగాంచిన కె.వి.రెడ్డి సారథ్యం చేపట్టినా, సన్నివేశాల మధ్య ఉమ, చండీ గౌరీ పాత్రల మధ్య సమన్వయం లేకపోవడం, బాలకృష్ణ, మీనాకుమారి వున్నా చక్కని కామెడీ కుదరకపోవడం, కొంత లోపంగా తోస్తుంది. ఈ చిత్రం నిర్మాతలకు పరాజయం మిగిల్చింది కాని సంగీతపరంగా జనామోదం పొందింది. ఈ చిత్రంలోని కొన్ని గీతాలు నేటికీ సంగీతప్రియులకు ఆనందం కలిగిస్తున్నాయి. పెండ్యాలవారి సంగీత మధురిమలు, పింగళివారి సాహితీ విశిష్టత అట్టివి. జయాపజయాలతో పనిలేకుండా ఓ మంచి ప్రయత్నం- 'ఉమా చండీ గౌరీ శంకరుల కథ' చిత్రం సాగిందని భావించాలి.

-సి.వి.ఆర్ మాణిక్యేశ్వరి

సువర్ణసుందరి..స్వర్ణమంజరి!



'అమ్మా! వాల్మీకి రామాయణంలో మహాపతివ్రతామతల్లి సీతాదేవిని గురించి వ్రాయగా చదివామేగాని చూడలేదమ్మా! నిన్ను చూస్తుంటే ఆ సీతమ్మతల్లి సాక్షాత్కరించినట్లయింది. మీ నటనకు ముగ్ధుడనయ్యాను. 'లవకుశ' విడుదల తర్వాత ఒకానొక సందర్భంలో ఒక ప్రేక్షకుడు అన్నమాటలివి. ఆ చిత్రంలో అపర సీతమ్మగా నటించిన అంజలీదేవి తెలుగు ప్రేక్షకుల అంతులేని అభిమానాన్ని చూరగొంది. సీత పాత్రకే కాకుండా అనసూయ, రుక్మిణి, సుమతి, సులోచన, సక్కుబాయి వంటి పతివ్రతల పాత్రలకు కూడా ప్రాణంపోసింది. అందుకే ఆమె చాలా పౌరాణిక చిత్రాలలో నటించారు. అంజలీదేవి పేరువినగానే చాలామంది మహిళలకు ప్రాణం లేచివచ్చేది అంటే అతిశయోక్తికాదు.


అంజలీదేవి ధరించినన్ని రకరకాల పాత్రల్ని మరెవ్వరూ ధరించి వుండరు. సహజంగాను, సజీవంగాను ఆయా పాత్రలకు రూపునందించడంలో ఆమెకామెయేసాటి అని చెప్పాలి. అసలు ఆమె వాంప్ పాత్రలలోనే తెలుగు ప్రేక్షకులకు పరిచయమైంది. గొల్లభామ, మదాలస, కీలుగుర్రం, రక్షరేఖ వంటి చిత్రాలలో ఆమె వాంప్ పాత్రలు ధరించింది. అందుకు భిన్నంగా తొలిదశలోనే శ్రీలక్ష్మమ్మకథ, పరదేశి, ఇలవేల్పు వంటి చిత్రాలలో బరువైన పాత్రలు ధరించి మెప్పించిన అసాధారణ నటి అంజలీదేవి. భర్త ఆదినారాయణరావుగారి ప్రోత్సాహంతో 1946లో 'గొల్లభామ' చిత్రంతో మోహిని పాత్రద్వారా తెలుగుతెరకు పరిచయమై, అంచెలంచెలుగా యెదిగి కథానాయికగా చివరకు అగ్రనటిగా మారిన అరుదైన నటి ఆమె. 1950 దశకంలో యన్.టి.ఆర్, ఏ.యన్.ఆర్.ల సరసన గ్లామరస్ నటిగా పేరుగాంచిన తొలి నటి అంజలీదేవి. 'సువర్ణ సుందరి' (1957) పాత్రకు దక్షిణ భారతదేశంలోనే కాదు ఉత్తర భారతంలోకూడా పండితులు, విమర్శకులు ఎంతగానో మెచ్చుకున్నారు. ఆమె నటన, సంభాషణ అంతగా వాళ్లని ముగ్ధుల్నిచేసింది. ఎదుటి పాత్ర చెప్తున్న డైలాగ్‌కి బ్రహ్మాండమైన రియాక్షన్ ఇవ్వగల నటి ఆమె. సంభాషణలు చాలామంది చదువుతారు. మరికొంతమంది పలుకుతారు. ఇంకొంతమంది అనేస్తారు. కాని అంజలీదేవి పోకడ వీరందరికంటే విలక్షణమైనది. పాత్ర తాలూకు హృదయ స్పందనని సంభాషణగా వినిపింపజెయ్యడమే అంజలీదేవి ప్రత్యేకత. డైలాగ్‌ని, నటనని మిళితం చేసి ప్రేక్షకుల్ని రసపట్టులోకి లాక్కోగల కళామూర్తి అంజలీదేవి.

అంజలీదేవి మంచి నర్తకి. తన అద్వితీయమైన నృత్యాలతో ప్రేక్షకులను ఉర్రూతలూగించింది. స్వప్న సుందరి (1950), అనార్కలి (1955), రేచుక్క (1954), పెళ్లిసందడి (1959), జయభేరి (1959), సువర్ణసుందరి (1957), రాణీరత్నప్రభ (1960), స్వర్ణమంజరి (1962), జయసింహ (1955), ఋణానుబంధం (1960) చిత్రాలలో ఆమె చేసిన నృత్యాలు ప్రేక్షకుల్ని మైమరపించాయి. తెలుగు, తమిళ చిత్రాలలో దాదాపు రెండు దశాబ్దాలు హీరోయిన్‌గా నటించిన ఘనత ఆమెది. నిర్దోషి (1951), స్త్రీసాహసం (1951), పేదరైతు (1952), పక్కింటి అమ్మాయి (1953), సంఘం (1954), సంతోషం (1955), వదినగారి గాజులు (1955), పల్లెటూరి పిల్ల (1950), చరణదాసి (1956), జయంమనదే (1956), పాండురంగ మహాత్మ్యం (1957), చెంచులక్ష్మి (1958), రాజనందిని (1958), శోభ (1958), జయభేరి (1959), బాలనాగమ్మ (1959), భట్టివిక్రమార్క (1960), భక్తజయదేవ (1961), భీష్మ (1962) చిత్రాలు ఆమె ప్రతిభకు గీటురాళ్లు. తెలుగు, తమిళ చిత్ర సీమలలో ఒక వెలుగు వెలిగి, స్వంత బ్యానర్‌పై తెలుగు, తమిళ, హిందీ చిత్రాలు నిర్మించి, అనేక క్యారెక్టర్ పాత్రలకు జీవం పోసి, తన చివరి శ్వాసవరకు చిత్ర పరిశ్రమకే అంకితమైన అంజలీదేవికి కేంద్ర ప్రభుత్వం 'పద్మశ్రీ' ఇవ్వకపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. పరిశ్రమలోని పెద్దలు, రాష్ట్ర ప్రముఖులు అంజలీదేవిని పట్టించుకోకపోవడం దురదృష్టకరం. దీనివల్ల ఫాల్స్‌ప్రిస్టేజికి ప్రాకులాడకుండా సృజనాత్మకతతో తెచ్చుకున్న అంజలీదేవి కీర్తికి ఎలాంటి నష్టంలేదు. తెలుగు చలనచిత్ర చరిత్రలో ఒక సువర్ణాధ్యాయం అంజలీదేవిది.

- పూజారి నారాయణ

డియర్ ఫ్రెండ్స్.. ఈ లింక్ క్విజ్ మీ కోసమే...

ఏ సినిమాలో ఎవరు నటించారు? దర్శకుడెవరు? సంగీతం ఎవరిచ్చారు? ఆయా చిత్రాల్లో సన్నివేశాల మధ్య లింకులు, సంక్లిష్టతలు, అవి చూడగానే గుర్తొచ్చే విషయాలే ఈ లింకు పజిల్ స్పెషాలిటీ. ఒకదానికొకటి సంబంధం లేని రెండు విషయాలు చదవగానే -వాటిమధ్యనున్న 'బంధం' ఠక్కున గుర్తుకొచ్చిందంటే ప్రశ్నకు సమాధానం దొరికేసినట్టే. కొత్త పజిల్‌ను ఎంజాయ్ చేయండి. మీ సమాధానాలు కార్డుపైన గానీ, మరే విధంగానైనా గానీ రాసి పంపించవచ్చు. ఎలాంటి కొట్టివేతలు, తుడిపివేతలు లేకుండా జవాబులన్నీ స్పష్టంగా రాయాలి. మా దగ్గరున్న కీ సొల్యూషన్‌తో అన్ని విధాలా సరిపోయే జవాబులు రాసిన వారి పేర్లు ప్రచురిస్తాం.



ఫిలిం క్విజ్ 62

కందుల శ్రీనివాస్

1. ఈ వర్కింగ్ స్టిల్ ఏ చిత్రానికి సంబంధించినది?
2. జూ.ఎన్‌టిఆర్ నటించిన యమదొంగ చిత్ర కథారచయిత?
3. మోహన్‌బాబు హీరోగా నటించిన యమజాతకుడు చిత్ర దర్శకుడు?
4. కృష్ణ, రజనీకాంత్ చిత్రం ఇద్దరూ అసాధ్యులేలో కథానాయికలు?
5. కృష్ణ హీరోగా నటించిన కెప్టెన్ కృష్ణ చిత్ర దర్శకుడు?
6. ఎన్‌టిఆర్ హీరోగా నటించిన సింహబలుడు చిత్ర సంగీత దర్శకుడు?
7. సిద్దార్థ్ హీరోగా నటించిన చిక్కడు దొరకడు చిత్ర కథానాయిక?
8. రాజపుత్ర రహస్యం చిత్ర కథానాయికలు?
9. అలీబాబా 40 దొంగలులో ఎన్‌టిఆర్‌కు జోడీగా నటించిన కథానాయిక?
10. ఈ స్టిల్‌లో ఉన్నవారిని గుర్తించండి?



సమాధానాలు- 60

1. టెంపర్, 2. ఆదిత్య
3. భూమిక, అంకిత
4. సుబ్రహ్మణ్యం, 5.1979
6. కె.వి మహదేవన్, చక్రవర్తి,
7. వి.బి రాజేంద్రప్రసాద్,
8. కోవెలమూడి బాపయ్య,
9. పి. సుశీల-ఎస్.పి బాలు,
10. మీనా

సరైన సమాధానాలు రాసిన వారు

1. వి రామారావు, మచిలీపట్నం
2. ఆర్.వినయ్‌కుమార్, హన్మకొండ
3. బి.వి.రాజు, కదిరి, అనంతపురం
4. కె.విజయ్‌కుమార్, వరంగల్
5. బి.వి.శ్రీనివాస్, కాకినాడ
6. ఆర్.కె.రాజు, మచిలీటపట్నం
7. బి.శరణ్య, యమున, రాజోలు
8. కె.విజయేందర్, హైదరాబాద్
9. బి. అలేఖ్య, వనస్థలిపురం
10. కె.విశాల్, సికింద్రాబాద్
11. కె. రమేష్, కాకినాడ
12. ఎం.డి. షబ్బీర్‌పాష, ఉప్పల్
13. బండరాజు, సికింద్రాబాద్
14. కె. బ్రహ్మానందం, కదిరి, అనంతపురం
15. వి.వి విశ్వేశ్వరరావు, హన్మకొండ
16. బి.రాజు, కదిరి, అనంతపురం
17. సి.హెచ్ రామారావు, కదిరి, అనంతపురం
18. కె. అనసూయ, హైదరాబాద్
19. కె.విజయభాస్కర్‌రెడ్డి, కుతుకులూరు
20. కె.విశాలాక్షి, విజయవాడ
21. కె.రాజు, జనగాం
22. బి. వరప్రసాద్, ఖమ్మం

పూర్తి చేసిన క్విజ్‌ను పంపించాల్సిన మా చిరునామా: ఎడిటర్, వెన్నెల, ఆంధ్రభూమి దినపత్రిక 36, సరోజినీదేవి రోడ్, సికిందరాబాద్- 03



మా సినిమా మా ఇష్టం

(9వ పేజీ తరువాయి...) రేట్లు పెట్టి టిక్కెట్లు అమ్మాల్సిన అవసరం కూడా లేదు. ఎందుకంటే తను పెట్టిన తక్కువ బడ్జెట్‌ను (నిర్మాణవ్యయం) తక్కువ రేట్లతో అమ్మిన సినిమా టిక్కెట్ల ద్వారా కూడా తిరిగి రాబట్టుకోవచ్చు. అలా పెద్ద బడ్జెట్ సినిమాలకు ఒక రేటు, చిన్న బడ్జెట్ సినిమాలకు ఒక రేటు చొప్పున టిక్కెట్ల ధరలు వుంటేగాని చిన్న సినిమాలు బతికి బట్టకట్టలేని పరిస్థితి నేడు మన రెండు తెలుగు రాష్ట్రాల్లో నెలకొని వుంది. కానీ ఆ వెసులుబాటును, ఆ అవకాశాన్ని, ఆ హక్కును నిర్మాతలకు లేకుండా చేస్తున్నారు ఎగ్జిబిటర్లు- ఒక సినిమాను ప్రదర్శించుకునేందుకు అద్దె వసూలు చేసుకుంటున్న ఎగ్జిబిటర్లు టికెట్ల రేట్లను కూడా వారే నిర్ణయిస్తున్నారు, వారే నిర్దేశిస్తున్నారు! ప్రదర్శనార్థం అద్దె తీసుకున్నవారికి టికెట్ రేట్ల విషయం ఎందుకు! అందుకే నా సినిమాను ప్రదర్శించుకునేందుకు నేను మీకు వారానికి ఇంత చొప్పున అద్దె చెల్లిస్తున్నాను. అంటే వారం రోజుల పాటు మీ థియేటర్‌పై హక్కులు తీసుకుంటున్నాను. ఆ వారం రోజులలో నా వస్తువును నాకు ఇష్టమైనా లేదా నాకు గిట్టుబాటైన ధరకు నేను అమ్ముకుంటాను.



అది నా ఇష్టం. మీరెవ్వరు నా వస్తువునకు ధర నిర్ణయించడానికి? మీరు అవలంభిస్తున్న ఈ పద్ధతి కారణంగా నేను నష్టపోతున్నాను. నా సినిమా నష్టపోతోంది అని చిన్న నిర్మాతలు నిలదీసేందుకు సిద్ధం అవుతున్నారు. నిర్మాతలు నూటికి తొంభైమంది నష్టాల ఊబిలో కూరుకుపోవడానికి, ఉరికొయ్యలకు వేలాడటానికి, బికారులై రోడ్లంబడి తిరగడానికి కారణం ఈ థియేటర్ల అసంబద్ధ విధానమే అని ఢంకా బజాయించి చెప్పవచ్చు. ఒక నిర్మాత సినిమాను తీసేది నటీనటులను, టెక్నీషియన్లను బతికించడానికి, థియేటర్ల యాజమాన్యాన్ని ధనవంతులుగా మార్చడానికి మాత్రమే అనేలా వుంది ప్రస్తుత విధానం.

బయట సమాజంలో ఎవరైనా ఏదైనా వ్యాపారం చేయాలనుకున్నప్పుడు ఏదైనా షాపును అద్దెకు తీసుకుని అందులో అమ్మే వస్తువులను తనకు ఇష్టమైన రేటుకు అమ్ముకొని నష్టం రాకుండా చూసుకుంటాడు! కొంతమంది ఎక్కువ రేటుకు అమ్ముకొని లాభాలపై లాభాలు గడిస్తే కొంతమంది మాత్రం నాకు నష్టం రాకుండా ఏదో కొంచెం లాభం వస్తే చాలు అని అనుకొని గిట్టుబాటు అయ్యే ధరకు అమ్ముకుంటాడు. అంతేగాని ఆ షాపు ఓనరే జోక్యం చేసుకొని తను అద్దె తీసుకోవడమే కాకుండా ఆ షాపుల్లోని వస్తువులను ఏ రేటుకు ఎంతకు అమ్మాలో నిర్ణయిస్తే ఎలా వుంటుంది? ప్రస్తుతం థియేటర్ల యాజమాన్యం ఒకవైపు అద్దెలు వసూలు చేసుకుంటూనే టిక్కెట్ల రేట్లను తమకు ఇష్టం వచ్చినట్లు పెంచడం కూడా అలాగే వుంది? ఈ పద్ధతివలన చిన్న నిర్మాతలు తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ పద్ధతి ఇలాగే కొనసాగితే సినిమాలు తీయడానికి నిర్మాతలు ముందుకు రాని పరిస్థితి దాపురిస్తుంది.

ఇప్పటికే కొంతమంది నిర్మాతలు తమ సినిమాలకు మంచి థియేటర్లు దొరక్కపోవడం, మంచి బిజినెస్ రాకపోవడం, శాటిలైట్ వ్యాపారం జరగకపోవడంతో నేరుగా అమెజాన్, నెట్‌ఫ్లిక్స్ వంటి సంస్థలకు అమ్మేసి ఆన్‌లైన్‌లో విడుదల చేసుకుంటున్నారు. ఈమధ్య కమల్‌హాసన్ తను రూపొందించిన 'విశ్వరూపం' అనే సినిమాను ఇలాగే ఆన్‌లైన్‌లో విడుదల చేయడానికి పూనుకుంటే తమిళనాడులోని ఎగ్జిబిటర్లు తీవ్రంగా వ్యతిరేకించి అడ్డుకున్నారు. ఆ పద్ధతిలోనే నిన్నగాక మొన్న హాలీవుడ్ అగ్రనటుడు విల్‌స్మిత్ తను నటించి రూపొందించిన 'బ్రైట్' సినిమాను థియేటర్లలో కాకుండా నేరుగా నెట్‌ఫ్లిక్స్ ద్వారా ఆన్‌లైన్‌లో విడుదల చేసి సంచలనం సృష్టించాడు.

మన తెలుగు రాష్ట్రాలలో కూడా ఇలా థియేటర్ రెంట్‌లే కాకుండా టికెట్ల రెంట్లు కూడా ఇలాగే అడ్డగోలుగా పెంచుకుంటూపోతే రానున్న రోజులలో తెలుగు సినిమాలను కూడా ఆన్‌లైన్‌లోనే విడుదల చేసుకునే రోజులు వస్తాయి. పరిస్థితులు అటే దారితీస్తున్నాయి.

తీయడం, కొనడం, ప్రదర్శించడం అనే మూడంచల వ్యవస్థ సక్రమంగా, సజావుగా, న్యాయబద్ధంగా నడిపిస్తేనే సినిమా అనే మూడక్షరాల అద్భుతం మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లుతుంది. ఈ మూడింటిలో ఏ ఒక్క వ్యవస్థ చెడిపోయినా, నిస్తేజమైపోయినా మొత్తం వ్యవస్థే పేకమేడలా కూలిపోతుంది. ఈ వాస్తవాన్ని విస్మరించి సినీ పరిశ్రమలోని కొంతమంది పెద్దలు తమ స్వార్థం కోసం ఈ మూడంచెల వ్యవస్థను చెడగొడుతున్నారు. తాము ఎక్కిన మహావృక్షం కొమ్మలను వాళ్లే నరుక్కుంటున్నారు. అది వినాశనానికే దారితీస్తుంది.

ప్రభుత్వాలు కూడా ఈ విషయంలో జోక్యం చేసుకొని ఏ నాలుగైదు తప్ప మిగతావాళ్లు బతకుండా చేస్తున్న సినిమా పరిశ్రమ విధి విధానాలపై కొరడా ఝుళిపించాలి. సినిమాను, సినిమా పరిశ్రమను బతికించుకోవాలి. మన పొరుగు రాష్ట్రమైన కేరళను, చైనా, ఇరాన్ వంటి దేశాలను ఆదర్శంగా తీసుకోవాలి. ఇలా చౌకగా అందవలసిన సినిమా వినోదం అతి ఖరీదైన వస్తువుగా మారిపోతే ఈ వినోదం దొరకని సగటు మనిషి మరో చోట మరో రకమైన వినోదాన్ని వెదుక్కుంటాడు. అదీ దొరక్కపోతే ఏ తాగుడుకో, ఏ జూదానికో బానిసవుతాడు. దాని వలన సమాజంలో అనేక రకాల నేరాలు పురుడుపోసుకుంటాయి. వ్యవస్థ డిస్టర్బ్ అవుతుంది. ★

నిరుత్సాహ పరిచే రొమాంటిక్ డ్రామా!



ఆ మధ్య ఆకతాయి సినిమాతో టాలీవుడ్‌లోకి హీరోగా అడుగు పెట్టిన ఇచ్చిన ఆశిష్‌రాజ్ తొలి సినిమాతోనే కథానాయకుడిగా మంచి గుర్తింపు తెచ్చుకున్నాడు. ఆ చిత్రం తర్వాత ఆయన నటిస్తున్న రెండో చిత్రం 'ఇగో'. సుబ్రహ్మణ్యం దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాలో ఎవరి ఇగో.. ఎవరికి ఇబ్బంది పెట్టిందో తెలుసుకోవాలంటే కథలోకి వెళ్లాల్సిందే..

అమలాపురం అనే ఊళ్లో గోపి (ఆశిష్‌రాజ్)కి అక్కడే వుండే ఇందు (సిమ్రన్) అంటే అస్సలు పడదు. ఇద్దరిమధ్య తరుచూ గొడవలే. ఆమెను ఎప్పుడూ ఏడిపిస్తూ వుంటాడు. అందుకే ఇందుకు గోపి అంటే చాలా చిరాకు.. కోపం ఉంటుంది. గోపి నుండి అవమానాలు ఎదుర్కొన్న తర్వాత ఇందు ఒక డాక్టర్‌ను పెళ్లిచేసుకోవాలని నిర్ణయించుకుంటుంది. దాంతో గోపి కూడా ఇందుకంటే అందమైన అమ్మాయిని ప్రేమించి పెళ్లిచేసుకోవాలని హైదరాబాద్‌కు వస్తాడు. ఈ నేపథ్యంలో ఇద్దరిమధ్య దూరం పెరగడంతో ఒకరంటే ఒకరికి అనుకోకుండా ఇష్టం పెరుగుతుంది. దాంతో ఇద్దరూ ఒకరితో ఒకరు ప్రేమలో పడతారు. ఒకరంటే ఒకరికి అస్సలు పడని ఆ ఇద్దరూ ఎలా ప్రేమలో పడ్డారు అన్నది మిగతా కథ.

నటనాపరంగా.. చూడటానికి ఆకట్టుకునేలా హీరో ఆశిష్‌రాజ్ మొదటి సినిమా కంటే బెటర్‌గానే అనిపించాడు. అయితే డైలాగ్స్ విషయంలో ఇంకాస్త మెరుగుపరచుకుంటే బావుంటుంది. సినిమా చివరి 15 నిమిషాల పాటు రావురమేష్ పాత్ర అందర్నీ ఆకట్టుకుంటుంది. మొదటి భాగంలో థర్టీ ఇయర్స్ పృథ్వీ చేసిన కామెడీ కొంత పండింది. హీరో, పృథ్వీ గ్యాంగ్ నడుమ నడిచే ఫన్నీ సన్నివేశాలు నవ్వించాయి. పల్లెటూరి అమ్మాయిగా సిమ్రన్ అందంగా కనిపిస్తూనే మంచి నటన కనబరిచింది. ఇక దీక్షాసేథ్ కూడా మంచి పాత్రలోనే కనిపించి అటు నటన.. ఇటు గ్లామర్‌తో ఆకట్టుకునే ప్రయత్నం చేసింది. సాంకేతికంగా చూస్తే సినిమా నిర్మాణ విలువలు ఫర్వాలేదనే స్థాయిలో ఉన్నాయి. సంగీతం ఓకె. రెండు పాటలు వినడానికి, స్క్రీన్‌పై చూడటానికి బాగున్నాయి. కెమెరా వర్క్ ఫర్వాలేదు. విలేజ్ సన్నివేశాల్లో కెమెరా పనితనం హైలైట్‌గా వుంది. కొన్ని సన్నివేశాలు అందంగా చూపే ప్రయత్నం చేసారు. ఇక దర్శకుడు సుబ్రహ్మణ్యం విషయానికొస్తే.. ఆయన ఎంచుకున్న కథాంశం కొత్తదేమీ కాదు. పైగా సరైన కథనం, సన్నివేశాలు, రొమాన్స్, ఇతర ఎమోషన్స్ లేకుండా చూపడంతో ప్రేక్షకులను ఏ మాత్రం ఆకట్టుకునే ప్రయత్నం చేయలేదు. దర్శకుడిలో వున్న క్లారిటీ మిస్ అయి సినిమా నిరాశగా మారింది. కథ విషయంలో ఎంతో కొంత కొత్తదనం చూపిస్తే బావుండేది. వెండితెరపై ఇలాంటి కథలతో ఇప్పటికే చాలా చిత్రాలు వచ్చాయి. పైగా సన్నివేశాలను పండించడంలో కూడా దర్శకుడు ఫెయిల్ అయ్యాడు. సినిమాకు ఖచ్చితంగా ఒక ప్లాట్ అనేది లేకపోవడమే పెద్ద డ్రాబ్యాక్. ఆరంభంలో విలేజ్ డ్రామాగా చూపించి మధ్యలో లవ్‌స్టోరీగా మార్చి ఆఖరులో మర్డర్ మిస్టరీ అని చెప్పడం, వాటిని కూడా సాగదీసి చూపించడంతో కొంత అసహనం రేకెత్తుతుంది. అంతేకాక, సినిమాలో చాలా లాజిక్ లేని సిల్లీ సన్నివేశాలు ఉంటాయి. కామెడీ పాత్రలు కూడా తరచూ వస్తూ పోతూ సినిమా అసలు కథను తప్పుదోవ పట్టించాయి. అప్పటివరకు ఒకరంటే ఒకరికి పడక కొట్టుకున్న హీరో హీరోయిన్లు ప్రేమలో పడే సన్నివేశం అస్సలు ఆకట్టుకోదు. అంతేగాక దర్శకుడు హీరో హీరోయిన్ల మధ్య నుండే ప్రేమ అనే కోణాన్ని సరిగా ఎలివేట్ చేయలేకపోయారు.

మొత్తంమీద ఈ 'ఇగో' చిత్రం ఆసక్తికరమైన అంశాలు లేక నిరుత్సాహపరిచే రొమాంటిక్ డ్రామాగా ఉంది. ఒక నిర్దిష్టమైన కథంటూ లేకపోవడం, సరైన సన్నివేశాలు, హీరో హీరోయిన్లమధ్య లాజిక్ లేని ప్రేమ లాంటి చాలా అంశాలు ప్రేక్షకుడిని కన్‌ఫ్యూజ్ చేస్తాయి. చివరి పదిహేను నిమిషాల క్లైమాక్స్, అక్కడక్కడా నవ్వించే కామెడీ మినహాయిస్తే.. ఈ ఎమోషన్స్ లేని ప్రేమకథలో ఎంజాయ్ చేయడానికి ఏమీ దొరకదు. ప్చ్...!

-త్రివేది



★ ఇగో

తారాగణం:
ఆశిష్‌రాజ్, సిమ్రన్, దీక్షాసేథ్, పృథ్వీ, రావురమేష్ తదితరులు
ఎడిటింగ్: శివ వై ప్రసాద్
కెమెరా: జి.కె.ప్రసాద్
సంగీతం: సాయి కార్తీక్
నిర్మాత: విజయ్ కరణ్, కౌశల్ కరణ్, అనిల్ కరణ్
కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం:
సుబ్రహ్మణ్యం

టాలీవుడ్ వీళ్లకైనా.. కలిసొస్తుందా?





ఇండియన్ సినిమా చరిత్రలో బాలీవుడ్ తరువాత రెండో స్థానంలో వుంది టాలీవుడ్. ఇక సినిమాల నిర్మాణ విషయంలో ఎప్పుడూ ముందుండే తెలుగు సినిమాల్లో నటించేందుకు సదరు నటీనటుల ఆసక్తి ఎక్కువే. అయితే వీరిలో కథానాయికలు ఎప్పుడూ ముందుంటారు. తెలుగు ప్రేక్షకులకు కూడా బాలీవుడ్ భామలంటే అదో క్రేజ్. అందుకే ఎక్కువ మొత్తం పెట్టి వారిని తెలుగు సినిమాలతో ఇక్కడి ప్రేక్షకులకు పరిచయం చేస్తారు దర్శక నిర్మాతలు. ఈ మధ్య టాలీవుడ్‌కి మలయాళ భామల తాకిడి ఎక్కువైంది. ఇప్పటికే అరడజనుకు పైగా హీరోయిన్స్ క్రేజ్ తెచ్చుకుని ఆకట్టుకుంటున్నారు. అయితే తెలుగు సినిమాల్లో నటించేందుకు ఇతర భాషా నటీమణులకు చక్కటి ఆహ్వానం లభిస్తోంది. మలయాళం, తమిళం, కన్నడ, హిందీ వారు తెలుగులో సినిమాలు చేసి తెలుగు హీరోయిన్స్‌గా ఇమేజ్ తెచ్చుకున్నవారే. అయితే కొంతమంది బాలీవుడ్ బ్యూటీలు ఎంత కష్టపడ్డా, తెలుగు ప్రేక్షకులను మెప్పించలేకపోయారు. మరి కనీసం ఇప్పుడు వస్తున్న కథానాయికలైనా టాలీవుడ్‌లో నిలబడతారో లేదో చూడాలి..

ప్రస్తుతం బాలీవుడ్‌తో పాటు హాలీవుడ్‌ని సైతం తన వైపునకు తిప్పుకున్న అందాల భామ ప్రియాంకా చోప్రా అంటే ఇప్పుడు ఎలాంటి క్రేజ్ వుందో అందరికీ తెలుసు.. అయితే ఆమె తెలుగులో నటించేందుకు ఆమధ్య ఆసక్తి చూపించింది. కానీ పెద్దగా ఆకట్టకోలేకపోవడం విశేషం.. ఆమధ్య మెగా పవర్‌స్టార్ రామ్‌చరణ్ చేసిన హిందీ చిత్రం 'జంజీర్'. దీన్ని తెలుగులో 'తుఫాన్'గా విడుదల చేశారు. అయితే చరణ్ సరసన నటించిన బాలీవుడ్ టాప్ హీరోయిన్ ప్రియాంక చోప్రా ఆ సినిమాతో సరైన విజయాన్ని అందుకోలేకపోయింది. దాంతో ఆమెకు తెలుగు అవకాశాలు రాలేదు. ఇక మరో క్రేజీ భామ బిపాసా పరిస్థితి అలాగే వుంది. హాట్ అందాలు ఆరబోస్తూ షాకిచ్చిన బిపాసా కూడా తెలుగులో మహేష్ సరసన 'టక్కరిదొంగ' సినిమాలో హీరోయిన్‌గా నటించింది. ఈ సినిమాతో మరో బాలీవుడ్ భామ లిసారే కూడా మెరిసింది. కానీ ఆ సినిమా తెలుగు ప్రేక్షకులకు నచ్చకపోవడంతో పాపం.. ఈ ఇద్దరు భామల కష్టాలు వృథా అయ్యాయి.

ఇక మరో హీరోయిన్ ప్రస్తుతం బాలీవుడ్‌లో ఫైర్‌బ్రాండ్‌గా ఇమేజ్ తెచ్చుకున్న కంగనా రనౌత్‌ది అదే పరిస్థితి. ప్రభాస్ పక్కన 'ఏక్‌నిరంజన్' సినిమాలో నటించింది. పూరీ జగన్నాథ్ దర్శకత్వంలో వచ్చిన ఆ సినిమా హిట్ కాకపోవడంతో పాపం కంగనా ఆశలు అడియాశలయ్యాయి. అప్పట్లో క్రేజీ హీరోయిన్‌గా ఇమేజ్ తెచ్చుకున్న ట్వింకిల్ ఖన్నా పరిస్థితి కూడా అలానే మారింది. వెంకటేష్ సరసన 'శీను' సినిమాలో నటించింది. ఈ సినిమా మంచి పేరు తెచ్చుకున్నప్పటికీ ట్వింకిల్‌కు తెలుగు ప్రేక్షకులు మంచి మార్కులు వేయలేదు. ఇక తెలుగు భామ అయివుండి, బాలీవుడ్‌లో పేరుతెచ్చుకున్న అమృతారావుది అదే పరిస్థితి. సూపర్‌స్టార్ మహేష్ సరసన అతిథిలో నటించింది. అయినా ఈ అమ్మడి అందాలకు తెలుగువారు ఫిదా కాలేదు.

ఇక అప్పట్లో క్రేజీ హీరోయిన్‌గా టాలీవుడ్‌లో ఒక ఊపు ఊపిన మనీషా కొయిరాలది అచ్చంగా అలాంటి పరిస్థితే. నాగార్జున సరసన 'క్రిమినల్' సినిమాలో నటించింది. కానీ ఆ సినిమా కమర్షియల్‌గా విజయం అందుకోకపోవడంతో తెలుగులో పెద్దగా అవకాశాలు రాలేదు. ఇక ఈ లిస్టులో చూసుకుంటే.. అయేషా టకియా నాగార్జున తో 'సూపర్'లో నటించింది. పూరీ దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమా నిరాశపర్చడంతో అయేషా ఇంటిబాట పట్టింది. ఇక బాలీవుడ్‌లో హాట్ హీరోయిన్‌గా ఇమేజ్ తెచ్చుకున్న శిల్పాశెట్టి (మోహన్ బాబు సరసన వీడెవడండీ బాబు).. ఆమె చెల్లెలు షమితా శెట్టి (ఆకాష్ సరసన పిలిస్తే పలుకుతా)లది అదే పరిస్థితి. వీరితోపాటు మరికొందరి భామలది అదే పరిస్థితి. పూరీ పరిచయం చేసిన దిశాపటాని (వరుణ్‌తేజ్‌తో లోఫర్), ఆదాశర్మ (హార్ట్‌ఎటాక్) వంటి తారలు.. టాలీవుడ్‌లో రాణించలేకపోయారు. ఒక్క సినిమాతోనే వెనుతిరిగారు. ప్రస్తుతం బాలీవుడ్ భామ శ్రద్ధాకపూర్ హీరోయిన్‌గా టాలీవుడ్‌లోకి అడుగుపెట్టింది. 'బాహుబలి' తరువాత ప్రభాస్ నటిస్తున్న భారీ చిత్రం 'సాహో'లో హీరోయిన్‌గా నటిస్తోంది. అలాగే మహేష్ సరసన ఖైరా అద్వానీలు నటిస్తున్నారు. మరి ఈ సినిమాతో ఈ భామలు టాలీవుడ్‌లో క్రేజ్ తెచ్చుకుంటారో లేదో చూడాలి!

-శ్రీనివాస్ ఆర్.రావ్









- గౌరీభట్ల దివ్యజ్ఞాన సిద్ధాంతి

రాశిఫలం

మంగళవారం, 23-1-2018

మేషం (అశ్విని, భరణి, కృత్తిక 1పా.): స్థిరాస్తులకు సంబంధించిన విషయాల్లో సమయస్ఫూర్తి అవసరం. నిరుత్సాహంగా కాలం గడుస్తుంది. అపకీర్తి వచ్చే అవకాశముంటుంది. ఇతరులకు అపకారం కలిగించే పనులకు దూరంగా నుండుట మంచిది. పరిశుద్ధతకు ప్రాధాన్యమిచ్చినచో అనారోగ్య బాధలుండవు.

వృషభం (కృత్తిక 2, 3, 4పా., రోహిణి, మృగశిర 1, 2పా.): అపకీర్తి రాకుండా జాగ్రత్తపడుట మంచిది. మనోల్లాసాన్ని పొందుతారు. సోదరులతో వైరమేర్పడకుండా మెలగాలి. తలచిన కార్యాలకు ఆటంకాలెదురవుతాయి. ఆర్థిక ఇబ్బందులు ఆలస్యంగా తొలగిపోతాయి. నూతన వ్యక్తుల జోలికి వెళ్లరాదు.

మిథునం (మృగశిర 3, 4 పా., ఆరుద్ర, పునర్వసు 1, 2, 3పా.): ఆకస్మిక ధనలాభముంటుంది. నూతన వస్తు, ఆభరణాలను పొందుతారు. కీర్తి, ప్రతిష్ఠలు పెరుగుతాయి. కుటుంబ సభ్యులతో సంతోషంగా కాలక్షేపం చేస్తారు. ఇతరులకు ఉపకారం చేయుటకు వెనుకాడరు. ఋణబాధలు తొలగిపోతాయి. శత్రుబాధలుండవు.

కర్కాటకం (పునర్వసు 4 పా., పుష్యమి, ఆశ్లేష): బంధు, మిత్రులతో కలుస్తారు. నూతన గృహ నిర్మాణ ప్రయత్నం చేస్తారు. ఆకస్మిక ధనలాభంతో ఋణబాధలు తొలగిపోతాయి. కుటుంబ సౌఖ్యముంటుంది. శతృబాధలు దూరమవుతాయి. దీర్ఘకాలిక సమస్యలు తొలగిపోతాయి. ఆరోగ్యం బాగుంటుంది.

సింహం (మఖ, పుబ్బ, ఉత్తర 1 పా.): ఆత్మీయుల సహకారం ఆలస్యంగా లభిస్తుంది. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతారు. ప్రయాణాలు జాగ్రత్తగా చేయుట మంచిది. అజీర్ణబాధలు అధికమగును. కీళ్ళనొప్పుల బాధ నుండి రక్షించుకోవడం అవసరం. మనోవిచారాన్ని కలిగివుంటారు.

కన్య (ఉత్తర 2, 3, 4పా., హస్త, చిత్త 1, 2 పా.): ప్రయత్న కార్యాలన్నీ సంపూర్ణంగా ఫలిస్తాయి. ఆకస్మిక ధనలాభమేర్పడుతుంది. విందులు, వినోదాల్లో పాల్గొంటారు. పిల్లలకు సంతోషాన్ని కలుగజేస్తారు. కళాత్మక వస్తువులను సేకరిస్తారు. బంధు, మిత్రులను కలుస్తారు. కొత్త కార్యాలకు చక్కని రూపకల్పన చేస్తారు.

తుల (చిత్త 3, 4పా., స్వాతి, విశాఖ 1, 2, 3పా.): కుటుంబంలో చిన్న చిన్న గొడవలు వచ్చే అవకాశం ఉంది. పరిస్థితిని మీ అదుపులో ఉంచుకోండి. ప్రయాణాల్లో అప్రమత్తత అవసరం. ఆర్థిక ఇబ్బందులను అధిగమించుటకు ఋణప్రయత్నాలు చేస్తారు. బంధు, మిత్రుల సహాయ సహకారాలు ఆలస్యంగా లభిస్తాయి.

వృశ్చికం (విశాఖ 4 పా., అనూరాధ, జ్యేష్ఠ): ఋణప్రయత్నాలు తొందరగా ఫలిస్తాయి. స్థానచలన సూచనలుంటాయి. శుభకార్యాల మూలకంగా ధనవ్యయం అధికమవుతుంది. ప్రయాణాలెక్కువ చేస్తారు. అనారోగ్యమేర్పడకుండా జాగ్రత్త అవసరం.

ధనుస్సు (మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1 పా.,): కుటుంబ పరిస్థితులు సంతృప్తికరంగా నుంటాయి. ఆకస్మిక ధనలాభంతో ఋణబాధలు తొలగిపోతాయి. సమాజంలో మంచి పేరు సంపాదిస్తారు. ఇతరులు మిమ్మల్ని ఆదర్శంగా తీసుకొనుటకు కృషి చేస్తారు. స్త్రీలు బంధు, మిత్రులను కలుస్తారు.

మకరం (ఉత్తరాషాఢ 2, 3,4పా., శ్రవణం, ధనిష్ఠ 1, 2పా.): కొత్త కార్యాలు ప్రారంభిస్తారు. మానసికానందాన్ని పొందుతారు. ప్రతి విషయంలో వ్యయ, ప్రయాసలు తప్పవు. ఆకస్మిక ధననష్టమేర్పడే అవకాశముంది. వృత్తిరీత్యా కొత్త సమస్యలనెదుర్కొంటారు. బంధు, మిత్రులతో కలహాలేర్పడకుండా జాగ్రత్తపడుట మంచిది.


కుంభం (ధనిష్ఠ 3, 4పా., శతభిషం, పూర్వాభాద్ర 1,2, 3పా.): మిక్కిలి ధైర్య సాహసాలు కలిగివుంటారు. సూక్ష్మబుద్ధితో విజయాన్ని సాధిస్తారు. మీ పరాక్రమాన్ని ఇతరులు గుర్తిస్తారు. శతృబాధలు తొలగిపోతాయి. శుభకార్య ప్రయత్నాలు సులభంగా నెరవేర్చుకుంటారు. ముఖ్యమైన వ్యక్తుల్ని కలుస్తారు. ఆకస్మిక లాభాలుంటాయి.

మీనం (పూర్వాభాద్ర 4 పా., ఉత్తరాభాద్ర, రేవతి): వృత్తిరీత్యా అనుకూల స్థానచలనం ఉంటుంది. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతారు. పోట్లాటలకు దూరంగా నుండుట మంచిది. అనారోగ్య బాధలధిగమించుటకు ఔషధ సేవ తప్పదు. స్థిరాస్తులకు సంబంధించిన విషయాల్లో తొందరపాటు పనికిరాదు. ★

ఆత్రేయ పాటలపై ఆమూలాగ్ర పరిశీలన

కాళిదాసు - మల్లినాథసూరి, షేక్స్‌పియర్ -ఎ.సి.బ్రాడ్లే, జాన్సన్-బాస్వెల్.. ఈ అనుబంధ క్రమంలో ఆధునికకాలంలో సినీ గేయ సాహిత్య విమర్శ విషయంలో ఆచార్య ఆత్రేయ -పైడిపాల జంటను కూడా పేర్కొనవచ్చు. పైడిపాల రాసిన 'ఆత్రేయ నాటకాలు - పూర్వాపరాలు' (ఎం.ఫిల్ సిద్ధాంత వ్యాసం) అనే పుస్తకాన్ని చూసి ముచ్చటపడి దానికి ముందుమాట రాస్తూ- 'ఆత్రేయ నాటకాలమీద పరిశోధన చేసిన మీరు డిగ్రీ పొందుదామనుకున్నారు. కాని మీ పరిశోధనవల్ల నాకు డిగ్రీ లభించింది' అని ఆత్రేయ స్వయంగా మెచ్చుకోవడం దీనికి సాక్ష్యం. ఆత్రేయ రచనలపై నిరంతర పరిశోధన, కృషి చేస్తున్న డా. పైడిపాల తాజా పుస్తకం 'పాడుతా తీయగా' (ఆత్రేయ నూటపదార్లు).

'పాడుతా తీయగా' అనగానే యస్.పి.బాలసుబ్రహ్మణ్యం వారం వారం టీవీలో సమర్పిస్తున్న సినీ సంగీత కార్యక్రమం అందరికీ గుర్తొస్తుంది. ఇది ఆ కార్యక్రమానికి సంబంధించిన పాటల పుస్తకంగా కొందరు పొరబడే అవకాశం వుంది. కాని ఇది ఆత్రేయ 'మూగమనసులు' చిత్రానికి రాసిన ఆణిముత్యాల వంటి పాటలలో ఒకటైన 'పాడుతా తీయగా సల్లగా..' అనే పాట పల్లవి నుంచి తీసుకొన్న మకుటం. ఆత్రేయ రచించిన 1500పైగా సినిమా పాటలనుంచి 116 పాటల పూర్తి పాఠాలను, సుమారు మరో 116 పాటల సమాచారాన్ని 16 విభాగాలలో విశ్లేషణాత్మకంగా పొందుపరిచి పైడిపాల ఈ పుస్తకాన్ని రూపొందించారు. ఆత్రేయ సాహితి సహ సంపాదకునిగా పాటల మూడు సంపుటాల కోసం అప్పట్లో 1100 పాటల్ని మాత్రమే సేకరించి ప్రచురించగా- ఇప్పుడు పైడిపాల మిగిలిన 400 పాటల్ని కూడా సేకరించి మొత్తం పాటల నుంచి ఆయా విభాగాల కనుగుణంగా 116 పాటల్ని ఎంపిక చేసి ప్రచురించడంతో పాటు ఆత్రేయ పాటలు రాసిన 485 చిత్రాల జాబితాను కూడా ఇవ్వడం ఈ పుస్తక రూపకల్పన వెనుక రచయిత శ్రద్ధ, శ్రమ అవగతమవుతాయి.



బుక్ రివ్యూ

'పాడుతా తీయగా'
(ఆత్రేయ నూట పదార్లు)
రచన: డా. పైడిపాల
పుటలు: 230, వెల: రూ.150/-
ప్రతులకు:
- డా.పి.యస్.రెడ్డి , 11-20, కొంకాపల్లి అమలాపురం- 533201, ఫోన్: 99891-06162
- నవోదయ బుక్‌హౌస్, కాచిగూడ హైదరాబాద్-27, ఫోన్: 040 - 24652387

ఇది కేవలం ఆత్రేయ 116 పాటల సంకలనం మాత్రమే అనుకుంటే పొరపాటు! అలా అనుకుంటే వ్యాపార ధోరణిలో తామరతంపరగా ప్రచురిస్తున్న సినీ గేయాల సంకలనాలకు, దీనికి తేడా ఏమంటుంది? వాటితో ఏ మాత్రం పోలికలేని ఈ పుస్తకంలో ఎన్నో ప్రత్యేకతలూ, విశిష్టతలూ వున్నాయి. వాటిలో ముందుగా పేర్కొనదగింది శీర్షికల విభజన. ఆత్రేయ పాటల్ని 16 శీర్షికలుగా విభజించి, విషయ సూచికకు 'ఆత్రేయుని (చంద్రుని) షోడశ కళలు' అని నామకరణం చెయ్యడం సాహితీ ప్రియుల్ని ముగ్ధుల్ని చేస్తుంది. ఆపైన శీర్షికలకు 'ఉన్నట్టే వున్నా అనే వూగిసలాటలో.', 'అనుబంధాలు -స్నేహ సుగంధాలు', 'వలపులతోటలు - వయసు పాటలు', 'ముద్దు ముద్దు పాటలు - మురిపాల మూటలు', 'తత్త్వాలూ - ముత్యాలు', 'తర్జుమాల ఖర్జూరాలు' వంటి అందమైన అర్థవంతమైన పేర్లు పెట్టడం అందర్నీ ఆకట్టుకుంటున్నది. ఈ నూట పదహారు పాటలూ ఏ ఏ పుటల్లో వున్నాయో ముందుగానే అకారాది క్రమంలో ఇచ్చిన సినిమాల జాబితా ద్వారా తెలియజేసిన పద్ధతి సినీ సంగీత ప్రియులకు కరతలామలకంగా వుంటుంది.

ప్రతి ప్రకరణానికి ముందు ప్రామాణికమైన ఉపోద్ఘాతాలున్నాయి. వాటిలోని అంశాలతో ఆత్రేయ జీవితంలోని సంఘటనలనూ, ఆయన నమ్మిన సిద్ధాంతాలనూ, మనోభావాలను చక్కగా ముడివేశారు. ప్రతి గీతానికి ఆయా సినిమాల్లోని సందర్భ సన్నివేశాలను, పూర్వాపరాలను, భావ వైశిష్ట్యాలను విసిగించకుండా క్లుప్తంగా రాసిన పద్ధతి బావుంది. పాటలు కాని, వివరణలు కాని పునరుక్తం కాకుండా జాగ్రత్తపడ్డం ప్రశంసనీయం. ఆత్రేయ శైలిలాగే ఈ రచన కూడా సరళంగా వుండి చదవడం మొదలుపెడితే ఏకబిగిని చదివించడం ఈ పుస్తకంలోని సుగుణం. ఇక ప్రతి అధ్యాయానికి చివరిలో రాసిన కొసమెరుపులూ, మన(సు)లోని మాటలూ, ఆత్రేయ చమక్కులూ- ఈ పుస్తకానికి అదనపు ఆకర్షణలు. అన్నీ ఆకట్టుకుంటాయి. కొన్ని అధ్యాయాలకు ముగింపులో 116 పాటల్లో చేరని మరికొన్ని ఆత్రేయ పల్లవులనూ, ఆత్రేయ చేత ప్రభావితులైన తర్వాతి కవుల పాటల పల్లవులనూ ఇవ్వడం- విస్తృతమైన ఆత్రేయత్వాన్ని తెలియజేయడమే!

ఆత్రేయ అందిరికీ తెలిసింది మన'సు' కవిగానే! కాని 'పాడుతా తీయగా'లో ఆత్రేయ విశ్వరూపాన్ని, బహుముఖ ప్రజ్ఞను పైడిపాల అనితర సాధ్యంగా ఆవిష్కరించారు. మనోజ్ఞంగా విశ్లేషించారు. ఆత్రేయ మీద లోకంలో వున్న అపవాదాలను సహేతుకంగా ఖండించారు. అలాగని ఆత్రేయ మీద దురభిమానాన్ని ప్రదర్శించి ఆయనను భుజాలకెత్తుకోకపోవడం ఈ రచనలోని నిష్పాక్షికతకు, సత్యనిష్ఠకు నిదర్శనం. ఆత్రేయ మణిపూసలనదగ్గ మాతృగీతాలనెందుకు రాశారు? మనసు పాటల నేపథ్యమేమిటి? వీణ పాటల వెనుక కథ ఏమిటి? తెలుగు చిత్రాల్లో మనసు పాటలతో పాటు వాన పాటలకు ముద్దు పాటలకు కూడా ఆత్రేయ ఆద్యులా? 'ప్రియురాలు ఎంత కఠినం' అని ఆత్రేయ ఎందుకన్నారు? కణ్ణదాసన్ వంటి ప్రతిభావంతులైన పరభాషా కవుల మీద కూడా ఆత్రేయ నీడ వుందా? వంటి ఆసక్తికరమైన అనేక ప్రశ్నలకు ఈ పుస్తకంలో సమాధానాలు లభిస్తాయి. ఒకమాటలో చెబితే రంధ్రాన్వేషకులకు తప్ప సహృదయ విమర్శకులకు ఈ పుస్తకంలో ఎక్కడా అచ్చుతప్పులతో సహా దోషాలు, లోపాలు కనిపించవు.

ఆత్రేయ పాటల వల్లనే విజయవంతమైన చిత్ర మాలికతో ముఖపత్రమూ, ఆత్రేయ కిష్టమైన నటీనటులు, సంగీత దర్శకులు, గాయనీ గాయకులు, నిర్మాతల ఛాయాచిత్రాలతో వెనుక అట్ట అందగించాయి. సిరివెన్నెల సీతారామశాస్త్రి, వరప్రసాదరెడ్డి గార్ల ముందు మాటలు, అట్టవెనుక బాలు ఆశీస్సులు- అతిశయోక్తులు లేకుండా సంక్షిప్తంగా వున్నాయి.

ఇది కేవలం ఆత్రేయ 116 పాటల సంకలనం మాత్రమే అనుకుంటే పొరపాటు! అలా అనుకుంటే వ్యాపార ధోరణిలో తామరతంపరగా ప్రచురిస్తున్న సినీ గేయాల సంకలనాలకు, దీనికి తేడా ఏమంటుంది? వాటితో ఏ మాత్రం పోలికలేని ఈ పుస్తకంలో ఎన్నో ప్రత్యేకతలూ, విశిష్టతలూ వున్నాయి. ఆత్రేయ అందిరికీ తెలిసింది మన'సు' కవిగానే! కాని 'పాడుతా తీయగా'లో ఆత్రేయ విశ్వరూపాన్ని, బహుముఖ ప్రజ్ఞను పైడిపాల అనితర సాధ్యంగా ఆవిష్కరించారు. మనోజ్ఞంగా విశ్లేషించారు. ఆత్రేయ మీద లోకంలో వున్న అపవాదాలను సహేతుకంగా ఖండించారు. అలాగని ఆత్రేయ మీద దురభిమానాన్ని ప్రదర్శించి ఆయనను భుజాలకెత్తుకోకపోవడం ఈ రచనలోని నిష్పాక్షికతకు, సత్యనిష్ఠకు నిదర్శనం. ఆత్రేయ మణి పూసలనదగ్గ మాతృగీతాలనెందుకు రాశారు? మనసు పాటల నేపథ్యమేమిటి? వీణ పాటల వెనుక కథ ఏమిటి? తెలుగు చిత్రాల్లో మనసు పాటలతో పాటు వాన పాటలకు ముద్దు పాటలకు కూడా ఆత్రేయ ఆద్యులా? 'ప్రియురాలు ఎంత కఠినం' అని ఆత్రేయ ఎందుకన్నారు? కణ్ణదాసన్ వంటి ప్రతిభా వంతులైన పరభాషా కవుల మీద కూడా ఆత్రేయ నీడ వుందా? వంటి ఆసక్తికరమైన అనేక ప్రశ్నలకు ఈ పుస్తకంలో సమాధానాలు లభిస్తాయి.

ఆత్రేయ గురించి ఆయన కంటే తనకే ఆ లోతుపాతులు ఎక్కువగా తెలుసునన్నట్టుగా ఆత్మవిశ్వాసంతో ఈ పుస్తకాన్ని రచించిన డా.పైడిపాల, ఇంత మంచి పుస్తకాన్ని తెలుగులోకి తెచ్చిన రసజ్ఞులు డా.వరప్రసాదరెడ్డి అభినందనీయులు. ఇది కొనదగిన, దాచుకొనవలసిన విలువైన పుస్తకమని వేరే చెప్పాలా?

-ఎం.డి అబ్దుల్



నా దారి నాదే!

'ఫిదా' సుందరి సాయిపల్లవి నా దారి నాదే అంటోంది. కథ నచ్చితేనే సినిమా. లేకపోతే లేదు అని గట్టిగానే చెబుతోంది. ఇప్పుడు ఇదంతా ఎందుకు అనుకుంటున్నారా? అక్కడికే వద్దాం.. ఇటీవల దిల్ రాజు సినిమా ఒకటి వస్తే.. అందులో నటించడానికి నో చెప్పేసిందట. అవును నిజంగా నిజమేనంటున్నారు సినీవర్గాలు. ఈ విషయం గురించి సాయిపల్లవిని కదిలిస్తే- 'అవును.. నా కెరీరే నాకు ముఖ్యం. నాకు నచ్చిన సినిమాలే చేస్తాను. నచ్చకపోతే ఎవరు బలవంతం చేసినా చేయను. దిల్ రాజుగారి సినిమా కథ నన్ను ఆకట్టుకోలేదు. అందుకే ఆ చిత్రంలో నటించను అని చెప్పాను. అయితే ఈ సినిమాకి నాకు తక్కువ మొత్తం ఇస్తున్నారని కొందరు, లేదు లేదు చాలా ఎక్కువ ఆఫర్ చేసినా చేయనన్నానని ఇంకొందరు ఇలా ఎవరికి నచ్చింది వారు అనుకున్నారు. ఎవ్వరేమనుకున్నా నా దారి నాదే! మణిరత్నం గ్రేట్ దర్శకులు. అయితే కథ నచ్చలేదు. నాలాంటి వారికి ఆయన దర్శకత్వంలో నటించాలని ఎందుకు ఉండదు? దర్శకుడు గొప్ప వ్యక్తే కావొచ్చు. కథ నచ్చకపోతే ఎలా చేస్తాను? అలా చేస్తే నా క్యారెక్టర్‌కి తగిన న్యాయం చేయలేను. ఇవన్నీ ఆలోచించే మణిరత్నం గారికి చేయలేను అని చెప్పా. అలాగే విక్రమ్ సరసన నటించే అవకాశం వచ్చింది. కానీ కథ నచ్చలేదు. ఆయన సరసన నటించాలంటే నేను చేసే క్యారెక్టర్‌లో దమ్ముండాలి.. ఆ పాత్రకు ప్రాధాన్యత ఉండాలి. అలా లేకపోతే ఆయన పక్కన కనిపించలేం. ఆయన ముందు మన పాత్ర తేలిపోతుంది అనిపించింది. అందుకే చేయడానికి ఒప్పుకోలేదు. ఈ రెండు సినిమాల విషయాల్లోనూ కోలీవుడ్‌లో చాలామంది నన్ను తప్పుపట్టారు. ఏదో ఒకటి, రెండు సక్సెస్‌లకే సాయిపల్లవికి పొగరెక్కిందనీ, ఎవరి మాటా వినదని అన్నారు. ఈ విషయంలో ఎవరేమనుకున్నా పట్టించుకోను. నా పంథాలో నేను పోతాను అంతే' అంటూ చెప్పుకొచ్చింది.






ప్రస్తుతం సాయి పల్లవికి పారితోషికం ఎక్కువ ఇస్తాం.. గ్లామర్‌గా కనిపించమంటున్నారట. 'ముఖం మీద మొటిమలు ఉన్నా తెరమీద అందంగానే కనిపిస్తున్నాను కదా! గ్లామర్ అంటే అందంగా కనిపించడమే' నంటోంది. కొందరి దృష్టిలో అందాల ఆరబోతనే గ్లామర్ అనుకుంటారు. అలా అనుకుని తన దగ్గరకు చాలా మంది వచ్చారని కూడా చెబుతోంది. అలాంటి వారి ఉద్దేశ్యం అర్థమయ్యే వారి సినిమాలు చేయలేదు. గ్లామర్ పేరుతో అందాల ఆరబోత తనకు అస్సలు ఇష్టముండదట. అవే కండిషన్లు అనుకుంటే తను చెప్పగలిగేది ఏమీ లేదు. మరి కొందరు వస్తారు. కథ చెప్పరు. హీరో ఫలానా వ్యక్తి నటిస్తారా? అంటూ నేరుగా అడుగుతారట. అయితే తన దృష్టిలో కథనే హీరో. మిగతా వారంతా నటులే! ఆ కథ తెలుసుకోకుండా ఎలా ఓకే చెబుతాను. తన పక్కన ఎవరు చేస్తున్నారు? అన్నది అస్సలు పట్టించుకోదట. ఇవన్నీ చెబితే కండిషన్లంటారు. ఇక లిప్‌లాక్‌లు లాంటివి తన వల్ల కాదు. తను మధ్య తరగతి అమ్మాయిని. అలాంటి వాటికి తన పేరెంట్స్ అస్సలు అంగీకరించరు. తను సినిమాలు చేస్తానంటే వాళ్లు కొన్ని కండిషన్లు పెట్టారు. అందులో లిప్‌లాక్‌లు ఒకటి. కెరీర్ కోసం మనసు చంపుకోలేదు. ఇది మొదటి కారణం. ఏదో మొహమాటానికి పోయి సినిమాలు చేస్తే ప్రేక్షకులు నా మొహాన్నే మరచిపోతారని కూడా చెబుతోంది. వాహ్.. సాయి పల్లవి దిగ్రేట్ కదా!

-దిల్

అగ్నిపర్వతం





వైజయంతీ మూవీస్ పతాకంపై చలసాని అశ్వనీదత్ నిర్మాతగా, దర్శకేంద్రుడు కె.రాఘవేంద్రరావు దర్శకుడిగా, సూపర్‌స్టార్ కృష్ణ ద్విపాత్రాభినయంతో వచ్చిన ఈ చిత్రం అగ్నిపర్వతం అంటే నాకెంతో ఇష్టం. జమదగ్నిగా, ఇన్స్‌పెక్టర్ చంద్రంగా సూపర్‌స్టార్ కృష్ణ అభినయం చూసి తీరాల్సిందే. అగ్ని- జమదగ్ని అంటూ కృష్ణ పవర్‌ఫుల్ క్యారెక్టర్‌లో విజృంభించి నటించారు. తల్లి శారదను మోసం చేశాడని తండ్రి జగ్గయ్యపై ద్వేషం పెంచుకున్న కొడుకుగా జమదగ్ని పాత్రను దర్శకుడు రాఘవేంద్రరావు శక్తివంతంగా తీర్చిదిద్దాడు. విజయగా విజయశాంతి, రాధగా రాధ, రుద్రరాజుగా ప్రభాకర్‌రెడ్డి, ఫణిభూషణరావుగా రావు గోపాలరావు, డాక్టర్‌గా నూతన్‌ప్రసాద్, జానకమ్మగా అన్నపూర్ణ, పార్వతమ్మగా శారద, నవరస నటనా సార్వభౌమ కైకాల సత్యనారాయణ, పరచూరి గోపాలకృష్ణలు తమ పరిధుల మేరకు నటించారు. పరుచూరి బ్రదర్స్ కథ, మాటలు రాసిన ఈ చిత్రంలో మాటలు చాలా బాగుంటాయి. 'నేను ఏకాంతాన్ని ప్రేమిస్తాను కానీ ఏ కాంతను ప్రేమించలేదు', 'విబితే చెబుతా, చెబితే విబుతా' లాంటి మాటలు పేలాయి. స్వర చక్రవర్తి స్వరపరచిన పాటలన్నీ ఆణిముత్యాలే. ఈ గాలిలో, వయ్యారాలు, సింగారాలు, మంచిముత్యాలు, ఇదే ఇదే రగులుతున్న అగ్నిపర్వతం, రావే ఇంగ్లీషు రంభ, వన్ వన్ వన్ నెంబర్‌వన్, గోడదూకి వచ్చావా చందమామ- ముఖ్యంగా 'ఈ గాలిలో ఎక్కడో అలజడి' పాటను దర్శకేంద్రుడు అత్యద్భుతంగా చిత్రీకరించి ఈ పాటకోసమే మళ్లీ మళ్లీ చూసేలా తీశారు. కామెడీ సన్నివేశాలు బాగున్నాయి. అల్లు రామలింగయ్య దెబ్బ తగిలి ఆసుపత్రికి వెళితే అక్కడ రక్తం ఎక్కించాల్సి రావడం, కాంపౌండర్ సారథి కుక్క రక్తం తీసుకురావడం, చిడతల అప్పారావు వైద్యం చేయడం, రావు గోపాలరావుతో అల్లు రామలింగయ్య వాడు పార్వతమ్మ కొడుకు, వీడు జానకమ్మ కొడుకు అని చెప్పడం బావుంది. 1985లో వచ్చిన ఈ అగ్నిపర్వతం చిత్రం కమర్షియల్‌గా విజయవంతమై అన్ని కేంద్రాలలో శతదినోత్సవం జరుపుకుని ఘనవిజయం సాధించి వైజయంతీ మూవీస్ సంస్థకు తలమానికంగా నిలిచింది.

-జి.గౌరీ గాయత్రి
ఉప్పల్, హైదరాబాద్

నాకు నచ్చిన పాట



'కల కానిది విలువైనది..'

మహాకవి కీ.శే. శ్రీశ్రీగారు అందించిన అమృతగుళిక 'కల కానిది విలువైనది..' అనే పాట అర్ధశతాబ్ది కాలం దాటినా ఇంకా అజరామరమే! నిరాశపడి సాధించేది ఏమీ లేదని- సాహసోపేతమైన సాధనతోనే సమస్తం సమకూరుతాయని తెలియజేసిన ఈ సందేశాత్మక గీతం- సందేహం లేకుండా ఉత్తమ సాహిత్య విలువలు కలిగిందని చెప్పవచ్చు! సాహిత్యానికి సముచిత ఔన్నత్యాన్ని చేకూరేవిధంగా - సంగీతం సమకూర్చిన కీ.శే. పెండ్యాల నాగేశ్వరరావుగారి సమయోచిత బాణీ మరింత కొనియాడదగినది. విలువైన బతుకును కన్నీటి ధారలలో బలిచేయకుండా కాపాడుకోమన్న పల్లవి ఈ పాటకు వెలకట్టలేని విలువను చేకూర్చింది. ఇంక చరణాలలోకి వెళ్తే- గాలికి వాలిపోయే పూల తీగను అలాగే వదిలేయకుండా చేరదీసి నీరు పోసి చిగురించేలా చేయమన్న కర్తవ్యబోధ, అలాగే ఆఖరి చరణంలో - అగాధమౌ జలనిధిలో ఆణిముత్యం ఉంటుందని- శోకాల మరుగున దాగి వున్నదే సుఖమని- ప్రయత్నం లేకుండా ఏదీ మన దరి చేరదని- శోధించి సాధించడమే ధీరుల ఉత్తమగుణమని ఉద్బోధనందించిన ఈ పాటలోని సాహిత్యం సమున్నతమైన సత్యాలను చెప్పి జీవితం విలువల్ని కాపాడే విధంగా కలకాలం నిలిచిపోయింది. అమరగాయకుని అద్భుత స్వరం ద్వారా ఈ పాటలోని గొప్పతనం మరింత ద్విగుణీకృతమైంది. కీ.శే. అక్కినేనివారి అభినయ కౌశలం అనుభవైకమై అలరించింది. ఇటువంటి మంచి పాటల్ని మననం చేసుకొంటూ ఉంటే నేటి సినిమాల్లో ఇటువంటి సందేశాత్మక సాహిత్యం ఎందుకు అందించలేకపోతున్నాం అనే బాధ - హృదయాన్ని కలచివేస్తూ ఉంటుంది. సంగీత సాహిత్యపరంగా పదికాలాలపాటు స్థిరంగా నిలిచిపోయే మంచి పాటలు మళ్లీ వినగలమా? అనే అనుమానం కూడా వస్తోంది! బహుశా అది నిజమేనేమో కూడా!

-మరువాడ భానుమూర్తి
వనస్థలిపురం, హైదరాబాద్

మీకోసం..

తెలుగు చలన చిత్రాలలో ఇప్పటికే ఎన్నో వందల సినిమాలు ప్రేక్షకులు చూసారు. అన్ని చిత్రాల్లో కొన్ని చిత్రాలు మనసును ఆకట్టుకుంటాయి. హృదయాన్ని ఏ పిల్ల సమీర తీరాలకో తీసుకెళతాయి. కొన్ని చిత్రాలు సందేశాత్మకంగా ఉంటే, మరికొన్ని నిత్య నూతనంగా భావించే ప్రేమలాలిత్యంతో అద్భుతంగా ప్రేక్షకుల మనసులలో తొణికిసలాడుతాయి. ఏ సినిమా ఏ ప్రేక్షకుడికి ఎలా నచ్చుతుందో తెలియదు. ఒక్కసారి సినిమా చూశాక ఆ చిత్రం నిరంతరం ప్రేక్షకుణ్ణి వెంటాడింది అంటే అది ఉత్తమ చిత్రమే. అదేవిధంగా ఒక్కసారి మన అద్భుతమైన సంగీత దర్శకులు బాణీలు కట్టిన పాటలు వింటే, మళ్లీమళ్లీ అదే పాట చెవులలో మారుమ్రోగుతుంటే, అది ఉత్తమమైన బాణి. సాహిత్యపరంగా అద్భుతంగా తీర్చిదిద్దిన మాటలు. తమ గానంతో గాయనీ గాయకులు ఆ పాటకు అమరత్వాన్ని చేకూరుస్తారు. అటువంటి గొప్ప పాటలు సినిమాలు మనకు కొదవలేదు. అటువంటి పాటలకు లేక చిత్రాలకు వేదికే ఈ శీర్షిక. మీకు నచ్చిన పాట కానీ, చిత్రం కానీ ఈ శీర్షికలో మీరు పాఠకులతో మీ భావాలు పంచుకోవచ్చు. అయితే, మీకు ఆ పాట కాని, ఆ చిత్రం కాని ఎందుకు నచ్చింది అనే విషయాన్ని సవివరంగా రాయాల్సి వుంటుంది. మీకు నచ్చిన ఆ పాటను కానీ, చిత్రాన్ని కానీ తోటి పాఠకులతో పంచుకోవడానికి ఇది ఉత్తమమైన వేదిక. ఇక ఆలస్యమెందుకు మీకు నచ్చిన పాట లేక సినిమా గూర్చి సవివరంగా వ్రాసి పంపమని ఆహ్వానిస్తున్నాం.

మా చిరునామా
ఎడిటర్, వెన్నెల, ఆంధ్రభూమి దినపత్రిక
36, సరోజినీదేవి రోడ్ , సికిందరాబాద్- 03

వెన్నెల రచయితలకు సూచన

వెన్నెలకు రచనలు పంపాలనుకునే వారు ఈ కింది విషయాలను గమనించగలరు

- ప్రతి మంగళవారం వెలువడే వెన్నెలకు రచనలు శుక్రవారంలోపు చేరాల్సి వుంటుంది.
- రచనల్లో కొత్తదనం ముఖ్యం
- అరిగిపోయిన పాత సినిమా కబుర్లు, శ్రద్ధాంజలి వ్యాసాలు, సినిమాలపై హితబోధల కన్నా, చదివించే కొత్త తరహా వ్యాసాలకు ప్రాధాన్యత వుంటుంది.
- కొత్త సినిమాలపై సమీక్షలు రాయాలనుకున్న ఔత్సాహికులు ముందుగా ఒకటి రెండు సమీక్షలు పరిశీలన కోసం రాసి పంపితే, పరిశీలించగలం.
- తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో వచ్చే కొత్తసినిమాలను పరిశీలించే ఆసక్తి వున్నవారు, సంబంధిత వ్యాసాలు పంపితే అవీ ప్రచురణార్హమే.
- కొత్త హాలీవుడ్ సినిమాలకు సంబంధించిన వ్యాసాలకు కూడా స్వాగతం.
- ఇంతవరకు ఎక్కడా ప్రచురితం కాని, అపురూప చిత్రాలువుంటే పంపొచ్చు.
- రచనలను ఈ మెయిల్‌లో స్కాన్ లేదా పిడిఎఫ్ ఫార్మాట్‌లో vennela@deccan-mail.comకు మెయిల్ చేయగలరు.
- ప్రచురించిన (మీ వ్యూస్ మినహా) ప్రతి వ్యాసానికి పారితోషికం వుంటుంది.

చిరునామా : ఎడిటర్, వెన్నెల, ఆంధ్రభూమి దినపత్రిక ,
36, సరోజినీదేవి రోడ్ , సికిందరాబాద్- 03